


నిష్పక్షపాతం.. సత్యనిష్ఠ..
అంకితభావం..
ప్రజల మేలు కోసం చూపే తెగువ
పత్రికలకు అవశ్యం.



# ఆంధ్రపత్రిక

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం 1914

విజయవాడ సంపుటి : 60 సంచిక : 290 • పేజీలు : 12 • శుక్రవారం 12 జూలై 2024 • వెల : రూ. 5.00 Published from : Vijayawada| Visakhapatnam |Srikakulam | Rajahmundry|Kurnool|Guntur|Ongole| Nellore Tirupati


# ప్రజల రుణం తీర్చుకుంటా

## - సిఎం చంద్రబాబు విమర్శలు

- వైకాపా పాలనతో రాష్ట్రం దివాలా
- డబ్బుల్లేని దుర్భర పరిస్థితి నెలకొంది..
- ఉత్తరాంధ్రను దోచుకున్న జగన్
- రాష్ట్రం నిలదొక్కుకునేలా చేస్తా..
- పోలవరం ఎడమకాలువ పనుల పరిశీలన
- ఫొటో ప్రదర్శనను తిలకించి అధికారులకు పలు సూచనలు
- తెదేపా హయాంలోనే పోలవరం 72 శాతం పూర్తిచేశాం..
- టెండర్లు పిలిచి వీలైనంత త్వరగా ప్రాజెక్టును పూర్తిచేస్తాం..
- గోదావరి జలాలు అనకాపల్లి జిల్లాకు రావాలి
- విశాఖ ఉక్కును కాపాడుకుంటామన్న చంద్రబాబు





**అనకాపల్లి, జూలై 11 (ఆంధ్రపత్రిక):** వైకాపా పాలనతో రాష్ట్రం మొత్తం దివాలా తీసిందని.. డబ్బుల్లేని పరిస్థితి నెలకొందని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రధాని మోదీని కలిసి రాష్ట్ర పరిస్థితి వివరించినట్లు సీఎం తెలిపారు. భగవంతుడు ఇచ్చిన శక్తితో ప్రజల రుణం తీర్చుకుంటానని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ప్రజలు నిలవాలి.. రాష్ట్రం నిలదొక్కుకోవాలని ఆకాంక్షించారు. అరాచకాలు చేసే వ్యక్తిని ప్రజాకోర్టులో శిక్షించారన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటనలో భాగంగా అనకాపల్లి జిల్లా దార్లపూడిలో పోలవరం ఎడమ కాలువను ఆయన పరిశీలించారు. అంతకుముందు దానికి సంబంధించిన ఫొటో ప్రదర్శనను తిలకించి అధికారులకు పలు సూచనలు చేశారు. కాలువను పరిశీలించిన అనంతరం అక్కడి ప్రజలను ఉద్దేశించి సీఎం మాటాడారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తిచేస్తే ఈ జిల్లా అభివృద్ధి మిగతా 7లో

# నీట్ పేపర్ లీక్ వ్యవహారం..

- నీట్ పేపర్ లీకేజీలో మరొకరు అరెస్ట్
- కీలక సూత్రదారి రంజన్ అనే నిందితుడిని పట్టుకున్న సిబిఐ

7లో




# 2026 నాటికి తొలిదశ నిర్మాణాలు పూర్తి



7లో

- భోగాపురం విమానాశ్రయంతో ఆర్థిక పురోగతి
- లక్షల మందికి ఉపాధి దక్కేలా ప్రణాళిక
- గత ప్రభుత్వ హయాంలో ఎయిర్‌పోర్ట్,పోలవరం నిర్లక్ష్యం
- ఉత్తరాంధ్ర పర్యటనలో సిఎం చంద్రబాబు వెల్లడి

## నీట్ పిటిషన్లపై విచారణ వాయిదా



**న్యూఢిల్లీ,జూలై 11 :** నీట్ యూజీ పేపర్ లీకేజీ రద్దు చేయాలంటూ పదుల సంఖ్యలో దాఖలైన పిటిషన్లపై సుప్రీం కోర్టు గురువారం విచారణ /జరిగింది. అయితే నీట్ పరీక్ష రద్దు చేయాల్సిన అవసరం లేదని, అందుకు బలం చేకూరేలా ఆధారాలతో కేంద్రం, నీట్ పరీక్షను నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (నీట్)లు సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశాయి.అదే సమయంలో కేసులో దర్యాప్తు మిగతా 7లో

## బియ్యం ఎగుమతులపై నిషేధం ఎత్తివేత?



**న్యూఢిల్లీ,జూలై 11 :** బాస్మతీయేతర బియ్యంపై నిషేధాన్ని ఎత్తివేసేందుకు మంత్రుల బృందం సమావేశం కానున్నట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. డిమాండ్-సరఫరా, ధరల పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని చర్చలు జరుగుతాయని ఫిక్కీ నిర్వహించిన సమావేశంలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'బస్మతియేతర బియ్యం మిగతా 7లో

## మీ సమస్యలు నాకు వాట్సాప్ చేయొద్దు

### - నారా లోకేష్ వాట్సాప్ బ్లాక్ చేసిన మెటా..



**అమరావతి, జూలై 11 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ బాబు వాట్సాప్ బ్లాక్ అయ్యింది. దీంతో.. సమ స్యలు ఏవైనా ఉంటే తనకు వాట్సాప్ చేయొద్దని.. ఒకవేళ తనదాకా తీసుకురావాలనుకుంటే మాత్రం మెయిల్ చేయాలని కోరుతున్నారాయన.నారా లోకేష్‌కు వాట్సాప్ చేస్తే మిగతా 7లో

## విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ఆందోళన వద్దు

- ప్రధాని ఆశీస్సులతో వందశాతం వృద్ధి సాధిస్తాం
- దేశ ఆర్థికాభివృద్ధిలో స్టీల్‌ప్లాంట్ కీలక భూమిక
- కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి వెల్లడి
- విశాఖ ఉక్కు పరిశ్రమలోని వివిధ విభాగాలను పరిశీలించిన కేంద్రమంత్రి
- విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై అనేక మంది ఆధారపడి ఉన్నారు..



**విశాఖ, జూలై 11 (ఆంధ్రపత్రిక):** విశాఖ స్టీల్ ప్లాంట్ దేశ ఆర్థికాభివృద్ధికి సహాయపడుతోందని కేంద్ర పరిశ్రమలు, ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి అన్నారు. విశాఖ పర్యటనకు మిగతా 7లో

## ఏపిలో ఐఏఎస్‌లు బదిలీలు

- విజిలెన్స్,ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా హరీశ్ కుమార్ గుప్తా
- హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా కుమార్ విశ్వజిత్




**అమరావతి,జూలై 11 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్‌లో భారీగా ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. 19 మంది ఐఏఎస్‌లను మిగతా 7లో

## పవన్ మరో సంచలన కార్యక్రమం



- టీ విత్ డిప్యూటీ సీఎం ...
- జూ పార్కుల అభివృద్ధిపై పవన్ కళ్యాణ్ ఫోకస్
- జూ పార్కుల అభివృద్ధికి పవన్ సూచనలు
- జూ పార్కుల అభివృద్ధిలో కార్పొరేట్లను భాగస్వాముల్ని చేయాలి

**అమరావతి, జూలై 11 (ఆంధ్రపత్రిక):** అంతర్జాతీయ ప్రమాణాలతో జూ పార్కుల అభివృద్ధి కోసం ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రంగంలోకి దిగారు. పర్యాటకులను ఆకర్షించేలా మిగతా 7లో

## ఆర్థికస్థితిని గాడిలో పెడతాం



- ఆర్థికస్థితిని దారిలోకి తేవాల్సిందే
- అదే తనముందున్న అతిపెద్ద లక్ష్యం
- బాధ్యతలు చేపట్టిన ఎపి ఆర్థికమంత్రి కేశవ్

**అమరావతి,జూలై 11 (ఆంధ్రపత్రిక):** రాష్ట్రంలోని ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం.. ఎకానమీని పునరుద్ధరించడం తన ముందున్న ప్రధాన లక్ష్యమని ఎపి ఆర్థిక మంత్రి మిగతా 7లో

## టిడిపి కేంద్ర కార్యాలయంపై దాడి కేసు..

- హైకోర్టులో సజ్జల,ఆర్కే సహా వైసీపీ నేతలకు రిలీఫ్
- 16 వరకు ఎలాంటి దూకుడు చర్యలు తీసుకోవద్దు
- తదుపరి విచారణను 16కు వాయిదా వేసిన హైకోర్టు



**అమరావతి, జూలై 11 (ఆంధ్రపత్రిక):** ఏపీలో గత వైసీపీ పాలనలో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి చేసిన కేసులో వైసీపీ కీలక నేతలకు ఇవాళ భారీ ఊరట లభించింది. వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, లేళ్ల అప్పిరెడ్డి, తలశిల మిగతా 7లో

## తల్లికి వందనం పథకం



- "తల్లికి వందనం" ఒక్క బిడ్డకేనా..!
- త్వరలో ప్రభుత్వ మార్గదర్శకాలు
- ఎన్నికల హామీ మేరకు అమలు చేస్తారా అనేది స్పష్టత ఇవ్వాలి..

**అమరావతి, జూలై 11 (ఆంధ్రపత్రిక):** ఏపీలో కొత్త ప్రభుత్వం ఎన్నికల హామీల అమలుపై కసరత్తు మొదలు పెట్టింది. అధికారంలోకి వచ్చిన తరువాత సూపర్ సిక్స్ మిగతా 7లో

## సరసమైన ధరలకు నిత్యావసర సరుకులు



- సామాన్యులకు అందుబాటులోకి బియ్యం,పప్పులు
- రాష్ట్ర వ్యాప్తంగా 284 ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయం
- త్వరలో చక్కెర, చిరు ధాన్యాలు అందించేందుకు చర్యలు
- పకడ్బందీగా ప్రజా పంపిణీ వ్యవస్థ అమలుకు కృషి
- పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

**విజయవాడ,జూలై 11 (ఆంధ్రపత్రిక):** రాష్ట్రంలో సామాన్యులకు సరసమైన ధరల్లో నిత్యావసర సరుకులను అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషిచేస్తోందని రాష్ట్ర ఆహార, పౌర సరఫరా, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ మిగతా 7లో



ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథములకెల్లన్

# ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

# నదీజలాల సద్వినియోగంపై చర్చించాలి

ఇరు రాష్ట్రాల మధ్య నదీజలాల విషయంలో స్పష్టమైన అవగాహనకు రావాల్సి ఉంది. నదీజలాలు ఏటా సముద్రంలో కలుస్తున్నాయి. వాటిని సద్వినయోగం చేసుకునేందుకు ఉమ్మడిగా ప్రాజెక్టుకులను నిర్మించు కోవడం, నిర్వహించుకోవడం అవసరం.అలాగే వాన నీటిని ఒడిసి పట్టుకోవడంలో ఇరు ప్రభుత్వాలు శ్రద్ద చూపాలి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు వాననీటిని వృధాగా పోకుండా ఉమ్మడిగా ప్రణాళికలు సిద్దంచేయాలి. ఇటీవల కృష్ణా,గోదవారి బోర్డుల్లో పరస్పర ఫిర్యాదులతో నీటి పంచాయితీలను కొనసాగిం చారు. ఇది వాంఛనీయం కాదు. జగన్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడ్డ తొలినాళ్లలో నీటి వాటాలను సహేతుకంగా పంచుకుంటామని, కలసి పోతామని ప్రకటించారు. కానీ ఆ స్ఫూర్తి ఎక్కడా కానరాలేదు. ఇటీవల మరోమారు తెలుగు రాష్ట్రాల సిఎంలు కూర్చుని విభజన సమస్యలను ప్రస్తావించారు. పరస్పర అవగాహనతో ముందుకు పోతామని ప్రకటించారు. అదే సందర్భంలో జలవనరుల విసయంలో పరస్పర అవగాహన అవసరం. సున్నితమైన సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సుహృద్భావం ఉండాలే తప్ప రెచ్చగొట్టే విధానాలు సరికాదు. ఉభయ ప్రభుత్వాలు వీలున్నంత త్వరగా సామరస్యంగా జల వివాదాలను పరిష్కరించుకుని ఇటు రాయలసీమ అటు తెలంగాణలోని కరువు ప్రాంతాలకు నీటిని తరలించే ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలి. ఘర్షణల వల్ల నష్టపోయేది రెండు రాష్ట్రాల్లోని తెలుగు ప్రజలే అని గమనించాలి.కేంద్రం కూడా బోర్డులు ఏర్పాటు చేసినా ఫలితం కానరావడం లేదు. సమస్యలను పెద్దవిగా చేయకుండా పరిష్కరించే మార్గాలను చూపుతూ శాశ్వతంగా సమస్యలకు చెక్ పెట్టగలగాలి. ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల కారణంగా కృష్ణా నది కిందనున్న ప్రాజెక్టులకు ఇప్పటికే నీరు సక్రమంగా అందడం లేదు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ కర్ణాటక, మహారాష్ట్రలకు కేటాయించిన అదనపు జలాలను వారు వినియోగించుకుంటే ఉభయ తెలుగు రాష్ట్రాలకు మిగులు జలాలు కాదుకదా బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన నికర జలాలకు కూడా గ్యారంటీ ఉండదు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కృష్ణాజలాల్లో తమ వాటాగా ఉన్న నికరజలాలకు గ్యారంటీని పొందడంతో పాటు బచావత్ ట్రిబ్యునల్ చెప్పిన పద్ధతిలో మిగులు జలాలను వినియోగించుకునే హక్కును తెలుగు రాష్ట్రాలు కాపాడు కోవాలి. ఇందుకోసం ముందుగా ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య పరస్పర విశ్వాసం, అవగాహన ఉండాలి. ఇరు రాష్ట్రాలు ఉమ్మడిగా కేంద్ర పెత్తనాన్ని ఎదుర్కోవలసి ఉంది. ఎవరివాటాలను వారు వాడుకునే విధంగా నడుచుకోవాలి. వివాదాన్ని కేంద్రమే పరిష్కరించాలని కోరడమనేది శతృవుకు జుట్టు ఇచ్చినట్లు అవుతుంది. నీటి సమస్యలు భావోద్వేగాలను తీవ్రతరం చేయడం సరికాదు. అనేక సమస్యలను పరిష్కరించ లేని కేంద్రం ఇక జల వివాదాలను సరిదిద్దుతుందన్న నమ్మకం లేదు. అందువల్ల ఉన్న ఒప్పందాల మేరకు నడుచుకునే విధంగా తెలుగు రాష్ట్రాల సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు కూర్చుని మాట్లాడి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలి. ఇందులో ప్రదానంగా గోదావరి, కృష్ణాల నుంచి వృధాగా సముద్రంలో కలుస్తున్న నీటిని వినియోగించడంపై నిపుణులతో చర్చించాలి. విభజనకు ముందువరకు కలసి వున్న మనం ఇప్పుడు జగడాలు పడడం తగనిపనిగా పాలకలు,రాజకీయ పార్టీలు,నేతలు గుర్తించాలి. సమస్యలను ఎగదోసే రాజకీయ పార్టీల నేతల తీరును ఎండగట్టాలి. పొరుగు రాష్ట్రాలతో గొడవలు వద్దనుకుంటున్న ఇరు తెలుగు రాష్ట్రాల సిఎంలు ఈ విషయంలో హుందాగానే ఉంటున్నందున సమిష్టిగా సమస్యలను పంచుకోవాలి. తెలంగాణ మంత్రులు కూడా సంయమనంతో సమస్యలను చర్చించాలి. ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో మన బంధాలు బలపడాలి. ప్రభుత్వాలు తమ వాటా నికర జలాలకు కట్టుబడి ఉంటూ, మిగులు జలాలను ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో సామరస్యంగా పరిష్కరించుకోవాలే తప్ప భావోద్వేగాలు రెచ్చ గొట్టడం వాంఛనీయం కాదు. నిజానికి కృష్ణా,గోదావరి చివరి బేసిన్‌లో ఉన్నవి తెలుగు రాష్ట్రాలే. ఈ రెండు రాష్ట్రాలు ఈ నీటిని ఎలా ఉపయోగించుకోవాల అన్నది నిర్ణయించుకోవాలి. దీని ద్వారా ఇరు రాష్ట్రాల రైతాంగం బాగుపడుద్ది. సముద్రంలోకి నీరు వృధాగా పోకుండా ఉమ్మడిగా ప్రాజెక్టులను నిర్మించకునే అవకాశాలను పరిశీలించాలి. పోతిరెడ్డిపాడు నుంచి కిందకు పూర్తిస్థాయిలో నీరు రావాలంటే శ్రీశైలంలో 881 అడుగులు నీళ్లు ఉండాలి. శ్రీశైలంలో పూర్తి నీటి మట్టం 885 అడుగుల నీళ్లు ఉన్న రోజులు గత 20 ఏళ్లలో ఏడాదిలో 20 నుంచి 25 రోజులు కూడా లేవు. ఇలాంటి సమయంలో పోతిరెడ్డిపాడుకు పూర్తి స్థాయిలో నీటిని తీసుకెళ్లలేని పరిస్థితి. మరోవైపు పాలమూరు రంగారెడ్డి, డిండి ప్రాజెక్టు, కల్వకుర్తి సామర్థ్యం పెంచి 800 అడుగులలోపే నీటిని తీసుకునే వెసులుబాటు తెలంగాణకు ఉందంటున్నారు. 796 అడుగుల వద్దే తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. 800 అడుగుల్లోపు లోనే మీకు కేటాయించిన నీటిని వాడుకుంటే తప్పులేనప్పుడు.. 881 అడుగులు ఉంటే తప్ప నీళ్లు వాడుకోలేని పరిస్థితి మాకున్నప్పుడు.. మేం 800 అడుగుల వద్దే మాకు కేటాయించిన నీటిని తీసుకోవడంలో తప్పేముందని ఎపి అధికారులు ప్రశ్నిస్తున్నారు. నిజానికి ఈ విషయాలపై స్పష్టత రావాలి. అలాగే రాజకీయంగా మరిన్ని చర్చలు చేయాలి. ఈ క్రమంలో నదీ జలాల పంపిణీ, నీటి పారుదల ప్రాజెక్టుల నిర్వహణ విషయమై రెండు తెలుగు రాష్ట్రాల మధ్య మరింత లోతుగా చర్చలు సాగాలి. నిజానికి సమస్య ఎక్కడుందో ఆలోచించాలి. ప్రజలకు తాగునీరు, సాగు అవసరాలు, జల విద్యుత్తు, పారిశ్రామిక అవసరాలు... ఇలా నీటి వినియోగ ప్రాధాన్యతలు అంతర్జాతీయ సూత్రాలకు అనుగుణంగా నిర్ణయించబడి ఉన్నాయి. ఆయా నియమాలను పాటిస్తూ, ఏవైనా ప్రత్యేక పరిస్థితులు ఏర్పడితే సర్దుబాటు చేసుకొని పరస్పరంగీకారంతో ఉమ్మడి ప్రాజెక్టులను నిర్వహించుకోవాలి. అప్పుడు కృష్ణా, గోదావరుల్లో మనకు ఉన్నంత నీరును సద్వినియోగం చేసుకోవచ్చు.

# పువ్వాడ శేషగిరిరావు



పద్యాన్ని, గద్యాన్ని జోడెద్దుల్లా నడిపించారు. నాటక రచయితగా సిద్ధహస్తులని పించుకున్నారు. తీరికవేళల్లో బుర్రకథ కూడా రాసి "సెహబాష్" అనిపించుకున్నారు. అందుకే "కవి బాదుషా" గా బిరుదు కూడా అందుకున్నారు. ఆ రచనల్లో ఎంతో ప్రతిభ, పాఠవాలు కలిగి వుంటం వల్లనే కళాశాల విద్యార్థులకు పాఠ్య గ్రంథాలుగా ఎంపికచేయబడ్డాయి. వేలాది మంది విద్యార్థులకు మార్గదర్శకంగా నిలిచాయి. కలం కదిలించుటమే కాదు, గళం కూడా వినిపించి శ్రోతలను తన్మయులను చేసిన దిట్ట పువ్వాడ శేషగిరి రావు.పువ్వాడ శేషగిరి రావు 1906 జూలై 12న జన్మించారు. కృష్ణాజిల్లాలోని మొవ్వ వీరి జన్మస్థలం. మొవ్వకు - ఆధ్యాత్మిక వాదానికి అవినాభావ సంబంధం వుందని విజ్ఞులు అంటారు. క్షేత్రయ్య పద - పల్లవులు వెల్లువలై పారింది మొవ్వ నుంచే. అలాంటి పవిత్ర స్థలంలో జన్మించిన శేషగిరి రావు అందుకు తగిన విధంగా రచనలు చేసి మొవ్వ పవిత్రతను ఇనుమడింపజేశారు. వీరి తల్లి అన్నపూర్ణమ్మ, తండ్రి సుబ్బరామయ్య. పండిత వంశంలో జన్మించిన శేషగిరి రావు తన 13వ ఏటనే కవితారాధన ప్రారంభించి కలం పట్టి, "మలగన్ దేవనదీ సమాగత ల సన్మందానిల స్పందితో జ్వల వాఃపూర తుషార బిందువులు, ఆచ్ఛాదింతు కొందళ్కు పూ సల నున్ బుట్టు రంగు రంగు కయిసేతల్ సేసి, మారంధారలు బిందన్ ఘటియింతు త్రోములకుద ధామృత్వ సిద్ధాంతముల్ " అంటూ గళం విప్పి నినదించారు.పాఠశాల విద్య మొవ్వలోనే చదివిన శేషగిరి రావు హైస్కూలు విద్యను మచిలీపట్నంలోని, హిందూ హైస్కూలులో పూర్తిచేశారు. స్వయంకృషితో ముందుకు సాగుతూ ఉభయ భాషా ప్రవీణ, పి.ఓ.యల్ పట్టాలు అందుకున్నారు. 1929లో విజయవాడలోని యస్.కె.పి.వి.వి హైస్కూలులో తెలుగు పండితునిగా ఉద్యోగజీవితం ప్రారంభించి, 1934 వరకూ, అక్కడే బాధ్యతలు నిర్వర్తించారు. 1934 నుంచి 1935 వరకు మచిలీపట్నంలోనని హిందూ హైస్కూలులో తెలుగు పండితునిగా కొనసాగారు. 1935 నుంచి 47 వరకూ మచిలీపట్నంలోని హిందూ కళాశాలలో ఆంధ్రోపన్యాసకునిగా పనిచేశారు. అటు తర్వాత విజయనగరం వెళ్ళి, అక్కడి మహారాజా వారి కళాశాలలో 1947 నుంచి 51 వరకూ ఆంధ్రోపన్యాసకులుగా పనిచేశారు. అనంతరం మళ్ళీ మచిలీపట్నం వచ్చి అక్కడి ఆంధ్రజాతీయ కళాశాలలో ఆంధ్రోపన్యాసకులుగా 1951 నుంచి 1970 వరకు పనిచేసి పదవీ విరమణ చేశారు. గోవత్సము, తాజ్మహలు, దారా, శతపత్రము, పాలవెల్లి, అపశ్రుతులు, ఆంధ్ర సాహిత్యము లాంటి పద్య కావ్యములు రచించిన శేషగిరిరావు, మధుకలశము, తెలుగు వెలుగులు, దీప కళికలు, పరశురాముడు, ఆంధ్రతేజము, ఏరువాక, ఔరా, ఎవరు ఉత్తములు? పేరిట గద్య గ్రంథాలు రచించారు. 'ఢిల్లీ దర్బారు, దుర్గాదాసు, పృథ్వీపుత్రి, ప్రతాప రుద్రమదేవి, సహపంక్తి, ప్రాణరక్షణ, శిల్పకావ్యము, తిస్సా పరిష్కారము, తొట్రుపాటు, నందనార్, బిల్హణీదయము, లక్ష్మి స్వయంవరము, సత్యప్రభ, చదరంగం' లాంటి నాటకములు రచించి మంచి నాటక రచయితగా గుర్తింపు పొందారు. ఆ కాలంలో వీధి నాటకాలకు, ఎంత ఆదరణ వుండేదో, బుర్రకథలకు కూడా అంతే ఆధరణ వుండేది. అందువల్ల "రక్త తర్పణం" అనే బుర్రకథ కూడా శేషగిరి రావు రచించారు. ఆ రోజుల్లో తెలుగులో వెలువడే సాహిత్య పత్రికల్లో "భారతి" అగ్రస్థానంలో నిలిచేది. శేషగిరిరావు రచనలు భారతి మాస పత్రికలో ప్రచురితమౌతుండేవి. ఆ పత్రిక వ్యవస్థాపకులు కాశీనాథుని నాగేశ్వరరావు, రచనలకు పారితోషికం పంపినా, శేషగిరి రావు తీసుకొనేవాడు కాదట. భారతిలో ప్రచురితమైన శేషగిరి రావు రచనలను 'కవిత' పేరున పుస్తక రూపంగా ముద్రించి ఇచ్చారట కాశీనాథుని నాగేశ్వరరావు.వీరి రచనలు ఆంధ్ర, శ్రీ వెంకటేశ్వర, నాగార్జున, ఉత్కళ విశ్వ విద్యాలయములలో ఇంటర్మీడియట్, బి.ఎ., భాషా ప్రవీణ విద్యార్థులకు పాఠ్యగ్రంథములుగా ఎంపిక చేయబడ్డాయి. వీరి రచనలపై పరిశోధనలు చేసి పి.హెచ్.డి.లు అందుకున్నవారు కూడా ఉన్నారు. పువ్వాడ రచనలపై పరిశోధనా గ్రంథం సమర్పించిన యం. సరస్వతికి ఉ స్మానియా విశ్వ విద్యాలయం 2004లో పి.హెచ్.డి. పట్టా ప్రదానం చేసింది. యం. చందోజీ పువ్వాడ రచనలపై సమర్పించిన పరిశోధనా గ్రంథాలకు శ్రీకృష్ణదేవరాయ విశ్వ విద్యాలయం యం.ఫిల్. పట్టా అందజేసింది.పువ్వాడ రచనల గురించి కొంత వివరణ ఇవ్వటం అవసరం. వీరి తొలి కావ్యం "గోవత్సము" ఈ కథ ఒకనాటి రాత్రి వారి ఇంటి ఆవరణలో జరిగిన సంఘటన 'ఉత్తమ మైన మానవధర్మాన్ని, ఉజ్వలమైన ప్రేమను నిరూపించి, గోవులో గల ఏక ప్రజ్ఞను సమాజ ప్రేమను వెల్లడించటమే ఈ కవుల పరమార్థం' అని కవి స్వయంగా చెప్పుకొన్నారు. దురదృష్ట వశాత్తు ఒక గొల్ల పిల్లవాడు, ఒక లేగదూడ తమ తమ తల్లులకు దూరంకావటం, కవి కృప వల్ల అవి కలుసుకోవటం ఈ కావ్యం ఇతివృత్తం. కృష్ణాపత్రిక ఈ కావ్యాన్ని సమీక్షిస్తూ, ఇందులో మెత్తదనం కన్నా, గాంభీర్యం ఎక్కువ. చక్కలిగింత కన్నా ఊపు ఎక్కువ. పడికట్టు కన్నా పరుగు ఎక్కువ' అని ప్రశంసించింది.శేషగిరిరావు మరో పద్యకావ్యం తాజమహలు తెలుగుతల్లి కిరీటంలో కలికితురాయి. ఈ కావ్యంలోని కరుణరస పోషణ అసమానం, అద్వితీయం, షాజహాను హృదయం లోంచి పొంగిపొర్లిన శోకం కరుణరసమై కావ్య రూపంలో ప్రశంసించింది. ఇక దారా కావ్యం కూడా తాజమహల్తో సరితూగేదే ! దారా సకుటుంబ సమేతంగా మండుటెండలో, ఎడారి మార్గంలో ఆఫ్ఘనిస్తాను వెళ్ళటం, దారిలో అతని భార్య నాదిరా తనువు చాలించటం, గుండె రాయి చేసుకొని కుమారుడు సిఫీరును ఓదార్చుకుంటూ వెళ్ళటం లాంటి దృశ్యాలను చదువుతున్న పాఠకుడు కన్నీళ్ళు పెట్టకుండా ఉండలేడు. పువ్వాడ వారి గద్య కృతుల్లో ముఖ్యమైనవి మధుకలశం, తెలుగు వెలుగులు. ఇది విమర్శనాత్మక సాహిత్య వ్యాసాల సమాహారాలు. "ఆంధ్రతేజము, ఔరా, ఎవరు" చారిత్రక నవలలు. వీరి "కవిబ్రహ్మ తులనాత్మక వ్యాసాన్ని ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు, మొట్టమొదటి ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ప్రచురించారు. 1956లో రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో సన్మానింపబడిన శేషగిరిరావు, 1975లో జరిగిన మొదటి ప్రపంచ తెలుగు సభల్లో కూడా సన్మానించబడ్డారు.పువ్వాడ పద్యం చదివే తీరు విలక్షణంగా, భావ రాగయుక్తంగా ఉండేదని నందమూరి రామ్మోహనరావు ప్రశంసించారు. రంగస్థలంపై నటుడు హావభావ విలాసాలతో పదాలను విరుస్తూ, అర్థమయ్యేట్లు ఎలా చదువుతాడో, పువ్వాడ అచ్చం అలాగే పద్యంలోని ప్రతి పదంను విడదీసి, విడమరచి వీనుల విందుగా, రసవత్తరంగా, హృదయాహ్లాదకరంగా, చదివే ప్రతిభ, ప్రజ్ఞ పువ్వాడకే స్వరితం' అని ప్రశంసించారు ఎ.యస్. అవధాని. 'ఆయన కావ్య గానం చేస్తుంటే కవి, గాయకుడు, నటుడు కలిసిన త్రివేణి సంఘమంలా వుంటుంది' అన్నారు గొర్రెపాటి వెంకట సుబ్బయ్య.తొలి నాళ్ళలో పువ్వాడ శేషగిరి రావు చోడవరపు జానకి రామయ్యతో కలిసి జంట కవులుగా కవిత్వం రాసేవారు. 1927 నుంచి 1933 వరకు వీరు వెలువరించిన కవిత్వంలో భాషలాలిత్యం, సౌకుమార్యం కలబోసి వుండేవి. ఇలా ఎందరెందరో ప్రముఖులు, పండితోత్తములతో కీర్తింపబడిన 'కవి బాదుషా' పువ్వాడ శేషగిరి రావు 1981 మే 24వ తేదీన స్వర్గస్తులయ్యారు.

దాసరి ఆళ్వారస్వామి

# జనాభా లెక్కలు తెల్చేది ఎప్పుడు?



దేశ అభివృద్ధికి కావలసిన మానవ వనరులను అందించడంలో దేశ జనాభా బహుముఖ పాత్ర పోషిస్తుంది. జనగణన చట్టం ప్రకారం భారత దేశంలో ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జనాభా లెక్కలు సేకరిస్తారు.ప్రతి పది ఏళ్ళకు ఒక సారి లెక్కించే జనాభా లెక్కల సేకరణ.వల్ల జనాభా ఎంత మేరకు పెరిగిందో తెలుసుకోవచ్చు. జన గణన ఆధారంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, అభివృద్ధి ప్రణాళిక, అభివృద్ధి పథకాలు ప్రాజెక్టుల నిర్మాణం విద్య వైద్య రంగాల అభివృద్ధి పథకాలు, ప్రజా సంక్షేమ పథకాల రూపకల్పన జరుగుతుంది. జనాభా లెక్కలు సకాలములో చేపట్టక పోవడం వల్ల పేదరికం' నిరుద్యోగం' ప్రాంతీయ అసమానతలు 'ఆర్థిక అసమానతలు ఆదాయ అసమానతలు స్త్రీ 'పురుష అసమానతలు 'లింగ వివక్ష 'బాల కార్మికులు ' శ్రామికుల వలస వికలాంగుల సంక్షేమం మున్నగు సమస్యల పరిష్కారం పై ప్రత్యక్ష పరోక్ష ప్రభావం ఉంటుంది. జనాభా పెరిగిన దేశం (నిష్పత్తిలో) ప్రభుత్వ రంగంలో పెట్టుబడులు పెరగక పోవడం వల్ల రాజ్యాంగ లక్ష్యమైన ఆర్థిక న్యాయం పంపిణీ న్యాయం ఎండమావిగానే మారింది. జాతీయ శాంపిల్ సర్వే జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ఆర్థిక సర్వే మొదలగు కీలక అధ్యయనాలకు జనాభా లెక్కలు కీలకం అయినప్పటికీ జనాభా గణన 3 యేళ్లు ఆలస్యమైంది. కరోనా మహమ్మారి కారణంగా జనాభా లెక్కల సేకరణ ఆలస్యమైంది. పరిస్థితులు చక్కబడిన పృటికి కేంద్ర ప్రభుత్వం జనాభా గణన పట్ల అంతగా ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం జనాభా గణన నిర్వహణ పట్ల స్పష్టత ఇవ్వడం లేదు. జనాభా లెక్కలను వాయిదా వేయడం మీద చూపించే శ్రద్ధ నిర్వహణ పట్ల దృష్టి పెట్టని స్థితి నెలకొనడం వల్ల ప్రజా సంక్షేమం అటకెక్కింది.జనాభా గణన బి చరిత్రమన దేశంలో బ్రిటిష్ వారు తొలి జన గణన 1881 సం" లో నిర్వహించారు. బ్రిటిష్ వాళ్ళ పాలన కాలంలో దేశంలో కొన్ని విపత్తులు సంభవించినప్పటికి జనాభా గణన వాయిదా పడలేదు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో జనాభా లెక్కలు సేకరించారు .వాయిదా వేయలేదు. దేశంలో 1918 లో దేశ వ్యాప్తంగా స్పానిష్ ఫ్లూ ఏర్పడి ప్రజారోగ్యం దెబ్బతిన్న జనగణన ఆగిపోలేదు. 1921 లో రిజిస్ట్రార్ జనరల్ జనాభా లెక్కల కమిషనర్ కార్యాలయం జన గణన సకాలములో పూర్తి చేసింది. 1947 లో దేశ విభజన జరిగి పాకిస్థాన్ భారత దేశంగా విడిపోయినప్పటికీ జనాభా లెక్కలు ఆగిపోలేదు. బ్రిటిష్ వారి నుండి భారతీయులకు అధికార బదిలీ గందరగోళ పరిస్థితులు ఉన్నప్పటికీ 1951 లో జన గణన యదా విధంగా జరిగింది. జనాభా లెక్కలు సేకరణ నిర్వహణకు ఒక సంవత్సరం ముందు నుండే ప్రణాళికలు రూపొందించి ఆ ప్రణాళిక ప్రకారం 2020 ఏప్రిల్ సెప్టెంబర్ మధ్య దేశం లోని అన్ని గృహాలకు వెళ్లి గృహాలలో నివాసం ఉంటున్న వ్యక్తుల వివరాలు సేకరించి తర్వాత సంవత్సరం ఫిబ్రవరిలో దేశము లోని మొత్తం జనాభా లెక్కిస్తారు కాని దేశంలో విజృంభించిన కరోనా మహమ్మారి వల్ల జన కదలిక మీద విధించిన నిబంధనలు అమలు వల్ల జనాభా గణన వీలు పడలేదు. కరోనా అనంతరం జనాభా గణన వాయిదా పడుతూనే వుంది. గతంలో జనాభా గణన సరిగ్గా జరుగలేదని సేకరించిన వివరాలు కచ్చితంగా లేవని జనాభా గణన కొత్త పద్ధతిలో చేపడతామని నూతన సాంకేతిక ఎలక్ట్రానిక్ పద్ధతిలో చేపట్టనున్నట్లు దేశ కేంద్ర హెూంమంత్రి అమిత్ షా వెల్లడించారు ఈ సారి జనాభా గణనలో ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా 35 కంటే ఎక్కువ సామాజిక ఆర్థిక కొలమానాల ఆధారంగా జనాభా లెక్కలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. జన గణన ఆధారంగా జనాభా రిజిస్టర్ ఎలక్టోరల్ రోల్ రిజిస్టర్ 'ఆధార్ కార్డు రేషన్ కార్డు 'పాస్ పోర్ట్ ' డ్రైవింగ్ లైసెన్స్ కు సంబంధించిన వివరాలను డాటాను అప్డేట్ చేసి నవీకరించడానికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు కేంద్ర హెూంమంత్రి అమిత్ షా చెప్పడం గమనార్హం.దేశంలో 2024 న లోకసభకు సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయి .ఎన్నికల వల్ల జనాభా లెక్కల సేకరణ చేపట్టే అవకాశాలు లేవు. దేశంలో లోక్ సభ 'రాష్ట్ర విధాన సభల్లో మహిళా రిజర్వేషన్ బీసీ రిజర్వేషన్ జనగణనలో కుల గణన చేపట్టాలని డిమాండ్ బలంగా వున్నందున 2027 లో జరిగే జనాభా లెక్కల్లో పలు అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. జనాభా లెక్కల ప్రకారం లోకసభకు రాష్ట్ర విధాన సభలకు ఎస్సీ 'ఎస్టీ 'మహిళా' బి'సి రిజర్వేషన్ నిర్ధారించడం లోక్ సభ 'విధాన సభ నియోజక వర్గాల పరిధిని నిర్ణయించడం జరుగుతుంది.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విడివిడిగా ప్రవేశ పెట్టే వార్షిక బడ్జెట్ లో ఎస్సీ ఎస్.ల్టీల బీ.సీ ల సంక్షేమానికి వ్యవసాయ " పారిశ్రామిక ' సేవా రంగాలకు నిధుల కేటాయింపు జనాభా నిష్పత్తి ప్రకారం చెయ్యాలి .జన గణన తో ఆర్థిక వ్యవస్థలో వృధి' అభివృద్ధి స్థాయిలను అంచనా వేయవచ్చును. దేశంలో వెనుక బడిన ప్రాంతాలు పర్వత ప్రాంతాల ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి సమస్యల పరిష్కారం కోసం జనాభా గణన దిక్సూచి లాగా పనిచేస్తుంది.. ప్రభుత్వం జనాభా లెక్కలను నిర్దిష్ట కాలంలో నిర్వహించకపోవడం వల్ల అనేక నష్టాలు జరుగుతున్నాయి.దొంగ ఓట్ల బెడద ప్రభుత్వం జనాభా లెక్కలను సకాలంలో నిర్వహించి వుంటే జనాభా జాబితా తో ఓటర్ల జాబితాను సరిచుకునేది. దీని వల్ల దొంగ ఓటర్ల బెడద నమోదును అడ్డుకునే అవకాశం ఉండేది. దేశవ్యాప్తంగా అనేక నియోజక.వర్గాలలో ఒకే ఓటరు గ్రామీణ ప్రాంతంలో పట్టణ ప్రాంతాల నియోజక వర్గాలలో ఓటర్లుగా నమోదైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్ లో నకిలీ ఓటర్లు అధిక సంఖ్యలో రిజిస్టర్ అయినట్లు తెలుస్తోంది. ఇంటి నెంబర్ "నో " అనే పేరు మీద వందల ఓటర్లు నమోదు అయినట్లు తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరో వైపు నకిలీ ఆధార్ కార్డులు పెరిగి పోతున్నాయి. ఆధార్ కార్డ్ రేషన్ కార్డ్ జన్ దన్ ఖాతాలు ఆధార్ కార్డుతో అనుసంధానించడం వల్ల అనేక ప్రభుత్వ ప్రాయోజిత పథకాల ప్రయోజనాలు అసలు లబ్ధిదారులకు అందడం లేదు. నకిలీ వ్యక్తులు ప్రయోజనం పొందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం సకాలంలో జనాభా లెక్కలు సేకరిస్తే ఇలాంటి నష్టాలను అరికట్ట వచ్చును. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో అటవీ కొండ ప్రాంతాల్లో నివసించే వారికి ఆధార్ కార్డ్ ను అందుబాటులోకి తేవాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరంగా వున్న వారిని అభివృద్ధి సంక్షేమ పథకాలలో భాగ స్వాములను చేయాలంటే జనాభా లెక్కలు సేకరించాలి.

నేదునూరి కనకయ్య

# కృష్ణునికి తగ్గ కొడుకు ప్రద్యుమ్నుడు!



కృష్ణభగవానుడి గొప్పతనం గురించి చెప్పుకొనేదేముంది. బాల్యం లో అల్లరి చేసిన యశోదాకృష్ణుని మొదలుకొని... జీవిత సారాన్ని తేల్చిచెప్పిన గీతాకృష్ణుని వరకూ ఆయనలోని ప్రతి అడుగూ హిందు వులకు పూజనీయమే! కృష్ణుని అన్ని పాత్రలలోనూ చూసిన మనకి తండ్రిగా ఆయన గురించి తెలిసింది తక్కువే! కృష్ణుని కుమారుడైన ప్రద్యుమ్నుని గురించి తెలుసుకుంటే...ఆ లోటూ తీరిపోతుంది. మన్మథుని పునర్జన్మ కృష్ణునికి చాలామంది కుమారులే ఉన్నారు. కానీ వారిలో ప్రద్యుమ్నుడు ముఖ్యుడు. ఒకనాడు శివుని తపస్సుని భంగం చేయబోయి ఆయన కోపానికి భస్మమైన మన్మథుని కథ తెలిసిందే! లోకకళ్యాణం కోసం ప్రయ త్నించి భస్మమైపోయిన తన భర్తని చూసి రతీదేవి గుండె పగిలి పోయింది. తన భర్తని ఎలాగైనా తిరిగి జీవింప చేయమంటూ పరమేశ్వరుని వేడుకుంది. అప్పటికే కోపం చల్లారిన ఈశ్వరుడు, ఆమె భర్త శ్రీకృష్ణుని ఇంట పుడతాడంటూ వరమిస్తారు.అలా శ్రీకృష్ణునికీ, రుక్మిణికీ ప్రద్యుమ్నుని రూపంలో జన్మిస్తాడు మన్మథుడు. **శంభరాసురుని వధ** ప్రద్యుమ్నుడు భూలోకంలో జన్మించే సమయంలో శంభరాసురుడు అనే రాక్షసుడు ప్రజలను పీడించసాగాడు. ఆయనకు ప్రద్యుమ్నుని చేతిలో తప్ప మరెవ్వరి చేతిలోనూ చావు లేదన్న వరం ఒకటి ఉంది. దాంతో చిన్నప్పుడే ప్రద్యుమ్నుని వధించి తనకి శత్రుశేషం లేకుండా చూసు కోవాలనుకున్నాడు శంభరాసురుడు. పొత్తిళ్లలో ఉండగానే ప్రద్యుమ్నుని ఎత్తుకుపోయి సముద్రంలో పడేస్తాడు.సముద్రంలో పడిన ప్రద్యుమ్నుని ఒక చేప మింగుతుంది. విధివశాత్తూ ఆ చేప శంభరాసురుని రాజ్యంలోని జాలర్లకే చిక్కుతుంది. ఆ భారీ చేపను చూసిన జాలర్లు దానిని శంభరాసురునికి బహుమతిగా అందిస్తారు. ఆయన వంటవారు దానిని కోసిచూస్తే ఏముంది! చేప పొట్టలో అందమైన బాలుడు కనిపిస్తాడు. రాజాస్థానంలోని ఒక యువతి ఆ బాలుని పెంచి పెద్దచేస్తుంది. ఎలా పెరిగినా, ఎక్కడ పెరిగినా ప్రద్యుమ్నుడు యోధునిలాగే ఎదిగాడు.ఒకనాడు శంభరాసురుని రాజ్యానికి వచ్చిన నారదుని ద్వారా తన అసలు తండ్రి ఎవరన్న విషయాన్ని తెలుసుకుంటాడు ప్రద్యుమ్నుడు. తనని చంపతలపెట్టిన శంభరాసురుని మీద పగతీర్చుకునేం దుకు బయల్దేరాడు. శంభరాసురునికీ, ప్రద్యుమ్నుడికీ మధ్య జరిగిన భీకర పోరులో ఆ లోకకంటకుడు మరణించాడు. ద్వారకకు చేరిశంభరాసురుని వధ తర్వాత ప్రద్యుమ్నుడు తన తండ్రిని వెతుక్కుంటూ ద్వారకకు చేరుకున్నాడు.రాజ్యంలోకి అడుగుపెట్టగానే కృష్ణుని పోలిన ఆ యువకుడిని చూసి జనమంతా గుమికూడారు. ఆపై అతను చెప్పిన వివరాలు తెలుసుకున్న రుక్మిణీదేవి... తన పొత్తిళ్లలోంచి కనపడకుండా పోయిన బిడ్డ అతనే అని తెలుసుకుంది. మొత్తానికి ప్రద్యుమ్నుని రాకతో కథ కొంతవరకూ సుఖాంతమయ్యింది.అసలే గొప్ప వీరుడైన ప్రద్యుమ్నుడు, శ్రీకృష్ణుని తర్ఫీదులో మరింత రాటుదేలాడు. తండ్రికి తగ్గ తనయుడన్న పేరు తెచ్చుకొన్నాడు.నికుంభుని వధతండ్రికి తోడుగా ప్రద్యుమ్నుడు, కొడుకుని గమనించుకుంటూ కృష్ణుడు ఉండేవారు. అలా వారిద్దరూ కలిసి ఒక రాక్షసుడిని ఎదుర్కొన్న సందర్భం కూడా ఉంది.నికుంభుడనే రాక్షసుడు పరమ శివభక్తుడు. దేవుని చేతిలో కానీ, దేవతల చేతిలో కానీ, దానవుల చేతిలో కానీ తనకు చావు ఉండకూడదనే వరాన్ని పొందినవాడు. మానవులు తననేమీ చేయలేరన్న అహంతో వారి నుంచి చావు రాకూడదన్న వరాన్ని మాత్రం కోరుకోలేదు నికుంభుడు. అదే అతని పాలిట శాపంగా మారింది.మానవ జన్మనెత్తిన శ్రీకృష్ణుని చేతిలో అతని చావు మూడింది. భానుమతి అనే యాదవ రాకుమార్తెని ఎత్తుకుపోయే ప్రయత్నంలో నికుంభుడు కృష్ణుని ఎదుర్కొంటాడు. ఒకవైపు కృష్ణుడు, మరోవైపు ప్రద్యుమ్నుడు ఆ రాక్షసుని ఎదిరించి అతన్ని తుదుముట్టిస్తారు.తండ్రిని నొప్పించకుండాకురుక్షేత్ర సంగ్రామంలో యాదవులంతా కౌరవులవైపు, కృష్ణుడు మాత్రం పాండవుల పక్షాన నిలిచిన విషయం తెలిసిందే! కానీ ప్రద్యుమ్నుడు మాత్రం తండ్రికి వ్యతిరేకమైన పక్షంలో ఉండేందుకు ఇష్టపడలేదు.కురుక్షేత్ర సంగ్రామానికి దూరంగానే ఉన్నాడు. ప్రద్యుమ్నుని శ్రీకృష్ణుని అంశగా భావిస్తారు. పైగా వైష్ణవాస్త్రం అనే అద్భుతమైన అస్త్రం కలిగినవాడు. అలాంటి ప్రద్యుమ్నుడు కురుక్షేత్ర సంగ్రామంలో ఉంటే పోరు ఇంకెంత రసరవత్తంగా ఉండేదో!ప్రద్యుమ్నుడు తన మేనమామ కూతురైన రుక్మావతిని వివాహం చేసుకున్నాడు. వారిద్దరికీ పుట్టిన అనిరుద్ధుడు కూడా అసమాన్యునిగా పేరుగాంచాడు.

సేనాధిపత్యం రమేష్

# నిత్యవసర వస్తువుల ధరల నియంత్రణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం

## రాష్ట్ర గనులు, మైనింగ్, జియాలజీ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర





**మచిలీపట్నం, జూలై 11 ( ఆంధ్రపత్రిక):** రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల అధికధరల నియంత్రణ కు, ధరల స్థిరీకరణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర గనులు భూగర్భ జల ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన కంది పప్పు, స్టీమ్డ్ బియ్యాన్ని తక్కువ ధరకు అందిం చాలన్న లక్ష్యంతో రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. స్థానిక రైతు బజార్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్ ను గురువారం జాయింట్ కలెక్టర్ తో కలిసి మంత్రి ప్రారం భించారు. మంత్రి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రైతు బజార్ల ద్వారా కంది పప్పు, స్టీమ్డ్ బియ్యం విక్రయాలను గురువారం ప్రారంభించామన్నారు. బహిరంగ మార్కెట్ ధరల కన్నా తక్కువ గా నాణ్యమైన బియ్యం, కంది పప్పును అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో తొలుత రైతు బజార్లకు శ్రీకారం చుట్టిందే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడన్నారు. రైతు బజార్ల ద్వారా రైతులే నేరుగా తమ ఉత్పత్తుల ను ప్రజలకు విక్రయించే సౌకర్యాన్ని కల్పించామన్నారు. గతంలో తాము నగరంలో రెండవ రైతు బజారు ను ఏర్పాటు చేయగా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, దీనిని కూడా పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. వచ్చే నెల నుండి రేషన్ షాపుల ద్వారా పంచదార కూడా సరఫరా చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.

జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు బియ్యం, కందిపప్పు వంటి నిత్యవసరాలను మార్కెట్ ధరల కంటే తక్కువగా ఫైన్ రకం బిపిటి/ సోనామసూరి రా రైస్ కేజీ .48/- , స్టీమ్ రైస్ కేజీ .49/-, దేశవాళీ కందిపప్పు కిలో.160/- రూపా యలకు విక్రయించడం జరుగుతుందని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలి పారు. తొలుత జాయింట్ కలెక్టర్ రైతు బజార్లో కూరగాయల ధరలు, రేట్ల పట్టికలు పరిశీలించారు.

బోర్డు పై ప్రదర్శించిన ధరలకే విక్రయిస్తున్నదీ , లేనిదీ వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. విక్రయ దారులు, వినియోగదారులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతు బజారు పరిశుభ్రంగా ఉంచాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయాలు జరపాలని, వినియోగదారుల నుండి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని అధికారులకు సూచించారు.

ఆర్డీవో ఎం వాణి, డీఎస్ఓ వి. పార్వతి, నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు,తాసిల్దారు వెంకటేశ్వరరావు తదితర అధికా రులతో పాటు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ బందరు నియోజకవర్గ ఇన్చార్జ్ బండి రామ కృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, గొర్రెపాటి గోపీచంద్ ,కుంచె నాని, లంకె నారాయణ ప్రసాద్, కాగిత వెంకటేశ్వరరావు, కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ, పి. వి .ఫణి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలపై భారం పడకుండా సబ్సిడీపై నిత్యవసర సరుకులు పంపిణీ



**కైకలూరు జులై 11( ఆంధ్రపత్రిక ):** ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం కైకలూరు మండలం కైకలూరు మార్కెట్ యార్డ్ నందు ప్రజలపై భారం పడకుండా సబ్సిడీపై నిత్యవసర సరుకు లు పంపిణీ చేసిన శాసనసభ్యులు డాక్టర్ కామినేని శ్రీనివాస్ పం పిణీ చేశారు. సందర్భంగా కామినేని మాట్లాడుతూ పెరిగిన బియ్యం, కందిపప్పు నిత్యవసర సరుకులు ధరలను తగ్గించి రైతు బజార్లు, హోల్ సేల్ దుకాణాల ద్వారా ఎన్డీఏ కూటమి ప్రభు త్వం అందిస్తుందని తెలిపారు. కైకలూరు రైతు బజార్లో బయట మార్కెట్లో కిలో దేశవాళీ కందిపప్పు 181 రూపాయలు ఉండగా 160 రూపాయలకే, అదేవిధంగా స్టీమ్డ్ బియ్యం బిపిటి/ సోనా మసూరి బయట మార్కెట్లో 55.85 ఉండగా 49 రూపాయలకి బియ్యం పచ్చిబిపిటి / సోనా మసూరి బయట మార్కెట్లో 52.40 ఉండగా 48 రూపాయలకు ప్రభుత్వం అంది స్తుందని కామినేని తెలిపారు. నియోజకవర్గంలో దుకాణ దారు లందరూ ఈ విధం గా విక్రయించాలనికోరారు. రైతు బజార్ ముందు భాగంలో ఇటు వంటి తోపుడు బండ్లు పెట్టకుండా కేవలం రైతు బజార్ కి వచ్చే వాహనదారులు పార్కింగ్ గా ఉపయోగించాలని పోలీసులను ఆదే శించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు ప్రజా ప్రతినిధులు, రైస్ మర్చంట్ అసోసియేషన్సభ్యులు, శ్యామల కిరాణా మర్చం ట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్డీయే ప్రభుత్వం వల్లే ఆక్రమణదారుల నుంచి స్థలానికి విముక్తి

### ఎన్డీయే నాయకులకు స్థల యజమాని వెంకటేశ్వరరెడ్డి కృతజ్ఞతలు



**విజయవాడ పశ్చిమ, జూలై 11, (ఆంధ్రపత్రిక):** స్థానిక భవాని పురం శివాలయం సెంటర్ వద్ద ఉన్న తమ స్థలాన్ని ఆక్రమణ దారులనుండి కాపాడుకునేందుకు వీలు కల్పించిన రాష్ట్రంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి స్థల యజమాని సామల వెంకటేశ్వర రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. గురువారం సాయంత్రం 42వ డివిజన్ శివాలయం సెంటర్లోని తన స్థలం వద్ద మీడియాతో ఆయన మాట్లాడారు. తాము గతంలో స్థానిక 42 డివిజన్ కార్పొరేటర్ పి. చైతన్య రెడ్డి మామ సుబ్బారెడ్డితో కలిసి ఆ ప్రాంతంలో దాదాపు 240 గజాల స్థలాన్ని ముగ్గురం కలిసి కొనుగోలు చేయడం జరిగిందని, ఆ స్థలంలో షాపులు నిర్మించడం జరిగిందని వివరించారు. అయితే తన వాటాకు రావలసిన అద్దెలను ఏనాడు సుబ్బారెడ్డి తనకు ఇవ్వలేదని, పైపెచ్చు ఆ స్థలాన్ని తమకే అమ్మాలని పలుమార్లు బెదిరించాడని చెప్పారు. ఈ విషయమై తాను భవానిపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా నాటి వైసిపి ప్రభుత్వ హయాంలో తనకు ఏ మాత్రం న్యాయం జరగలేదని వెంకటేశ్వర రెడ్డి వివరించారు . అలాగే తనపై ఎదురు కేసులు కూడా పెట్టారని చెప్పారు. అయితే రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత తన స్థలం తనకు దక్కిందని, తాను స్థలాన్ని స్వాధీనం చేసుకున్నానని వెంకటేశ్వరరెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ,విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని , విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తన వాటా స్థలాన్ని తాను తీసుకున్నానని, అయితే తనకు రావలసిన షాపుల అద్దెలు మాత్రం ఇంతవరకు సుబ్బారెడ్డి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర రెడ్డి సతీమణి ఆదిలక్ష్మి కూడా పాల్గొని తమ స్థలం తమకు దక్కినందుకు చంద్రబాబు ప్రభుత్వానికి, నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు మేలు చేస్తా



**బాపట్ల,జూలై 11, (ఆంధ్రపత్రిక):** ప్రభుత్వ ఆశయాలకు అను గుణంగా అందరి సహకారంతో ప్రజలకు మేలు జరిగేలా పనిచే స్తానని నూతన జిల్లా సంయుక్త కలెక్టర్ బి సుబ్బారావు తెలిపారు. జిల్లా సంయుక్త కలెక్టర్ గా కలెక్టరేట్లో గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ముందుగా జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనం తరం మీడియాతో మాట్లాడారు. అన్నింటిలో ప్రజలకు న్యాయం జరిగేలా చూడడం, ప్రజలు ఆనందంగా ఉండటమే లక్ష్మమని జిల్లా సంయుక్త కలెక్టర్ చెప్పారు. గ్రీవెన్స్ కార్యక్రమాలలో అత్యధి కంగా రెవిన్యూ సమస్యలపైనే అర్జీలు వస్తున్నాయని వాటిని తక్షణ మే పరిష్కారిస్తామన్నారు.

రెవెన్యూ శాఖపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటాను, జిల్లా అభివృద్ధికి నా వంతు కష్టపడి పని చేస్తానన్నారు. వివిధ శాఖల్లో వివిధ హోదాలలో పనిచేసిన అనుభవం ఉంద న్నారు. తన అనుభవాలను మీడియాతో పంచుకున్నారు. ప్రభు త్వ సర్వీసులో 34 సంవత్సరాలు సేవ చేసే అవకాశం లభిం చిందన్నారు. 2017 ఐఏఎస్ బ్యాచ్ లో ఎంపికైనప్పటికీ జిల్లా సంయుక్త కలెక్టర్గా తొలిసారి బాధ్యతలు చేపట్టానన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటాన న్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించిన వారిలో బాపట్ల చీరాల రేపల్లె ఆర్డీవోలు జి రవీందర్ జి సూర్య నారాయణ రెడ్డి, హేలా షారోన్, కలెక్టరేట్ ఏవో లక్ష్మీకుమారి, పలువురు తహసిల్దార్లు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## బాపట్ల జిల్లాలో ప్రభుత్వ విద్యా సంస్థలను ఏర్పాటు చేయాలి




**బాపట్ల,జూలై 11, (ఆంధ్రపత్రిక):** బాపట్ల జిల్లాలో ప్రభుత్వ విద్యా సంస్థలను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కే. ప్రసన్న కుమార్ అన్నారు. గురువారం బాపట్ల ప్రజా సంఘాల కార్యాలయంలో ఎస్ ఎఫ్ ఐ జిల్లా ముఖ్యుల సమావేశం జరిగింది. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన నేపథ్యంలో ప్రకాశం గుంటూరు జిల్లాల నుండి బాపట్ల జిల్లా కొత్తగా ఏర్పడినది . ఈ ప్రాంతం వ్యవసాయ కార్మికులు దళితులు వెనుకబడిన తరగతుల కౌలు రైతులు ఎక్కువగా నివాసం అంటారు.

ఇక్కడ పేద విద్యార్థులు చదువుకునేందుకు అవసరమైన ప్రభుత్వ విద్యా సంస్థలను ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంది . విద్యా రంగంగా అభివృద్ధి చెందుతున్నటువంటి బాపట్ల జిల్లాలో ప్రధాన పట్టణాలైనా బాపట్ల చీరాల లో డిగ్రీ చదువుకునేందుకు కో ఎడ్యుకేషన్ ప్రభుత్వ కళాశాలలు లేకపోవడం వలన ఈ ప్రాంతా లలో విద్యార్థులు ప్రైవేటు కళాశాలలకు వెళ్లి చదువుకుంటున్నారు. అదేవి ధంగా పీజీ కోర్సులు చదువు కునేందుకు దూర ప్రాంతా లైన గుంటూరు ఒంగోలుకు విద్యార్థులు వెళుతున్నారు. కాబట్టి బాపట్ల జిల్లాలోనే ప్రభుత్వ పిజి సెంటర్ ఏర్పా టుకోసం నూతనంగా ఏర్ప డిన ప్రభుత్వం ఈ ప్రాం తం లోని ఎమ్మెల్యేలు జిల్లాలోని మంత్రులు కృషి చేయాలని కోరారు.

అదేవిధంగా గత ప్రభుత్వం సంక్షేమ హాస్టల్లో అభివృద్ధి నిస్మరిం చింది నిధులు కేటాయించ లేదు. విద్యార్థులకు ఇవ్వాల్సిన కాస్మోటిక్ చార్జీలు నోట్ పుస్తకాలు ట్రంకు పెట్టెలు ప్లేట్లు గ్లాసులు ఇవ్వకుండా వాటికి నిధులు కేటాయించకుండా మా ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం ఉన్నదంటూ మాటలు చెప్పి సంక్షేమ హాస్టల్ విద్యార్థులను మోసం చేశారు. గత సంవత్సరం విద్యార్థుల కు ఇవ్వవలసిన పది నెలల కాస్మోటిక్ చార్జీలు ఇవ్వకుండా నిధులను మిగిల్చుకుంది . నూతనంగా ఏర్పడిన ప్రభుత్వమైన సంక్షేమ హాస్టల్ లో అభివృద్ధికి నిధులు కేటాయించి ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టను భర్తీ చేసి పెండింగ్ కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు . ఈ సమావేశం లో జిల్లా అధ్యక్షులు శివశంకర్, ఉపాధ్యక్షులు మనోజ్ కుమార్ ,జిల్లా కమిటీ సభ్యులు.. హేమ నాగశ్రీ, ప్రేమ్ చందు ,నాయకులు నితిన్, సందీప్,నవీన్,అహ్మద్ పాల్గొన్నారు.

## పారిశ్రామిక వేత్తల సమావేశం



**కైకలూరు జులై 11( ఆంధ్రపత్రిక ):** ఏలూరు కలెక్టరేట్ నందు జిల్లా కలెక్టర్ కె. వేట్రి సెల్వి ఆధ్వర్యంలో పారిశ్రామిక వేత్తల సమావేశంలో పాల్గొన్న పార్లమెంట్ సభ్యులు పుట్ట మహేష్ కుమార్, రాష్ట్ర గృహనిర్మాణ శాఖమాత్యులు నూజి వీడు శాసనసభ్యులు కొలు సు పార్ధసారథి, మాజీ మంత్రివర్యులు కైక లూరు శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ , ఏలూరు శాసన సభ్యులు బడేటి రాధాకృష్ణ (చంటి), ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు, చింతల పూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ , పోలవరం శాసనస భ్యులు చిర్రి బాలరాజు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి అవార్డు సాధించిన సెయింట్ ఆన్స్ ఫార్మసీ అధ్యాపకుడు



**వేటపాలెం, జూలై 11 (ఆంధ్రపత్రిక):** సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ అధ్యాపకుడు గర్నెపూడి దిలీప్ కుమార్ జాతీయస్థాయి అవార్డు సాధించినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి వి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల ప్రకటించిన ఆవిష్కార అవార్డ్స్ 2024 లో నేషనల్ లెవెల్ బెస్ట్ యంగ్ టీచర్ ఆఫ్ ద ఇయర్ అవార్డును దిలీప్ కుమార్ సాధించినట్లు తెలిపారు. ఫార్మసీ ఎడ్యుకేషన్ సైంటిఫిక్ రీసెర్చ్ పై ఆయన చేసిన కృషికి ఈ అవార్డు ప్రదానం చేశారన్నారు. దిలీప్ కుమార్ రాసిన టెక్స్ట్ బుక్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఫార్మసీ - 1 పాఠ్య గ్రంథమును ప్రీతం పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మహారాష్ట్ర వారు ఇటీవల ప్రచురించారన్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్ బి రమణమూర్తి, వివిధ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు అభినందనలు తెలిపారు.

## నాలుగు నెలలుగా పెండింగ్‌లో మెస్ బిల్లులు

**బాపట్ల ,జూలై 11 (ఆంధ్రపత్రిక):** నాలుగు నెలలుగా బీసీ హాస్టళ్ల మెస్ బిల్లులు పెండింగ్లో ఉన్నాయి. అలాగే విద్యుత్ బిల్లులు రావాల్సి ఉంది. బాపట్ల జిల్లాలో 42 బీసీ హాస్టళ్లు ఉన్నాయి. ఫిబ్రవరి, మార్చి,ఏప్రిల్ ,జూన్ నెలల బిల్లులు ప్రభుత్వం చెల్లించక పోవడంతో సంక్షేమ వసతి గృహ అధికారులు ఆర్థిక ఇబ్బందులూ పడుతున్నారు. ప్రస్తుతం మెనూ ప్రకారం ఒక్కో విద్యార్థికి సరాసరి రూ 50 మెస్ ఖర్చులకు ప్రభుత్వం కేటాయిస్తుంది. ఇప్పుడున్న మెనూ ప్రకారం పిల్లలకు ఆహారం అందించాలంటే రూ 60 నుంచి 70 వరకు ఖర్చు అవుతుంది. పెరిగిన ధరల ప్రకారం ప్రభుత్వం ఇస్తున్న మొత్తానికి మెనూ అందించడం కష్ట సాధ్యం గా ఉంది. వసతి గృహ అధికా రులు ఈ భారాన్ని మోయాల్సి న పరిస్థితి. దీనికి తోడు బిల్లులు సకాలంలో రాకపోవడం వలన అప్పులు చేసి మెనూ అందిస్తున్నారు. మూడవ తరగతి నుంచి 4 వ తరగతి పిల్లలకు నెలకు 1100,5 నుంచి 10 వ తరగతి విద్యార్థులకు రూ 1400,ఇంటర్ విద్యార్థు లకు 1600 ప్రభుత్వం మెస్ బిల్లుల కింద ప్రభుత్వం ఇస్తుం ది. అయితే సకాలంలో బిల్లులు వేయడం లేదు. దీని వలన అప్పులు చేసి ఆహారం అందించే పరిస్తితి ఏర్పడింది. కొంత మంది అధికా రులు చేతి డబ్బులు ఖర్చు పెట్టి ఆర్థిక ఇబ్బందులూ పడుతున్నారు. ప్రస్తుత ధర ను పెంచి సరాసరి రూ 60 ఒక్కో పిల్లవాడికి ఇస్తే ఈ మెనూ అందించడం సాధ్యం అవుతుంది. అలా చేస్తేనే నాణ్యమైన ఆహారాన్ని అందించడం జరుగుతుంది. లేకుంటే నాణ్యత తగ్గే అవకాశం ఉంది. ఈ విషయాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకొని బిల్లులు చెల్లిస్తే అధికారులకు కష్టాలు పోతాయి.

## ఐఐఐటిలో సీట్లు సాధించిన జడ్పీ పాఠశాల పందిళ్ళపల్లి విద్యార్థులు

**వేటపాలెం, జూలై 11 (ఆంధ్రపత్రిక):** 2023- 24 విద్యా సంవత్సరంలో జిల్లా పరిషత్ పాఠశాల, పందిళ్ళపల్లి లో 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారిలో 5గురు విద్యార్థినీ, విద్యార్థులు ఐఐఐటి లో సీట్లు సాధించారని ప్రధానోపాధ్యాయులు ఎమ్. శేఖరరావు గురువారం ప్రకటనలో తెలిపారు.

వీరిలో ములకల శ్యామల, కోణంకి భార్గవ్ లకు నూజివీడు ఐఐఐ టి లో, వంగర రోహిణి, ఆశోది హర్ష, సజ్జ శివ సాయి శ్రావణ్ ఒంగోలు ఐఐఐటి లో సీట్లు సాధించారన్నారు. ఈ సందర్భంగా ఐఐఐటి సీట్లు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయిని, ఉపాధ్యా యులు అభినందనలు తెలియచేశారు.

## ఎమ్మెల్యే సుజనా ఆదేశాలతో మంచినీటి పైపులైన్లకు మరమ్మతులు



**విజయవాడ పశ్చిమ, జూలై 11, (ఆంధ్రపత్రిక):** ఇటీవల మంచినీటి పైపు లైన్లకు సంబంధించిన సమస్యలపై కార్పొరేషన్ అధికారులకు విజయ వాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి తగు ఆదే శాలు ఇవ్వడం జరిగింది. నియోజకవర్గం లో త్రాగునీటి పైపులైన్లు అని సక్రమంగా ఉన్నాయా లేవా అని ఎమ్మెల్యే ఆరా తీశారు. పలు ప్రాంతాల్లో త్రాగునీటి పైపులైన్ల సమస్య నెలకొని ఉందని స్థానికుల నుంచి వచ్చిన విన్నపాలు సేకరించి సంబంధిత అధికారులకు తెలియజేశారు. 47వ డివిజన్ కె ఎల్ రావు నగర్ ప్రాంతంలో చిన్న చర్చి , అడ్డ రోడ్డు ప్రాంతంలో మంచినీటి పైపులు సమస్య ఉందని, సంబంధిత పైపులైన్లు కు మరమ్మత్తులు చేయించాలని 47 వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మక్కెన భాస్కర్ కుమార్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సుజనా చౌదరి సంబంధిత అధికారులకు త్రాగునీటి పైపులైన్లు కు మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. కార్పొరేషన్ సిబ్బంది కెఎల్ రావు నగర్ చిన్నచర్చి అడ్డ రోడ్డు ప్రాంతంలో త్రాగునీటి పైపులైనుకు సంబంధించి మరమ్మతులు చేపట్టారు. స్థానికులు తమ సమస్య పరిష్కరించిన సుజనా చౌదరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ధరల స్థిరీకరణతో మధ్య తరగతి ప్రజలకు మేలు



**పొన్నూరు ,జూలై 11, (ఆంధ్రపత్రిక):** ధరల స్థిరీకరణ తో మధ్య తరగతి ప్రజలకు మేలు జరిగేలా నిత్యావసరాల ధరల తగ్గించి ప్రజలకు ప్రభుత్వం అందిస్తుంది. స్థిరీకం ఇలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో స్థానిక రైతు బజార్ నందు తక్కువ ధరల కు అందించే నాణ్యమైన స్టీమ్ బియ్యం , దేశవాళీ కందిపప్పు అంది ంచే స్టాల్ ను గురువారం స్థానిక తహ సిల్దార్ సూర్యనారాయణ సింగ్ ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోరి ధరలను స్థిరీకరించేందుకు నాణ్యమైన నిత్యవసరాలను తక్కువ ధరలకు అందించే నిమిత్తం రైతు బజార్ నందు స్టాల్ ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. . స్టీమ్ బియ్యాన్ని కేజీ 49 రూ.లకు, సాధారణ బియ్యాన్ని కేజీ 48 రూ.లకు, దేశవాళీ కందిపప్పును కేజీ 160 రూ.లకు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బివి చౌదరి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు ,తెదేపా, జనసేన, బిజెపి కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



**కర్లపాలెం,జూలై 11, (ఆంధ్రపత్రిక):** పభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే పిల్లల విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. గురువారం కర్లపా లెం మండలం పేరలి గ్రామం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కిట్స్ పంపిణీ చేసారు. విద్యార్ధులు చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పేరలి బాల కృష్ణమూర్తి, వైభూపతిరావు,ఎం.బుల్లియ్య,గేరా ఏసోబు తెలుగుదేశం, జనసేన, బీజేపీ,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమణాలను తొలగించి పేద ప్రజలకు అండగా నిలబడండి

### జిల్లా కలెక్టర్‌కు బిజెపి ఎస్సీ మోర్చా నాయకుల వినతి



**గుంటూరు , జులై 11( ఆంధ్రపత్రిక ):** ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఆక్రమణ దారుల పరిస్థితిపై గుంటూరు జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు ధార అంబేద్కర్ నేతృత్వంలో ఎస్సీ మోర్చా నాయకులు మరియు బిజెపి నాయకులు స్థానిక బాధితులకు అండగా నిలబడి ఆక్రమణదారుల వైఖ రిని గుంటూరు జిల్లా కలెక్టర్ కి విన్నవించు కోవటం జరిగినది. దానికి వెంటనే కలెక్టర్ తగిన చర్యల ను తీసుకుంటానని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగినది. వివరములోకి వెళ్ళగా తాడికొండ అసెంబ్లీ పరిధిలో గల ఫిరంగిపురం స్టేషన్ రోడ్డులో కల ఆక్రమణ లపై గురువారం స్థానికులు కలెక్టర్ నీ కలిసి ఆక్రమణదారుల యొక్క వైఖరిని స్థానికుల స్థలాలకు దారికి అడ్డంగా మురుగు కాలువలపై ఆక్రమణదారులు నివాసం ఏర్పరచుకొని కొన్ని సంవత్సరాల నుండి స్థానికులను పలు రకాలుగా ఇబ్బంది పెడుతున్న వైఖరిని వారి ఖాళీ స్థలాలలో ఇల్లు కట్టుకో వాలన్న మధ్యతరగతి స్థానికుల అభిలా షను నెరవేరక పోవటం పై వారిలో నెలకొని ఉన్న తీవ్రమైన నిరాశ నిస్పృహలతో యజమానులై నటువంటి పవన్ కుమార్, వీరేశం గుప్తా, దాసరి జోజప్ప, భ్రమరాంబ, అంజన తదితర లు కలెక్టర్ కి విన్నవించుకోవడం జరిగినది. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ త్వరలోనే విచారించి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## అమరావతి సబ్ రీజియన్ అఫ్ యంగ్ మేన్స్ క్రిస్టియన్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి

**గుంటూరు , జులై 11( ఆంధ్రపత్రిక ) :** అమరావతి సబ్ రీజియన్ అఫ్ యంగ్ మెన్స్ క్రిస్టియన్ అసోసియేషన్ అడ్ హాక్ కమిటీ సమావేశం గురువారం స్టాల్ గర్ల్స్ స్కూల్ గుంటూరు లో జరిగినది. చైర్మన్ మోపర్తి సునీల్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు నిర్ణయాలు కమిటీ ఆమోదిం చింది. ముఖ్యముగా అసోసియేషన్ విశ్వాసాన్ని చాటుట మరియు అసోసియేషన్ కార్యక్రమములు విస్తరించుటకు పలు సూచనలు సభ్యులు పరిశీలించి ఆమోదించారు, వీటిని వెంటనే అమలు చేయుటకు నిర్ణయము తీసుకొన్నారు. ఈ కార్యక్రమంలో దార విజయ్ కుమార్, వైస్ చైర్మన్, సిస్టర్ రావూరి సత్య జ్యోతి, కన్వీనర్, వసీమల్ల విజయ్ కుమార్, కోశాది కారి గొర్రెముచ్చు రాజు, సందెపోగు లక్ష్మణ్ బాబు, సభ్యులు పాల్గొన్నారు.

## సమష్టి భాగస్వామ్యంతో
# జిల్లా సమగ్రాభివృద్ధికి కృషిచేద్దాం

- జాతీయ రహదారుల పెండింగ్ పనుల సత్వర పూర్తికి కృషిచేయాలి
- డయేరియాకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు.
- తండాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)



**విజయవాడ,జూలై 11(ఆంధ్రప్రతిక):** అధికారులు, ప్రజాప్రతినిధుల సమష్టి భాగస్వామ్యంతో జిల్లా సమగ్రాభివృద్ధికి కృషిచేద్దామని, సరైన ప్రణాళికలతో నిధుల సక్రమ వినియోగంతో మంచి ఫలితాలు వస్తాయని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు.గురువారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజ గోపాల్ (తాతయ్య), జిల్లా కలెక్టర్ డా. జి.సృజన.. జాతీయ రహదారులు, వైద్య ఆరోగ్య శాఖ, గ్రామీణ నీటి సరఫరా, జీజీహెచ్ కార్యకలాపాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్‌హెచ్ఏఐకు సంబంధించి పెండింగ్ ప్రాజెక్టులు, డీపీఆర్, సర్వీసు రహదా రులు, విస్తరణ పనుల పూర్తికి ఎదురవుతున్న సమస్యలు తదితరా లపై చర్చించారు. అదే విధంగా జిల్లాలో డయేరియాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రణాళికాయుతంగా తీసుకుంటున్న చర్యలు, ఎ.కొం దూరు డయాలసిస్ కేంద్రం సేవలుబీ జల జీవన్ మిషన్ పనులు, పైపులైన్ల మరమ్మతులు, ఓహెచ్ఎస్ఆర్ల స్థితిగతులు తదితరాలపై చర్చించారు.ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ విజయవాడ బైపాస్ పనుల సత్వర పూర్తికి అవరోధంగా ఉన్న హైటెన్షన్ లైన్ల మార్పు పనులను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని, పరిహారం చెల్లింపు ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలన్నారు. నగర ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు వీలుగా ఎన్‌హెచ్-16లో మహానాడు రోడ్డు నుండి నిడమనూరు వరకు మెగా ఫ్లైఓవర్‌కు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పనపై దృష్టిసారిం చాలన్నారు. ఎ.కొం దూరు ప్రాంత ప్రజలకు కిడ్నీ సమస్యలు ఎదురు కాకుండా ఉండేం దుకు శాశ్వత పరిష్కారం దిశగా తాగునీటి వ్యవస్థల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని..

ఎ.కొండూరు దయాల సిస్ కేంద్రం ద్వారా మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేయాల న్నారు. సేవలు అవసరమైన వారిని గుర్తించి.. పూర్తిస్థాయిలో సేవలందించాల న్నారు. ఇప్పటి వరకు జిల్లాలో జల్ జీవన్ మిషన్ కింద చేపట్టిన పనులపై సమీక్షించారు. తాగునీటి సరఫరా పనులకు సంబంధించి డీపీఆర్‌లు కూడా తయారు చేయాలని సూచించారు. ఎన్ఆర్ఈ జీఎస్, ఎంపీల్యాడ్స్, సీఎస్ఆర్ నిధుల వినియోగంతో తాగునీరు, డ్రెయినేజీ వ్యవస్థల మెరుగుతో ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. పాడైన పైపు లైన్లు, ఓహెచ్ఎస్ఆర్‌ల తక్షణ మరమ్మతుల పనులకు సంబంధించి చర్యలు తీసుకోవాలన్నారు.

సమావేశంలో దృష్టికి వచ్చిన అంశాల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ డా. జి.సృజన తెలిపారు. త్వరలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, సమస్య ల పరిష్కారానికి కృషిచేయనున్నామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్డీవో బీహెచ్ భవానీ శంకర్, ఎన్‌హెచ్ఏఐ పీడీ పార్వతీశం, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ డీవీ రమణ, డీఎంహెచ్ వో డా. ఎం.సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన
# సరుకులు అందాలి

రాష్ట్ర వ్యాప్తంగా 282 కౌంటర్లు ఏర్పాటు

నూజివీడు రైతుబజార్ వద్ద బియ్యం, కందిపప్పు అమ్మకాల ప్రత్యేక కౌంటర్ ప్రారంభించిన రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి.



**నూజివీడు,జూలై 11** పేద ప్రజలకు నాణ్యమైన నిత్యావసర వస్తువులు సరసమైన ధరలకు అందించే చర్యలు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని రాష్ట్ర గృహ నిర్మాణ,సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. గురువారం నూజివీడు రైతు బజార్ వద్ద ఏర్పాటు చేసిన బియ్యం, కందిపప్పు అమ్మకాల ప్రత్యేక కౌంటర్ ను ఆయన ప్రారంభించారు. షాపులోని సరుకుల నాణ్యత, తూకం పరిశీలించారు. పలువురు కార్డుదారులకు స్వయంగా సరుకులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 282 ప్రత్యేక కౌంటర్ల ద్వారా సరఫరా చేస్తున్న బియ్యం,కందిపప్పు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో నేడు ప్రజా పాలన ప్రారంభమైందనీ, ఇక నుండి ప్రతి ఒక్కరికీ మేలు జరగబోతోందనీ మంత్రి పార్థసారధి భరోసా ఇచ్చారు. ప్రత్యేక కౌంటర్లో కందిపప్పు (దేశవాళీ వెరైటీ )కేజీ రూ.160 (బహిరంగ మార్కెట్ ధర కేజీ రూ.181)బిపిటి/సోనా మసూరి ఫైన్ రైసు (స్టీము) కేజీ రూ.49 (బహిరంగ మార్కెట్ ధర .55.85 పై), బిపిటి/ సోనా మసూరి ఫైన్ రైసు (రార్రైసు) కేజీ రూ.48 (బహిరంగ మార్కెట్ ధర.52.40 పై.) ధరలకు విక్రయించేందుకు ఏర్పాట్లు చేశారన్నారు. గత 6 నెలలనుండి నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటడంతో సామాన్య ప్రజలు అష్ట కష్టాలు పడుతున్నారని దాన్ని అరికట్టి సామాన్య ప్రజలకు తక్కువ ధరలకే సరుకులు అందించాలనే సంకల్పంతో రాష్ట్ర పౌరసరఫరాల మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ ఆలోచించి ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లిన తదనంతరం రైతు బజారుల్లో ఈ ప్రత్యేక కౌంటర్ను ఏర్పాటు చేసినట్లు మంత్రివర్యులు తెలిపారు.కార్యక్రమంలో నూజివీడు ఆర్డీవో వై. భవానీశంకరి, డిఎస్ఓ ఆర్.ఎస్.ఎస్.రాజు, స్థానిక నాయకులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తూర్పు నియోజకవర్గంలోని
# అన్ని సమస్యలను పరిష్కరిస్తాం

కార్పొరేషన్లో వైకాపా నిధులు అవకతవకలపై విచారణ చేస్తాం



**విజయవాడ,జూలై 11(ఆంధ్రప్రతిక):** 30.48 లక్షలతో రోడ్ల పనులకు శంకుస్థాపన చేసిన కేశినేని శివనాథ్, గద్దె రామమోహన్ తూర్పు నియోజకవర్గంలోని అన్ని సమస్యలను పరిష్కరిస్తామని, అవసరమైతే కేంద్రం నుంచి నిధులను తెచ్చి సమస్యలను పరిష్కరిస్తామని, 2019-23 మధ్య కాలంలో కార్పొరేషన్లో జరిగిన నిధులు అవకతవకలపై విచారణ జరిపిస్తామని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. గురువారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 4వ డివిజన్లో రూ.19.98 లక్షలతో శ్రీనగర్ కాలనీ మెయిన్ రోడ్డు, రూ.10.50 లక్షలతో భారతీనగర్లో 6వ రోడ్డు పునర్నిర్మాణ పనులకు ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే గద్దె రామమో హన్, ఇన్చార్జీ కమీషనర్ డాఎఎ ఎ. మహేష్ లు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం నోవోటెల్ వైపు గల సర్వీసు రోడ్ నిర్మాణ పనులను పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తిచేయా లని అధికారులను ఆదేశించారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడు తూ విజయవాడ కార్పొరేషన్ ఖజానాలో నిధులు మిగలాలి అని 2014-19 చంద్రబాబు నాయుడు పనిచేశారన్నారు. 2019-23లో వైఎస్సా ర్సీపీ ప్రభుత్వ హాయంలో కార్పోరేషన్ నిధులు మళ్ళింపు జరిగిందని దానిపై విచారణ జరిపిస్తామన్నారు. విజయవాడ అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని, అవసరమైతే కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చి నగరాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. నిధులు కొరత ఉన్నా అభివృద్ధిని ఆగనివ్వమని చెప్పారు. భారతీనగర్లో అన్ని రోడ్లను అభివృద్ధి చేస్తామన్నారు. సిద్ధార్థ మెడికల్ కళాశాల నుంచి నిడమానూరు వరకు ఫ్లైవోవర్ నిర్మాణ పనులు కూడా త్వరలో టెండర్లు పిలుస్తామని చెప్పారు. ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ 2014-19 సంవత్సరంలో అధికారంలో ఉన్నప్పుడు ఉద్యోగుల జీతా ల భారం కార్పోరేషన్పై పడకుండా ప్రభుత్వ ఖజానా ద్వారా చెల్లించేందుకు చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేశారన్నారు. దాని ఫలితమే రాష్ట్రంలోని అన్ని కార్పోరేషన్లల్లో నిధుల కొరతతో ఇబ్బందులు పడుతున్నా విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్కు ఆ ఇబ్బంది లేదన్నారు. ఆ నిధులతో నగరంలోని రోడ్లను నిర్మాణం చేసుకుంటు న్నామని చెప్పారు. ఈ డివిజన్లో రోడ్లు పూర్తిగా దెబ్బతిని ప్రజలు ఇబ్బందులు పడుతున్నా, తెదేపా అభిమానులు ఈ ప్రాంతంలో అధికంగా ఉన్నారనే అక్కసుతో మున్సిపల్ అధికారులకు రోడ్లు నిర్మా ణం చేయాలని చెప్పినా, ఇక్కడ రోడ్లు నిర్మాణం చేయనివ్వకుండా గత ప్రభుత్వంలోని కొందరు అడ్డుపడ్డారన్నారు. తాము పార్టీలతో సంబంధం లేకుండా అన్ని ప్రాంతాలను సమంగా అభివృద్ధి చేస్తామన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో సమస్యలను నూటికి నూరు శాతం పరిష్కరిస్తామన్నారు. అభివృద్ధి పనులకు అవసరమైతే కేంద్రం నుంచి ఎంపీ కేశినేని శివనాథ్ సహకారంతో నిధులు తీసుకువచ్చి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. స్ట్రామ్ వాటర్ పథకంలో భాగంగా మిగిలిన నిధులను కూడా తీసుకువచ్చి డ్రైనేజీ పనులను పూర్తి చేస్తామని చెప్పారు. ఇన్చార్జీ కమీషనర్ మహేష్ మాట్లాడుతూ 10.5లతో ఇక్కడ రోడ్డు నిర్మాణం చేస్తున్నామన్నారు. గతంలో ఈ రోడ్డుపై వర్షం నీరు నిల్వ ఉండేదని చెప్పారు. ఈ రోడ్డు పునర్నిర్మాణ పనులు చేపట్టడం చాలా సంతోషం గా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కొమ్మారెడ్డి పట్టాభి, కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి ఉషారాణి, చెన్నుపాటి గాంధీ, జోనల్ కమీషనర్ ఎస్. శివరామకృష్ణ, ఈఈ జి.సామ్రాజ్యం, ప్రాజెక్ట్ డైరెక్టర్ పార్వతీశం, ఎ.డి శివరామప్రసాద్, ఏ.ఈ మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

## జ్యువెలరీ ఎమినెన్స్ అవార్డ్స్ 2024లో
# అత్యున్నత గౌరవాన్ని పొందిన కీర్తిలాల్స్



**విజయవాడ,జూలై 11(ఆంధ్రప్రతిక):** సాటిలేని హస్తకళా నైపుణ్యానికి, కాలాతీత శోభకీ మారుపేరుగా నిలిచే కీర్తిలాల్స్, జైపూర్ లో జరిగిన జ్యువెలరీ ఎమినెన్స్ అవార్డ్స్ (జెఇఎ) 2024లో రెండు ప్రతిష్టాత్మక అవార్డులని గెలుచుకుంది. ఈ బ్రాండ్ అక్కడ "జెమ్‌ఫీల్డ్స్ కలర్ స్టోన్ బ్రైడల్ జ్యువెలరీ", ఇంకా "డైమండ్ బేంగిల్ / బ్రేస్లెట్" అవార్డులని అందుకుంది. ఈ సందర్భంగా కీర్తి లాల్ బిజినెస్ స్ట్రాటజీ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్ మాట్లాడుతూ బ్రాండ్‌కు ఆభరణాల రూపకల్పనలో నవీకరణ, సృజనాత్మకత, శ్రేష్ఠతపట్ల వున్న నిబద్ధతకు గాను ఈ అవార్డులు గుర్తింపుగా నిలుస్తాయన్నారు. కీర్తిలాల్స్ సాధించిన ఈ విజయం, సాంప్రదాయం, ఆధునికతల మేలు కలయికతో విశిష్టమైన ఆభరణాలని రూపుదిద్దడంలో ప్రత్యేకతని ఎత్తిచూపు తుందన్నారు. మనసుని దోచుకునే శ్రేష్ఠమైన నగల్ని రూపుదిద్దడానికి సాంప్రదాయ హస్తకళానైపుణ్యాన్ని, సమకా లీన డిజైన్లతో మేళవించి కీర్తిలాల్స్ ఎప్పూడూ పరిశ్రమలో సరికొత్త ప్రమాణాల్ని నెలకొల్పడాన్ని కొనసాగిస్తూనే వుందన్నారు. సున్నితమైన, అతిచక్కటి ఆభరణాల విషయం లో తన సారథ్యస్థానాన్ని మరోసారి దృఢపరుచుకుంటూ పరిశ్రమ సారథిగా కీర్తిలాల్స్ తన స్థానాన్ని పదిలపరుచుకుందని తెలిపారు.

## ప్రైవేటు పాఠశాలలకు
# అమ్ముడుపోయిన విద్యాధికారులు



**సిద్దిపేట,జూలై 11(ఆంధ్రప్రతిక):** సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా విద్యను వ్యాపారం చేస్తున్న పలు ప్రయివేట్ మరియు కార్పొరేట్ విద్యా సంస్థలపై విద్యాధికారులు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఏఐఎస్‌బి ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ కొండ ప్రశాంత్ ఆవేదన వ్యక్తం చేసారు.ఈటీవల జరిగిన ప్రైవేటు విద్యా సంస్థలపై ధర్నాలు ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు అధికారులు కలిసి కమిషనర్ తో ప్రైవేటు పాఠశాల పై ధర్నాలు చేయకూడదు కఠిన చర్యలు తప్పవు అని చెప్పించి, ప్రైవేటు పాఠశాలలు కార్పొరేట్ సంస్థలు కలిసి ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తూ పుస్తకాలు యూనిఫామ్‌లు అమ్ముకుంటూ లక్షల్లో లాక్కుంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఏం చేయలేని పరిస్థితి లాగా మారిపోయిందని ఏఐఎస్‌బి ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ కొండ ప్రశాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రయివేట్ మరియు కార్పొరేట్ విద్యా సంస్థలపై మా విద్యార్థి సంఘము ఆధ్వర్యంలో భౌతిక దాడులు తప్పవని కొండ ప్రశాంత్ హెచ్చరించారు. సిద్దిపేట కమిషనర్ సి పి బి. అనురాధ తక్షణమే విద్యార్థి సంఘాలపై ప్రకటించిన ప్రకటనను వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.నిరుపేద విద్యార్థులకు అన్యాయం జరిగితే గతంలా తెరాస ప్రభుత్వాన్ని పాతరేసినట్టు, తెలంగాణ రాష్ట్రంలా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూడా మా విద్యార్థి సంఘాలు విద్యార్థులతో కలిసి మట్టు పెడతామని ఏ ఐ ఎస్ బి ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ కొండ ప్రశాంత్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ప్రశ్నించే నాథుడే లేకపోయారు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన తీరు ఇదేనా అంటూ ప్రజలు ఆరోపిస్తున్నారని ఆయన మండిపడ్డారు. రానున్న రోజుల్లో మా ఏఐఎస్‌బి ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతమని కొండ ప్రశాంత్ అన్నారు. ఈ కార్యక్రమంలా సిద్దిపేట జిల్లా నాయకులు రాజు, కృష్ణ, మహేష్, స్వామి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో
# పాల్గొన్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్



**కోడూరు, జులై 11 (ఆంధ్రప్రతిక):** కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గం కోడూరు మండల ప రిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎం పి డి ఓ శ్రీనివాసరావు, ఎమ్మార్వో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశ కార్యక్రమం ఏర్పాటు చేయడమైనది ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల్లో నుంచి కోడూరు మండలానికి సంబంధించిన అన్ని శాఖల అధికారులు మరియు ఎంపీటీసీ, జడ్పిటిసిలు ఈ కార్యక్రమంలో పాల్గొనడం అయినది అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ గ్రామంలోని పలు కీలకమైన అంశాలు గురించి మాట్లాడటం జరిగింది ఆ విషయంలలో అధికారులు స్పందించి తగు సమాధానాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి యాదవ్ రెడ్డి వెంకట సత్యనారాయణ, మండల ఎంపిపి కొండవీటి వెంకట కుమారి, గ్రామాల సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## శాంసంగ్ నుంచి గెలాక్సీ
# జెడ్ ఫోల్డ్ 6, జెడ్ ఫ్లిప్6



**విజయవాడ,జూలై 11(ఆంధ్రప్రతిక):** ప్యారిస్‌లో జరిగిన గెలాక్సీ అన్‌ప్యాక్డ్ కార్యక్రమంలో గెలాక్సీ బడ్స్3, గెలాక్సీ బడ్స్3 ప్రోతో పాటు తమ సరికొత్త గెలాక్సీ జెడ్ ఫోల్డ్6, గెలాక్సీ జెడ్ ఫ్లిప్6ని విడుదల చేస్తున్నట్లు శాంసంగ్ వెల్లడించింది. కొత్త గెలాక్సీ జెడ్ సిరీస్ పరిచయంతో, శాంసంగ్ తమ అత్యంత వైవిధ్యమైన, అనువైన ఫారమ్ ఫ్యాక్టర్‌ని ఉపయోగించడం ద్వారా వినూత్నమైన మొబైల్ అనుభవాలను అందించటం ద్వారా గెలాక్సీ ఏఐ యొక్క తదుపరి అధ్యాయాన్ని తెరుస్తోంది. గెలాక్సీ ఏఐ కమ్యూనికేషన్, ఉత్పాదకత, సృజనాత్మకత యొక్క కొత్త శకాన్ని వేగవంతం చేయడానికి శక్తివంతమైన, తెలివైన, మన్నికైన ఫోల్డబుల్ అనుభవాన్ని ఉపయోగిస్తుంది.

## అధునాతన పడ్లింగ్ సొల్యూషన్లతో
# రైతులకు సాధికారత కల్పిస్తున్న స్వరాజ్




**విజయవాడ,జూలై 11(ఆంధ్రప్రతిక):** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్లలో ప్రత్యేకంగా మాగాణి నేలల్లో సాగులో తలెత్తే సవాళ్లను ఎదుర్కొనేందుకు మహీంద్రా గ్రూప్ లో భాగమైన స్వరాజ్ ట్రాక్టర్స్ సమగ్రమైన పడ్లింగ్ సొల్యూషన్స్‌ను అందిస్తోంది. స్వరాజ్ 843 ఎఫ్ఎం, 742 ఎక్స్, 744 ఎఫ్ఎస్ఈ, స్వరాజ్ 855 ఎస్ఈ అనే స్వరాజ్ మోడల్స్‌లో అధునాతన ఫీచర్లు పొందుపర్చబడ్డాయి. స్వరాజ్ ట్రాక్టర్లు 4-వీల్ డ్రైవ్ ఆప్షన్తో లభిస్తాయి. తడి, బురద నేలల్లో కూడా ఇవి అత్యుత్తమ కర్షణ సామర్థ్యాన్ని అందిస్తాయి. పనులు నిరాటంకంగా సాగేందుకు, జారిపడే సమస్యలు తలెత్తకుండా ఇవి సమర్థంగా పని చేస్తాయి. ఈ ట్రాక్టర్ల లో 12 ఫార్వర్డ్, 3 రివర్స్ గేర్లతో విస్తృతమైన స్పీడ్ శ్రేణి ఉంటుంది. గరిష్ట పడ్లింగ్ వేగాలను అందించేందుకు, సమర్థమంతమైన, ప్రభావవంతమైన పడ్లింగ్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన సౌత్ స్పీడ్ వేరియంట్‌ను స్వరాజ్ అందిస్తోంది. వినూత్నమైన 1-ఆర్ గేర్ సెటప్‌ను ఫార్వర్డ్ గేర్ కు ఎదురుగా ఉంచడం వల్ల ఫార్వర్డ్, రివర్స్ గేర్లను మార్చడం వేగంగా, సులభతరంగా ఉంటుంది.

## ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపులో
# జీవో నెం.107, 108 రద్దు చేయాలి

ఏపీ మెడికో పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఆల వెంకటేశ్వర్లు




**విజయవాడ,జూలై 11(ఆంధ్రప్రతిక):** దేశంలో ఎక్కడా లేని రీతిలో ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం. 107,108 రద్దు చేసి, ఎంబీబీఎస్ ఆశావాహులకు న్యాయం చేయాలని ఏపీ మెడికో పేరెంట్స్ అసోసియేషన్ కోరింది. విజయవాడలోని ఎంబీవీకేలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, అడ్వకేట్ రాగూర్ యాదవ్, పేరెంట్స్ ప్రతినిధి చంద్రశేఖర్ మాట్లాడారు. ఏపీలో కొత్తగా ప్రారంభించిన మెడికల్ కాలేజీల్లో సీట్ల కేటాయింపు కోసం విడుదల చేసిన జీవోల వల్ల వందల మంది విద్యార్థులు నష్టపోయారని వెంకటేశ్వర్లు తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్లు పాటించకుండా, ప్రభుత్వ నిధులతో నిర్మించిన కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్ పేరుతో అమ్ముకోవడం తగదన్నారు. గత ఏడాది ఈ జీవోలను టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు తప్పుబట్టారని గుర్తు చేశారు. తక్షణమే చంద్రబాబు ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకుని ఆరెండు జీవోలు రద్దు చేయాలని డాక్టర్ ఆల డిమాండ్ చేశారు.

## కల్తీ ఆహారము, మందులు, ఎరువులుపై
# చర్యలు తీసుకోవాలి



**విజయవాడ,జూలై 11(ఆంధ్రప్రతిక):** బత్తుల ఆదినారాయణ ప్లీడర్ తెలుగుదేశం పార్టీ పలనాడు జిల్లా ఉపాధ్యక్షులు వక ప్రకటనలో విలేకరులకు తెలిపారు.గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా మద్యం కల్తీ, ఆహారం కల్తీ, మందుల కల్తీ, రైతులను మోసం చేసి కల్తీ విత్తనాలు మందులు అమ్మకాలు జరిపి కోట్ల రుపాయలు అక్రమ రవాణా యథేచ్ఛగా చేసి సంపాదించిన అక్రమ వ్యాపారులను వారి వ్యాపారానికి అడ్డు కట్ట వేయాలని కోరారు. ఇది జగన్ ప్రభుత్వం కాదని, నిజాయితీగా ఉండాలని, కన్నా లక్ష్మీనారాయణ మాజీమంత్రిలు ,ప్రస్తుత శాసన సభ్యులుగా అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. అందుకు సంబంధించిన అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు లేకుంటే మీరు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

# ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- సుహృద్భావంతో కలిసి పని చేద్దాం
- రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపుదాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షల మేరకు అభివృద్ధి లక్ష్యాలను చేరుకుందాం
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అగ్రికల్చరల్, మార్కెటింగ్, కోపరేటివ్ శాఖామాత్యులు కె. అచ్చంనాయుడు



**విజయవాడ,జూలై 11(ఆంధ్రపత్రిక):** గత ప్రభుత్వ పరిపాలనా విధానాల కారణంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా ఉన్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షన్ దారులకు, ఇతర ప్రభుత్వ రంగ శాఖల ఉద్యోగులకు నిర్ణీత సమయంలో జీతాలు చెల్లించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుసరించిన పరిపాలన విధానాలే కారణమని రాష్ట్ర అగ్రికల్చరల్, మార్కెటింగ్ కోపరేటివ్ శాఖామాత్యులు కింజరాపు అచ్చన్నాయుడు అన్నారు. రాష్ట్ర ఎన్జీవో సంఘం అధ్యక్షులు కె.వి. శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి పురుషోత్తం చౌదరి, ఎన్టీఆర్ జిల్లా ఎన్జీవో సంఘ అధ్యక్షులు ఏ. విద్యాసాగర్ లు ఏపీఐఐసీ కాలనీలోని మార్క్ఫెడ్ కార్యాలయంలో గురువారం మంత్రికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అచ్చం నాయుడు మాట్లాడుతూ ఉద్యోగుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అపారమైన ఆదరాభిమానాలు ఉన్నాయ న్నారు. గడచిన ఐదేళ్లలో ప్రభుత్వ ఉద్యోగులు ఎంతో మానసిక ఒత్తిడిని, అవమానాలను భరించి ప్రస్తుత ప్రభుత్వానికి అండగా నిలవడం ముదావహం అన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేసరికి ప్రభుత్వ ఖజానాలో ఒక్క రూపాయి కూడా నిల్వ లేనప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అందరికీ న్యాయం చేసేందుకు ముఖ్యమంత్రి చేస్తున్న పరిపాలనకు ఉద్యోగులు కూడా తమ సహకారాన్ని అందించడం రాష్ట్ర అభివృద్ధికి శుభ పరిణామం అని చెప్పారు. గతంలో ముఖ్యంగా మంత్రి పదవిలో ఉన్న కాలంలో సైతం ప్రభుత్వ ఉద్యోగులకు ఎక్కడా లోటు లేకుండా వారి ఆర్థిక, ఆర్థికేత ర ప్రయోజనాల అమలు విషయంలో ఖచ్చితమైన నిర్ణయాలతో ఉద్యోగులను సంతృప్తి పరిచిన ఎన్నో సందర్భాలను ఉద్యోగులందరూ గుర్తుంచుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు అంటే ప్రభుత్వంలో ఎంతో కీలకమని ముఖ్యమంత్రి పలు సందర్భాలలో చెప్పారని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న అధ్వాన పరిస్థితులను చక్కదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్దేశించుకున్న అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ఉద్యోగులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరేందుకు సంపూర్ణ సహకారం అందించాలన్నారు. ఉద్యోగ సంఘాల నాయకులు గతంలో తమ సమస్యలను చెప్పుకునేందుకు కూడా అవకాశం లేని దౌర్భాగ్య పరిస్థితు లు ఇకముందు ఉండవన్నారు. ప్రభుత్వంలోని ప్రతి మంత్రి ఉద్యోగుల సమస్యలను వినడంతో పాటు ప్రతి సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లి సత్వర పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. అంతిమంగా రాష్ట్ర పురోభివృద్ధి లక్ష్యంగా ఉద్యోగులు, ప్రభుత్వం సుహృద్భావ వాతావరణంలో కలిసి పని చేద్దామని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వంలో జరిగిన ఆర్థిక విధ్వంసంపై ఆయా శాఖలలో విచారణ కొనసాగుతోందని, రాష్ట్రానికి నష్టం కలిగించిన ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. చిత్తశుద్ధితో ఉద్యోగుల పట్ల ఎంతో అభిమానం కలిగిన ముఖ్యమంత్రి మన రాష్ట్రంలో ఉన్నందుకు మనందరం గర్వించాల్సిన సందర్భంగా మంత్రి అన్నారు. ఎన్నికల హామీలో భాగంగా ఉద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఒక్క హామీని నిలబెట్టు కునేందుకు ముఖ్యమంత్రికి మనం అవకాశం ఉన్నంత మేరకు సహకరించి రానున్న 5 ఏళ్లలో అత్యంత వేగవంత మైన అభివృద్ధి సాధించేందుకు పునరంకితం కావాలని మంత్రి అచ్చం నాయుడు ఉద్యోగులకు వివరించారు. మంత్రిని కలిసిన వారిలోఎన్జీవో సంఘ రాష్ట్ర నాయకులు రంజిత్ నాయుడు, శివప్ర సాద్, మహిళా విభాగం నాయకులు నిర్మల కుమారి, శాంతి, అగ్రికల్చరల్ డిపార్ట్మెంట్ ఉద్యోగుల సంఘం నాయకులు వేణుమాధవ్, సాయి కుమార్, పశుసంవర్ధక శాఖ ఉద్యోగ సంఘాల నాయకులు సేవా నాయక్, రామకృష్ణ, గ్రామ సచివాలయ ఉద్యోగ సంఘాల నాయ కులు జానీ పాషా తదితరులతో సహా వివిధ విభాగాల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలపై

# ప్రత్యేక దృష్టి

**రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి**



**విజయవాడ,జూలై 11(ఆంధ్రపత్రిక):** జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, జర్నలిస్టుల సమస్యలపై తనకు అవగాహన ఉందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసారథి అన్నారు. జర్నలిస్టుల పలు సమస్యలపై గురువారం ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఏపీ ఎం పి ఏ) రాష్ట్ర నాయకులు మంత్రి పార్థ సారథిని కలిశారు. జర్నలిస్టుల బీమా పాలసీ, జర్నలిస్టుల పిల్లల కు ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజు రాయితీ, పెన్షన్ పథకం అమలు, ఇళ్ల స్థలాల జీవో మార్పు, హెల్త్ ఇన్సూరెన్స్ తదితర సమస్యలపై ఏపీ ఎంపీఏ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్ నేతృత్వంలో రాష్ట్ర నాయకులు మంత్రిని కలిసి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో జర్నలిస్టులకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన మంత్రి పార్థసారథి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, రాష్ట్ర ప్రభుత్వం కూడా జర్నలిస్టుల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టిందని, జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందనీ చెప్పారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాఖమూరి మల్లికార్జునరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మన్నే సోమేశ్వరావు, రాష్ట్ర కోశాధికారి మత్తి శ్రీకాంత్, నాయకులు కోట రాజా, పుట్టి కృష్ణ ప్రసాద్ తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

## పీర్ల పండగకు సినీ నటుడు

# డా. మోహన్ బాబుకు ఆహ్వానం



**ఏర్పేడు, జూలై 11(ఆంధ్రపత్రిక):** మండలం లోని మోదుగులపాలెం గ్రామంలో పీర్ల పండగ సందర్భంగా మోదుగుల పాల్యం రేర్ డైమండ్స్ యూత్ ఆధ్వర్యంలో పద్మశ్రీ డాక్టర్ మోహన్ బాబు ని ఆహ్వానించడం జరిగింది అలాగే డాక్టర్ మోహన్ బాబు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా నా స్వగ్రామమైన మోదుగులపాలెం గ్రామంలో కుల మతాలకు అతీతంగా పీర్ల పండుగ నిర్వహించడం ఎంతో ఆనందదాయకమని ఆయన సంతోషం వ్యక్తం చేయడం జరిగింది అలాగే మోదుగులపాలెం అభివృద్ధికి ఆయన సహకరిస్తానని దీనికి మోదుగులపాలెం గ్రామ ప్రజలందరూ కలిసికట్టుగా ముందుకు కదలాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే పీర్ల పండుగకు మోహన్ బాబు కొంత నగదు రూపంలో విరాళం ఇవ్వడం జరిగింది. అలాగే ఎప్పటిలాగే ఈ సంవత్సరం కూడా ఈ పండుగను అత్యంత వైభవంగా నిర్వహించాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు డాక్టర్ మోహన్ బాబుని కలిసిన వారిలో ఎం దయాకర్ మొదలి ఏ శివకుమార్ వీ కిరణ్ పులిపాటి చంద్రశేఖర్ చౌదరి మంచు భరత్ కుమార్ మంచు మస్తాన్ నాయుడు ఉన్నారు.

# ప్రజా ఫిర్యాదులపై విచారణ చేసిన డి పి ఓ లక్ష్మి



**ఐరాల, జులై 11 ఆంధ్రపత్రిక:** ప్రజా ఫిర్యాదులపై క్షేత్రస్థాయి విచారణ చేపట్టిన డి పి ఓ లక్ష్మి. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన పందుల పెంపకం ఫిర్యాదు పై జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి గురువారం కాణిపాకం గ్రామపంచాయతీ నందు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. అగరంపల్లి బ్రిడ్జి వద్ద పందుల మేపుతున్న ఏళ్ళప్ప అనే వ్యక్తితో మాట్లాడి జనావాసాలకు దూరంగా వెళ్లాలని పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఐరాల మండలంలోని చిగరపల్లి పంచాయతీలో జరుగుతున్న పారిశుద్ధ్యం పనులను పరిశీలించారు. అంటువ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి కుసుమ కుమారి కాణిపాకం పంచాయతీ కార్యదర్శి సత్యం రెడ్డి పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్కతో ఎం మహేష్ స్వేరో



**ఐరాల జూలై11 ఆంధ్రపత్రిక:** తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ధనసరి అనసూయ ని కలిసిన జనసేన పార్టీ నాయకులు మహేష్ స్వేరో. గురువారం బేగంపేట్ ఎయిర్ పోర్ట్ లో తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ని మర్యాదపూర్వకంగా కలిసిన చిత్తూరు జిల్లా జనసేన పార్టీ నాయకులు ఎం. మహేష్ స్వేరో, ఆయన మాట్లాడుతూ సీతక్క ఎల్లప్పుడూ ప్రజా సంక్షేమం కొరకు నిరంతరం కృషి చేస్తూ నిత్యం ప్రజలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తూ గొప్ప ప్రజా ప్రతినిధిగా ఎదిగారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చి ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర మంత్రిగా ఎదగడం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని సీతక్క జీవితం చరిత్ర ప్రతి ఒక్క మహిళకి ఆదర్శనీయమని ఎం. మహేష్ స్వేరో తెలిపారు.

## ఎమ్మెల్సీ హరిప్రసాద్‌కు

# ఏపీఎంపీఏ నేతల అభినందన



**మంగళగిరి,జూలై 11(ఆంధ్రపత్రిక):** ఇటీవల ఎమ్మెల్సీగా బాధ్యతలు చేపట్టిన జనసేన నేత, సీనియర్ జర్నలిస్ట్, పిడుగు హరిప్రసాద్‌ను ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఏ పీ ఎం పి ఏ) రాష్ట్ర నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. మంగళగిరి జనసేన కార్యాలయంలో ఎమ్మెల్సీ హరిప్రసాద్‌ను ఏపీ ఎంపీ ఏ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్ నేతృత్వంలో గురువారం కలిసి ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా ఆయనకు చిరు సత్కారం చేసి అభినందించారు. అనంతరం ఏపీ ఎంపీఏ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు సంబంధించిన పలు సమస్యలపై శాసనమండలిలో చర్చించాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎంపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మన్నే సోమేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాఖమూరి మల్లికార్జునరావు, రాష్ట్ర కోశాధికారి మత్తి శ్రీకాంత్, రాష్ట్ర నాయకులు పసుపులేటి చైతన్య, తాళ్లూరు అనిల్ కుమార్, మానేపల్లి మల్లికార్జునరావు, పుట్టి కృష్ణ ప్రసాద్, కోట రాజా, హరి ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యం పనులను పరిశీలించిన డి.పి.ఓ లక్ష్మి



**ఐరాల, జులై 11 (ఆంధ్రపత్రిక):** చిత్తూరు జిల్లా ఐరాల మండలం లోని చిగరపల్లి పంచాయతీలో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్యం కార్యక్రమాలను పరిశీలించిన డి.పి.ఓ లక్ష్మి. చిగరపల్లి పంచాయతీలో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్యం కార్యక్రమాలను గురువారం డి పి ఓ లక్ష్మి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పంచాయతీలలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు అందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి కుసుమ కుమారి, పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి, సచివాలయం సిబ్బంది, పారిశుద్ధ్యం కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పచ్చదనమే మానవవాళికి శ్రీరామరక్ష

**శ్రీచైతన్య టెక్నో పాఠశాలలో ఘనంగా**
**"గ్రీన్ ఇండియా-క్లీన్ ఇండియా" ప్రోగ్రాం**



**వి.కోట జూలై 11(ఆంధ్రపత్రిక):** స్థానిక చౌడేపల్లి రోడ్డులో గల విజయవాడవారి శ్రీచైతన్య టెక్నో కరిక్యులమ్ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం "గ్రీన్ ఇండియా-క్లీన్ ఇండియా" జరిగింది. గురువారం ఉదయం పాఠశాల ఆవరణలో కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల ఏ జీ ఎం సురేష్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచాన్ని వణికిస్తున్న గ్లోబల్ వార్మింగ్, ఓజోన్ పొరకు చిల్లులు మొదలగు సమస్యలన్నిటికీ చెట్లపంపంకం శాశ్వత పరిష్కారమని, విద్యార్థులంతా ప్రతినెలా ఒక్కో మొక్క నాటాలని సూచించారు. ఆర్ ఐ చక్రధర్ మాట్లాడుతూ పచ్చదనం-పరిశుభ్రత అనేవి ప్రతి మనిషి జీవితంలో అత్యంత ప్రాముఖ్యతనివ్వాల్సిన, రేపటి దేశ్ పౌరులైన విద్యార్థులు పరిశుభ్రతగా ఉండాలని,మనం నివసించే పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అరుణారెడ్డి, డీన్ వెంకటేష్ ,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తండ్రి జ్ఞాపకార్థం

# గుడికి భూమి ఇచ్చిన భాష్యం వంశీ




**బంగారుపాళ్యం-జూలై 11(ఆంధ్రపత్రిక):** చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండలం గుంతూరు గ్రామానికి చెందిన టిడిపి మండల వాణిజ్య విభాగం అధ్యక్షుడు భాష్యం వంశీ తన తండ్రి కీర్తిశేషులు భాష్యం విజయకుమార్ నాయుడు జ్ఞాపకార్థం మండల కేంద్రంకు దగ్గర ఉన్న మొగిలి వెంకటగిరి గ్రామం మెయిన్ రోడ్ లో గల శ్రీ వరసిద్ది వినాయక స్వామి గుడికి అనుబంధ గదులకు వీరి స్థలాన్ని విరాళముగా గ్రామస్తులు అడుగగా గుడికి ఆనుకుని రోడ్ పక్కనే ఉన్న స్థలాన్ని వరసిద్ది వినా యకస్వామి గుడికి వంశీ తన తండ్రి జ్ఞాపకార్థకంగా ఉచితంగా విరాళముగా రాసివ్వడం జరిగింది.ఇలా స్థలాన్ని విరాళంగా ఇచ్చినందుకు వంశీ కుటుంబ సభ్యులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# చౌడేపల్లిలో ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ



**చౌడేపల్లి,జూలై11(ఆంధ్రపత్రిక):** మండల కేంద్రమైన చౌడేపల్లిలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారిణి పూజ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. 18 సంవత్సరాల లోపు అమ్మాయికి వివాహం చేయడం వల్ల తల్లి బిడ్డకు వచ్చే ఆరోగ్య సమస్యలను గురించి వివరించారు. అదేవిధంగా బిడ్డకు బిడ్డకు మధ్య మూడు సంవత్సరాలు పాటించాలని, తాత్కాలిక గర్భనిరోధక పద్ధతులలో మాత శిశు సంరక్షణ పద్ధతులను గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు బహుద్దీన్, జమున, మండలంలోని ఏఎన్ఎంలు, ఆశా, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆస్తిపన్ను లెక్కించే విధానాన్ని రద్దుచేయాలని

# టాక్స్ పేయర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి




**విజయవాడ,జూలై 11(ఆంధ్రపత్రిక):** ఆస్తిపన్నును ఏటా 15 శాతం చొప్పున పెంచటాన్ని ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచే నిలిపి వేయాలని, ఆస్తిపన్ను లెక్కించటానికి చేసిన మున్సిపల్ సవరణ చట్టం 44/2023ని రద్దు చేయాలని టాక్స్ పేయర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేస్తున్నది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రికి, మున్సిపల్ శాఖా మంత్రికి లేఖలు వ్రాశింది. ఆంధ్రప్రదేశ్లో అద్దెవిలువ మీద ఆస్తిపన్ను లెక్కించే విధానాన్ని రద్దుచేసి, అస్తి కేపిటల్ విలువ మీద ఆస్తిపన్ను లెక్కించే విధానాన్ని గత వైయస్ఆర్.పి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీనికోసం మున్సిపల్ చట్టాలకు సవరణ చేస్తూ సవరణ చట్టం 44/2000ని తెచ్చింది. అంతేకాకుండా ఇళ్ల స్థలాల మార్కెట్ విలువ మారినప్పుడల్లా ఆస్తి చన్ను కూడా మారే విధంగా ఆ చట్టంలో నిబంధన విధించారు. దీనిని టాక్స్ పేయర్స్ అసోసియేషన్ అనాడే వ్యతిరేకించింది. రాష్ట్ర ప్రజానీకం వ్యతిరేకించారు. రాష్ట్ర వ్యాపితంగా అంధోళనలు చేశారు. అయినా వాటి ప్రభుత్వం ప్రజల ఆందోళనలను, విజ్ఞప్తులను పెడచెవిన పెట్టింది. తాను అధికారంలోకి వస్తే అస్తిపన్నును సమీక్షిస్తామని తెలుగుదేశం కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో వాగ్దానం చేసింది. ఈ వాగ్దానాన్ని నెరవేర్చాలని, టాక్స్ పేయర్స్ అసోసియేషన్ కోరుతున్నది. కేపిటల్ విలువ అనేది ఆస్తి క్రయ, విక్రయాల సందర్భంలో ప్రభుత్వానికి రాజలసిన స్టాంపు డ్యూటీ నిర్ణయించటం కొరకు రూపొందించేదే కాలి, ఆస్తి పన్ను నిర్ధారణ కొరకు రూపొందించేది కాదు. ఆస్తిని అమ్మిగవుడు మాత్రమే కేపిటల్ విలువ ద్వారా యజమాని లబ్దిపొందుతాడు. అదే సమయంలో ఆస్తిపై హక్కును కోల్పోతాడు చన్ను అనేది అస్తిని అనుభవించే విలువ పై చెల్లించేదే కాని, అస్తిని కోల్పోయే విలువ పై చెల్లించేది కాదని, అందుకే టాక్స్ పేయర్స్ అసోసియేషన్ ఈ విధానాన్ని వ్యతిరేకిస్తున్నదని ఆ లేఖలలో స్పష్టం చేసింది. ఆస్తి, యజమాని స్వాధీనంలో ఉంటే, ఆ ఆస్తిని నేరుగా గాని, అద్దెకు ఇవ్వటం ద్వారా గాని అనుభవిస్తాడు. ఎలా అనుభవించినా, ఆస్తి యజమాని హక్కు క్రిందనే ఉంటుంది. ఆస్తిపై హక్కును, ఆస్తి పై ప్రయోజనాన్ని ఏకకాలంలో ఆ గుభవిస్తాడు. ఆస్తిని ఏదోరూపంలో అనుభవిస్తున్నాడు కనుక అనుభవ విలువపై (అద్దెవిలనపై ఆస్తి పన్ను లెక్కించటం సరైందని, టాక్స్ పేయర్స్ అసోసియేషన్ ఆ లేఖలలో వివరించింది. ఈ చట్టం ఆదులు చేయటం కోసం రూల్చును రూపొందిస్తూ 24 11 2030న జీవో నెంబరు 196 ని నాటి ప్రభుత్వం తీసుకు వచ్చింది. ఈ జీవో ప్రకారం ఆస్తి పన్నును ఏటా 15 శాతం కాంపౌండింగ్ రూపంలో పెంచుతున్నారు. దీని ప్రకారం గత నాలుగేళ్లలో 75 శాతం ఇళ్ళ చన్నులు పెరిగాయి. ఇవి భవిష్యత్తులో మరింతగా పెరుగుతాయి. చివరకు అస్తితి, తండ్రి కొడుకు పేర గిఫ్ట్ గా వ్రాశితా, గిఫ్ట్ గా వ్రాసిన తేదీన ఉన్న కేపిటల్ విలువ ప్రకారం ఇంటి పన్ను విధిస్తున్నారు. కేవలం రికార్డులలో యజమాని పేరు మారితే పన్ను పెరుగుతున్నది. అందువలన ఈ విధానమే అసంబద్ధమైనదని టాక్స్ పేయర్స్ అసోసియేషన్ స్పష్టం చేసింది. కేవలం ఒకసారి అదనపు అప్పుచేయటం కోసం, జీవితాంతం ఇంటి యజమానులపై భారం మోపారని ఈ లేఖల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తెచ్చింది. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని ఏటా పెంచుతున్న 15 శాతం ఆస్తి చన్ను పెంపుదలను ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుండి అనగా 01. 04 2024 నుండి నిలిపి వేయవలసిందిగా టాక్స్ పేయర్స్ అసోసియేషన్ కోరింది. ఇప్పటికే ఈ సంవత్సరపు పన్ను చెల్లించిన వారికి, చెల్లించిన అదనపు పన్నుకు వచ్చే ఏడాది పన్నుకు సర్దుబాటు చేయవలసిందిగా కోరింది. అదే సమయంలో కేపిటల్ విలుచు మీద పన్ను లెక్కించే విధానాన్ని పూర్తిగా రద్దు చేయటం కోసం మున్సిపల్ సవరణ చట్టం 44/2000 ను రద్దు చేసి, అద్దె విలువ ఆధారంగా ఇంటి పన్నును లెక్కించే పాత పద్ధతిని పునరుద్ధరించ వలసిందిగా టాక్స్ పేయర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది.

# బొలెరో వాహనం బోల్తా



**చౌడేపల్లి,జూలై11(ఆంధ్రపత్రిక):** బొలెరో వాహనం బోల్తా పడి రూ 60వేలు టమోటా నష్టం వాటిల్లన్న సంఘటన గురువారం చౌడేపల్లి మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని ఆమిని గుంట పంచాయతీ బూరగపల్లికి చెందిన హనుమంతు అనే రైతు తన టమోటాలు తీసుకుని, పలమనేరు మార్కెట్‌కు బొలెరో వాహనంలో బయలుదే రాడు. మార్గమధ్యంలోని ఆమెనిగుంట స్టేజి వద్ద రాగానే వాహనానికి వెనుక వైపు ఉన్న యాక్సిల్ తొలగి పోయింది. దీంతో వాహనం బోల్తా పడింది నిత్యం జనరధి ఉన్న ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదు. అయితే దాదాపు 80 టమోటా బాక్సులు దొంశమై రూ 60000 వరకు నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు.

# పాఠశాలల్లో పోషకాహార,పెరటి తోటలను పెంపొందించాలి

## కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం, జులై 11 (ఆంధ్రపత్రిక):** జిల్లాలోని 100 పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా పోషకాహార ,పెరటి తోటలను పెంచాలని జిల్లా కలెక్టర్ డీకే బాలా జీ విద్యాశాఖ అధికారులకు, ప్రధానోపాధ్యాయులకు, పిలుపునిచ్చారు. గురువారం ఉదయం నగరంలోని సన్ స్టార్ పాఠశాలలో మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులకు ఒకరోజు అవగాహన కార్య క్రమం జిల్లా విద్యాశాఖ వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడు తూ జిల్లాలో 100 పాఠశాలల్లో ప్రకృతి వ్యవ సాయం ద్వారా పోషకాహార పెరటి తోటల పెంపక కార్యక్ర మానికి శ్రీకారం చుట్టామన్నారు.రాను రాను కాలుష్య ం ఎక్కువ అవుతుందని, క్రిమిసంహారక మందులు వాడకము ఎక్కువ అవుతుందని, పండించే రైతుకు ఖర్చు ఎక్కువై ఆదాయం తగ్గిపోతుందని, ఇటు విని యోగదారులు డబ్బు పెట్టిన ఆరోగ్యపరంగా తీవ్రంగా నష్టపోతున్నారన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయం వైపు ప్రతి ఒక్కరూ దృష్టి సారిం చాలన్నారు. మహారాష్ట్రలో సుభాష్ పాలేకర్ ప్రకృతి వ్యవసాయం వలన చాలా ప్రయోజనాలు ఉన్నాయని ఆ దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.ఈ ఉద్దేశంతోనే ప్రకృతి వ్యవసాయంపై చిన్నతనం నుండి పిల్లలకు తెలియజేయాలనే సత్సంకల్పంతో పాఠశాల స్థాయి నుండి పెరటి తోటల పెంపక కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టడం జరిగింద న్నారు.పిల్లలకు తెలియ జేయడం ద్వారా వారు స్వగ్రామాలకు వెళ్లినప్పుడు వారి ద్వారా నిదానంగా గ్రామాల్లో మార్పు రావడం జరుగుతుందన్నారు.తొలి దశలో రైతు సాధికార సంస్థలు ఎక్కడ ఉన్నాయో, అక్కడ ఉన్న పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఎంఈఓ లు ప్రధానోపాధ్యాయులు పి.ఈ.టిలు, ఉపాధ్యాయులు అందరూ కలిసి ఒక బృందంగా పనిచేసి ప్రతి స్థాయి లోనూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల న్నా రు. పాఠశాలలో ముఖ్యంగా 10వ తరగతి విద్యా ర్థుల ను మినహాయించి మిగిలిన విద్యార్థులకు ఈ కార్యక్ర మం పైన సంపూర్ణ అవగాహన కలిగించాలన్నారు.

తద్వారా మాతృభూమికి గౌరవ వందనం చేసినట్లు అవుతుం దన్నారు. ఈ కార్యక్రమా న్ని బరువుగా భావించక, ఇదొక మంచి అవకాశంగా, బాధ్యతగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. వ్యవ సాయ శాఖ ఏడి పార్థసారథి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. మోపిదేవి పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు జయంతి తాను ప్రకృతి వ్యవసాయం ద్వారా పాఠశాలలో పెరటి తోటలను పెంచుతున్నట్లు జిల్లా కలెక్టర్ కి వివరించడంతో జిల్లా కలెక్టర్ ఆమెను అభినందిస్తూ ఆమె అనుభవాలను అందరికీ తెలియజేయాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలించారు. సన్ స్టార్ పాఠశాలకు చెందిన 5 వ తరగతి విద్యార్థులు వై. అభినవ్, ప్రీతం గణితం లోనూ, క్యూబ్స్ లోనూ ప్రతిభ కనబరచడంతో జిల్లా కలెక్టర్ వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో డీఈవో తాహెరా సుల్తానా, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. పద్మావతి, జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర రావు నాయక్, జిల్లా సైన్స్ అధికారి మొహమ్మద్ జాకీర్ అహ్మద్, పాఠశాల కరస్పాండెంట్ శ్రీరామ్, ప్రధానోపాధ్యాయులు రవికాంత్, పలువురు మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కార్యాచరణ పై చర్చా గోష్టి



**గుంటూరు, జులై 11 (ఆంధ్రపత్రిక):** జన చైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వ ర్యంలో ఈనెల 13వ తేదీ గుంటూరు లోని రామన్నపేట ఒకటవ లైన్ లో గల జన చైతన్య వేదిక హాలులో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కార్యా చరణ పై చర్చా గోష్టిని నిర్వహిస్తున్నట్లు జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన వక్తగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పూర్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ పి.వి రమేష్ ఐఎ యస్ రిటైర్డ్ ప్రసంగిస్తారు. డాక్టర్ పి.వి రమేష్ 35 సంవత్సరాల పాటు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంలో, కేంద్ర ప్రభుత్వంలో మరియు వివిధ దేశాలలో కృషిచేసి ఆర్థిక విషయాలలో అపారమైన అనుభవాలను గ్రహించారని వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి తెలిపారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లం రెడ్డి లక్ష్మణ రెడ్డి అధ్యక్షతన జరిగే చర్చా గోష్టిలో పౌర సంస్థల, ప్రజా సంఘాల నేతలు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కాముకులు అధిక సంఖ్యలో హాజరై చర్చా గోష్టిని జయప్రదం చేయాలని వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి తెలిపారు.

# జిల్లాసమాఖ్య సమావేశంలో పాల్గొన్న డిఆర్డిఏ పిడి



**బాపట్ల/కొరిశపాడు జూలై 11(ఆంధ్రపత్రిక):** బాపట్ల జిల్లా సమాఖ్య సమావేశం గురువారం డిఆర్డిఏ సమావేశ మందిరంలో జరిగింది ముఖ్య అతిథిగా హాజరైన డిఆర్డిఏ బాపట్ల జిల్లా పథక Buildings వై పిచ్చి రెడ్డి మాట్లాడుతూ. డిఆర్ డి ఎ లో అమలవుతున్న అన్ని కంపోనెంట్లలో జిల్లా ముందుండాలని తెలియజేశారు. అనంతరం ఎఫ్ పి ఓ రిజిస్ట్రేషన్ అయిన మండలాల అధ్యక్షురాల్లకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను బైలాలను పీ.డి. అందజేశారు లోకోస్ యాప్ అన్ని గ్రూప్ లను రెండు రోజులలో నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపీ సి ఎన్ ఎఫ్ డీపీఎం శ్రీమతి వాణిశ్రీ ప్రకృతి వ్యవసాయంలో వాడబడు జీవామృతం తయారీ విధానాన్ని జిల్లా సమాఖ్య అధ్యక్షురాళ్లకు తెలియజేశారు. ఈ సమావేశంలో స్త్రీనిధి ఏజిఎమ్ నాగబాబు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ లు ఏరియా కో ఆర్డినేటర్ లు కాంపోనెంట్ ఏపిఎంలు, జిల్లా సమాఖ్య అకౌంటెంట్ పాల్గొనడం జరిగింది.

# పేద మధ్య తరగతి ప్రజల సంక్షేమం దృష్ట్యా

# ధరలు తగ్గించిన ప్రభుత్వం



**బాపట్ల, జులై 11 (ఆంధ్రపత్రిక) :** పేద మధ్య తరగతి ప్రజల సంక్షేమం దృష్ట్యా నిత్యవసర సరుకుల ధరలను రాష్ట్ర ప్రభుత్వం తగ్గించిందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి చెప్పారు. నిత్యవసర సరుకుల ధరల పెరుగుదలతో ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్ ను జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ కలిసి గురువారం ప్రారంభించారు. బాపట్ల రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్ వద్ద ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్ ను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం స్థానిక కూరగాయల మార్కెట్ సమీపంలోని రైతు బజార్ ను జిల్లా కలెక్టర్ వెంకట మురళి, శాసన సభ్యులు నరేంద్ర వర్మ కలిసి పరిశీలించారు. వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.తక్కువ ధరలకే నాణ్యమైన బియ్యం, కందిపప్పు విక్రయిస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. మధ్యతరగతి ప్రజల ఇబ్బందులను గుర్తించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రస్థాయిలో మిల్లర్లు ట్రేడర్స్ ను పిలిచి సమావేశమయ్యారని చెప్పారు. నాణ్యమైన కిలో బియ్యం ధర రూ.49లకు, కిలో కందిపప్పు ధర రూ.160 ల చొప్పున విక్రయించాలని సీఎం ఆదేశించడంతో మిల్లర్లు, ట్రేడర్స్ అంగీకరించారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్ణయాన్ని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తక్షణమే అమలులోకి తెచ్చారన్నారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాలలో ఆరు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు.

నాణ్యమైన బియ్యం ధర బయట మార్కెట్లో రూ.60లు ఉండగా కేవలం రూ.49 లకు మాత్రమే విక్రయిస్తున్నా మని చెప్పారు. అలాగే నాణ్యమైన కందిపప్పు కిలో ధర బయట మార్కెట్లో రూ.180 ఉండగా, ఇక్కడ మాత్రం రూ.160లకు అందజేస్తున్నావ ని తెలిపారు. ఆధార్ కార్డ్ చూపి ఎవరైనా ఇక్కడకు వచ్చి కొనుగోలు చేసుకోవచ్చన్నారు. మార్కెట్లో ధరలు స్థిరీకరణ అయ్యేవరకు ప్రత్యేక కౌంటర్ లు కొనసాగుతాయన్నారు. తక్కువ ధరలకు విక్రయించడానికి ముందుకొచ్చిన డాల్, రైస్ మిల్లులు, ట్రేడర్స్ యూనియన్ లను ఆయన అభినందించారు. తక్కువ ధర లకే బియ్యం ఇస్తున్నామంటూ రైతులకు ధరలు తగ్గించి మిల్లర్లు ధాన్యాన్ని కొనుగోలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. రైతులు అలాంటి మాటలు నమ్మవద్దన్నారు. రైతులు పండించిన పంటలకు మంచి ధరలు ఉన్నాయని, ఎలాంటి ఇబ్బందులు పడవద్దని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా అక్రమ నిల్వలు ఉంచడం, కృత్రిమ కొరత సృష్టించడం వంటివి చేస్తే ఉక్కు పాదం మోపుతామన్నారు.

మధ్యతరగతి ప్రజలకు ప్రయోజనం కల్పించేలా తక్కువ ధరలకే నిత్యవసర సరుకులు అందిస్తున్నామని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ కౌంటర్ లు ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు. అధిక ధరలను నియంత్రించడానికే ప్రభుత్వం బృహత్తమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. నిత్యావసర సరుకుల లో ప్రధానమైన బియ్యం, కందిపప్పు ధరలను 10 నుంచి 14% తగ్గించి ప్రభుత్వం విక్రయిస్తుందన్నారు.

పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూర్చే, కౌంటర్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇదే క్రమంలో రైతులకు ఎలాంటి నష్టం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రజా సంక్షేమ మే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు.ఈ కార్యక్ర మంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి విలియమ్స్, బాపట్ల ఆర్డిఓ జి రవీందర్, రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు బి రత్న గుప్తా, కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు తాలూకా అధ్యక్షులు కె శివరామ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# జనాభా పెరుగుదల అదుపుకు

# ప్రతి ఒక్కరూ సహకరించాలి




**బాపట్ల, జూలై 11(ఆంధ్రపత్రిక):** జనాభా పెరుగుదలను అదుపు చేయడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి చెప్పారు. ప్రపంచ జనాభా దినోత్సవం స్థానిక ప్రాంతీయ వైద్యశాల వద్ద గురువారం జరిగింది. జనాభా నియంత్రణపై చేపట్టిన అవగాహన ర్యాలీని బాపట్ల జిల్లా కలెక్టర్, బాపట్ల శాసనసభ్యులు కలిసి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ప్రజలతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు.జనాభా పెరుగుదలలో భారత దేశం అగ్ర భాగాన నిలిచిందని జిల్లా కలెక్టర్ చెప్పారు. మన దేశ జనాభా 138 కోట్లకు చేరడంతో అందుకు సరిపడా వనరులు దేశంలో పెరగలేదన్నారు. యువ శక్తి అత్యధికంగా ఉన్న దేశాల జాబితాలో భారత్ మొదటి స్థాయిలో నిలిచిందన్నారు. జనాభా పెరిగినంతగా జల వనరులు, భూమి, ఆహార ధాన్యాలు, ఇతర వనరులు పెరగలేదన్నారు. జనాభా పెరుగుదలతో సహజ వనరులపై ఒత్తిడి పడుతుందన్నారు. పరిశ్రమలు, ఇతర అభివృద్ధి రంగాలు శ్రమశక్తిలోనూ మన దేశ యువత భాగస్వామ్యం అధికంగా ఉందన్నారు. ఈ క్రమంలో ఉద్యోగాలు, ఆహార ధాన్యాలు ప్రజలకు సమృద్ధిగా లేక ఆర్థిక సమస్యలు ఉత్పన్న మవు తున్నాయన్నారు. తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే ఒకరు ఇద్దరు పిల్లలతోనే సాధ్యమన్నారు. జనాభా పెరుగుదల నియంత్రణకు ప్రజలంతా సామాజిక బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. నేలతల్లి, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజల జీవనం, పిల్లలను కనడంలోనూ మార్పు రావాలని కోరారు. ఒక్క బిడ్డ ముద్దు-ఇద్దరూ వద్దు అనే నినాదంతో ప్రజలు ముందుకు సాగాలన్నారు. ఆర్థికంగా ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో నిలవాల్సిన భారతదేశం జనాభాలో నిలవడం బాధాకరమన్నారు. ప్రజల ఆలోచనలలోను మార్పు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, డి సి హెచ్ ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ శేషుబాబు, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

# డీఈఓ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**మచిలీపట్నం జులై 11 (ఆంధ్రపత్రిక):** కృష్ణాజిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు.జిల్లాలోని అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం సజావుగా అమలు జరపాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ జిల్లాలో పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం, యాప్ ల తీరుతెన్నులను జిల్లా విద్యాధికారి తాహెరా సుల్తానా ను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకానికి అందుతున్న బియ్యం, నూనె, కందిపప్పు, గుడ్లు, చిక్కీలు తదితర వస్తు సామాగ్రి వాటి వినియోగం విద్యార్థుల హాజరు, ఎంతమంది విద్యార్థులకు గానూ ఎంతమంది భోజనం తింటున్నారు? ఎంత మంది తినడం లేదు? ఎందుకు తినడం లేదు? తదితర వివరాలను కలెక్టర్ క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు.పాఠశాలల్లో కావలసిన పనులకు సంబంధించి సిఎస్ఆర్ నిధులతో పూర్తి చేయుటకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.క్షేత్రస్థాయిలో భోజన పథకం సరిగా అమలు అవుతుందా? లేదా? క్రమం తప్పకుండా పాఠశాలలను ఆకస్మిక తనిఖీలు చేసి పరిశీలిం చాల న్నారు. ఎంఈఓలతో ప్రత్యేకించి ఒక వాట్సాప్ గ్రూపు సిద్ధం చేసి ఎప్పటికప్పుడు సూచనలు జారీ చేస్తామన్నారు.వారితో త్వరలో ఒక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి విద్యా వ్యవస్థ ను పటిష్ట పరుస్తామన్నారు.ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖాధికారి తో బాటు ఏడీ లు ఎం ఏ అజీజ్, మనోహర్ నాయక్, పర్యవేక్షకు లు పవన్ కుమార్, సలీం, సముద్రేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుండి కాపాడలేని ప్రభుత్వ అధికారులు

# సామాన్య ప్రజలకు ఇంకేం చేస్తారు



**కలిదిండి జులై 11 ( ఆంధ్రపత్రిక ):** ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం కలిగిన మండలం వెంకటాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని గోపాలపురం పంట కాలువ వంతెన దగ్గర నుండి గ్రామరి సర్వే నెంబర్ 213,214,215,216, 217,218,లో ఉన్న ఇరిగేషన్ శాఖ సంబంధించి పంట కాలు గట్లపై ఉన్న ఆక్రమణలు గుర్తించి మండల సర్వేయర్ ఆక్రమించిన ఆక్రమణలు నివేదిక కోరుకోలు ఇరిగేషన్ శాఖ ఏఈ పంచాయతీకి నివేదిక రూపంలో పంపించి నేటికి ఎనిమిది నెలలు కావస్తున్నా పంచాయతీ కార్యాలయం సిబ్బంది నేటికి నేటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుండి కాపాడలేని ప్రభుత్వ అధికారులు సామాన్య ప్రజలకు ఇంకేం చేస్తారు అన్న వాదనలు బలంగా వినిపిస్తున్న పట్టించుకోని పంచాయతీ అధికారులు. పత్రికలో వచ్చిన కథనాల మేరకు అందరికి తెలిసిన విషయమే. అప్పట్లో పత్రికలు వచ్చిన కథనాలు స్పందించిన అధికారులు తూతూ మంత్రంగా నోటీసులిచ్చి, ఆక్రమణలు తొలగించుకపోవడంపై ప్రభుత్వ అధికారులపై తీవ్ర విమర్శలు వెలువెత్తాయి. ప్రజలు కట్టే పన్నులతో జీతాలు తీసుకునే ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వ భూములను కాపాడలేక పోతే, రాబోయే తరాలకు ప్రభుత్వ భూములు ఉంటాయా అని అనుమానాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణాలపై ప్రజల్లో ప్రభుత్వ అధికారులపై నమ్మకం సన్నగిల్లుతుంది అని అంటున్న సామాజిక వ్యక్తులు, సామాన్య గ్రామ ప్రజలు. ఇప్పటికైనా ఈ ఆక్రమణలపై జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, అక్రమ నిర్మాణాలను, తొలగించి ప్రజల్లో ప్రభుత్వ అధికారులపై విశ్వాసాన్ని పెంపొందించేలా ఏ విధమైన చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

# ట్రిపుల్ ఐటీలో ప్రవేశలకై తుది జాబితా విడుదల




**నూజివీడు,జులై 11 (ఆంధ్రపత్రిక):** ఆర్జీయూకేటీ-నూజివీడు, 2024- 25 విద్యా సంవత్సరానికి ఆర్జీయూకేటీలో ప్రవేశానికి క్యాంపస్ వారీగా ఎంపిక కాబడిన విద్యార్థుల తుది జాబితాను గురు వారం ఆర్జీయూకేటీ చాన్సులర్ ఆచార్య కే.సి.రెడ్డి విడుదల చేశారు. ఈ సంవత్సరం 53,863 మంది ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్నారు.ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు క్యాంపస్లలో ఒక్కో క్యాంపస్లో 1000 సీట్లతో పాటు ఈడబ్ల్యూఎస్ కోటా కింద అదనంగా 100 సీట్లతో నాలుగు క్యాంపస్లకు మొత్తం 4400 మంది విద్యార్థులతో భర్తీ చేస్తారు. వీరిలో 85% ఏపీ విద్యార్థులు ఉంటే 15% ఓపెన్ మెరిట్ కోటాలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర అభ్యర్థులకు కేటాయిస్తారు. ఈ సంవత్సరం సెలెక్ట్ అయిన విద్యార్థుల జాబితా ప్రకారం గవర్నమెంట్ పాఠశాలలో చదివిన విద్యార్థులు 92.99 శాతంగాను ప్రైవేట్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు 7.01% ఉన్నది. సెలెక్ట్ అయిన విద్యార్థులలో 67.15% అమ్మాయిలు 32.85% అబ్బాయిలు ఉన్నారు. ఇందులో ఎంపిక కాబడిన విద్యా ర్థులు నూజివీడు ప్రాంగణంలో జూలై 22,23వ తేదీల్లో, ఆర్కే వ్యాలీ (ఇడుపులపాయ) జులై 22, 23 తేదీల్లో, ఒంగోలు ప్రాంగణం జూలై 24,25 వ తేదీల్లో, (ఇడుపులపాయ ప్రాంగణం) మరియు శ్రీకాకుళం ప్రాంగణం జులై 26,27 తేదీల్లో వీరికి కౌన్సిలింగ్ నిర్వహించబడుతుంది. సెలెక్ట్ అయిన విద్యార్థుల వివరాలు ఆర్జీయూకేటీ వెబ్సైట్లో (www. rgukt.in) మరియు వారు దరఖాస్తులో సమర్పిం చిన సెల్ ఫోన్ లకు మెసేజ్ ద్వారా మరియు ఎస్ఎంఎస్ ద్వారా తెలియ చేయబడుతుంది. ఏ విద్యార్థి ఏ క్యాంపస్ కు కౌన్సిలింగ్ కు వెళ్లాలో మరియు వారు తీసుకు వెళ్ళవలసిన సర్టిఫికెట్ల వివరాలు అన్నీ కూడాను ఆర్జీయూకేటీ వెబ్సైట్లో పొందుపరచడం జరిగింది, అని అడ్మిషన్స్ కన్వీనర్ ఆచార్య అమరేంద్ర కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాలుగు క్యాంపస్లకు సంబంధించిన డైరెక్టర్లు , నూజివీడు క్యాంపస్ కు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా కోర్టు వద్ద ఉన్న స్టేడియంను పరిశీలించిన జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ



**మచిలీపట్నం జూలై 11 (ఆంధ్రపత్రిక):** స్థానిక జిల్లా కోర్టు సెంటర్ వద్ద ఉన్న స్టేడియం ని జనసేన పార్టీ బందరు నియోజకవర్గ ఇన్చార్జి బండి రామకృష్ణ గురువారం జనసేన టిడిపి బిజెపి శ్రేణులతో కలిసి సునిశితంగా పరిశీలించారు.జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఝాన్సీ లక్ష్మి స్టేడియం లో వసతులలేమి పై వివరించారు. స్టేడియంని పూర్తి స్థాయిలో అభివృద్ధి పరిచి క్రీడాకారులకు మెరుగైన వసతులు సమ కూర్చాలని బండి రామకృష్ణ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన బండి రామకృష్ణ రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, మచిలీపట్నం పార్లమె ంటు సభ్యులు వల్లభనేని బాలసౌరి ల సారధ్యంలో స్టేడియానికి కావాల్సిన ఆర్థిక వనరులు సమకూరు స్తామనిఅన్నారు. వర్షపు నీటికి మునుగుతున్న స్టేడియాన్ని మెరక చేయించి చుట్టూ కాంపౌం డ్ వాల్ తో బాటు లైటింగ్,వాకింగ్ ట్రాక్ క్రీడా కారులకు కావల సిన వసతులతో పాటు ప్రేక్షకులు కూర్చునే సదుపాయం, తాగునీరు, కాలకృత్యాలను తీర్చుకునేందుకు వసతులు ఆహ్లాదకరమైన వాతా వరణం కొరకు మొక్కలు పెంచడం చేస్తామన్నారు. స్టేడియాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం ఒక్క ఎన్డీఏ ప్రభుత్వంలోనే సాధ్యమవుతుందన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి నాయకులు గడ్డంరాజు, పి.వి.ఫణి కుమార్,అక్కు మహతి రాజా, సమాచార సేకరణ అధికారి సిరి చందన, తిరుమలశెట్టిరాజు, పోతురాజు, సాయి, గణేష్, రామ్ జ్యోతి, వడ్డీ చిరంజీవి, కూనపురెడ్డి ప్రసాద్, మంత్రి పృధ్వి తదితరులు

# పంట కాలువ శుభ్రత పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**కైకలూరు జూలై 11 ( ఆంధ్రపత్రిక ):** ఏలూరు జిల్లా కైకలూరు మండలం కైకలూరు పంట కాలువ శుభ్రత పనులను పరిశీలించిన నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కామినేని శ్రీనివాస్ మరియు ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థికస్థితిని గాడిలో పెడతాం

(మొదటిపేజీ తరువాయి)

పయ్యావుల కేశవ్ తెలిపారు. గడచిన ఐదేళ్లలో వ్యవస్థను దెబ్బతీశారన్నారు. ఆర్థిక మంత్రిగా పయ్యావుల కేశవ్ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆ వెంటనే 15వ ఆర్థిక సంఘం నిధులు 250 కోట్ల రూపాయలు స్థానిక సంస్థలకు విడుదల చేస్తూ ఫైల్పై సంతకం చేశారు. ఈ సందర్భంగా పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. ఈ సందర్భంగా ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం తన మొదటి బాధ్యతగా పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 16 పథకాలను ఆపేసిందని.. వాటిలో 60 శాతం రాష్ట్రం... 40 శాతం కేంద్రం నిధులు పెట్టేవని పేర్కొన్నారు. వీటి మొత్తాన్ని ఆపేశారని పయ్యావుల కేశవ్ వెల్లడించారు. కేంద్రం నిధులు కూడా వాడుకోని పరిస్థితి వైసీపీ హయాంలో ఉందన్నారు. వ్యవస్థలు అన్నీ గాడి తప్పాయన్నారు. ఎవరు జగన్కి సలహా ఇచ్చారో కూడా తెలియదని పయ్యావుల కేశవ్ అన్నారు. కామన్ మ్యాన్ నుంచి వచ్చే కన్నా పరిశ్రమల నుంచి వచ్చే ఆదాయమే ఎక్కువన్నారు. సెంట్రల్ గవర్నమెంట్ స్కీంలు సరిగా వాడితే ఎంతో మేలన్నారు. ఎలక్ట్రిసిటీపై డ్యూటీలను దారుణంగా వేశారన్నారు. అక్క చెల్లమ్మలకు, అవ్వ తాతలకు జగన్ ఇచ్చిన దాని కన్నా దోచింది ఎక్కువని పయ్యావుల కేశవ్ అన్నారు. చంద్రబాబు టీం శక్తికి మించి ఈ రాష్ట్రం కోసం పని చేస్తోందన్నారు. ఏపీలో టాక్సేషన్ను కౌంటర్ ప్రొడక్ట్ లెవెల్కి తీసుకువెళ్లారన్నారు. టాక్స్లు పెంచడం ఒక స్థాయికి తెచ్చారని.. చివరకు భరించలేకుండా చేశారన్నారు. వ్యాపారాలను కొలాప్స్ చేశారన్నారు.

# టిడిపి కేంద్ర కార్యాలయంపై దాడి కేసు..

(మొదటిపేజీ తరువాయి)

రఘురామ్, మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిపై టీడీపీ ఆఫీసుపై దాడి కేసిన కేసులో ప్రభుత్వం కేసులు నమోదు చేసింది. ఈ కేసులో తమను అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో ముందస్తు బెయిల్ కోసం పలువురు వైసీపీ నేతల తరఫున దేవినేని అవినాష్ వేసిన పిటిషన్పై ఇవాళ ఏపీ హైకోర్టు మరోసారి విచారణ చేసింది. ఈ కేసులో పోలీసుల తరఫున కేఎం కృష్ణారెడ్డి, అవినాష్ తరఫున సీనియర్ న్యాయవాది రవిచందర్ తమ వాదనలు వినిపించారు. ఈ కేసుతో సంబంధం ఉన్న వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్ పైనా ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇరు పక్షాల వాదనలు విన్న హైకోర్టు తలశిల రఘురామ్, లేళ్ల అప్పిరెడ్డి, ఆళ్ల రామ కృష్ణా రెడ్డి, సజ్జల రామకృష్ణా రెడ్డి, దేవినేని అవినాష్, జోగి రమేశ్ కు ముందస్తు ఈ నెల 16 వరకూ ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. 16 వరకూ వీరిపై ఎలాంటి దూకుడు చర్యలు తీసుకోవద్దని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే తదుపరి విచారణను 16వ తేదీకి వాయిదా వేసింది. దీంతో ఆ లోపు వీరికి ఊరట లభించినట్లయింది.

# ఎపిలో ఐఏఎస్లు బదిలీలు

(మొదటిపేజీ తరువాయి)

బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరితో పాటు ఇద్దరు ఐపీఎస్ అధికారులు కూడా బదిలీ అయ్యారు. విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ డీజీగా హరీశ్ కుమార్ గుప్తా, హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా కుమార్ విశ్వజిత్ నియమితులయ్యారు.అటవీ, పర్యావరణ శాస్త్ర సాంకేతిక ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా జి.అనంతరాము నియమితులయ్యారు.ఆర్.పి. సిసోడియా- స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చారు. సీసీఎల్ఏ చీఫ్ కమిషనర్గా జి.జయలక్ష్మి బాధ్యతలు చేపట్టనున్నారు. ఆర్ అండ్ బీ ముఖ్యకార్యదర్శిగా కాంతిలాల్ దండే,పెట్టుబడులు మౌలిక సదుపాయాల కార్యదర్శిగా సురేశ్ కుమార్, గ్రామవార్డు సచివాలయం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. జీఏడీ కార్యదర్శిగానూ సురేశ్కు అదనపు బాధ్యతలు అప్పగించారు. సౌరభ్ గౌర్- ఐటీశాఖ, ఆర్టీజీఎస్ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు. యువరాజ్- పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ కార్యదర్శిగా, హర్షవర్ధన్- మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శిగా, పి.భాస్కర్- వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ కార్యదర్శిగా, పి.భాస్కర్- ఈడబ్ల్యూఎస్, జీఏడీ సర్వీసెస్ అదనపు బాధ్యతలు అప్పగించారు. కె.కన్నబాబు- సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శిగా, గిరిజన సంక్షేమం, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్గానూ బాధ్యతలు అప్పగించారు. వినయ్చంద్- పర్యాటకశాఖ కార్యదర్శిగా, వివేక్ యాదవ్- యువజన సర్వీసులు, క్రీడలశాఖ కార్యదర్శిగా, సూర్య కుమారి- మహిళా, శిశుసంక్షేమం, దివ్యాంగుల సంక్షేమ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. సి.శ్రీధర్- ఇండస్ట్రీస్ డైరెక్టర్గా, జె.నివాస్- ఆర్థికశాఖ అదనపు కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చారు. విజయరామరాజు- పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్గా పోస్టింగ్ ఇచ్చారు.హిమాంశు శుక్లా- సమాచార, పౌర సంబంధాలశాఖ డైరెక్టర్గా నియమితులయ్యారు. ఢిల్లీరావు- వ్యవసాయశాఖ డైరెక్టర్గా, వ్యవసాయశాఖ నుంచి హరికిరణ్ను బదిలీ అయ్యారు. గిరిజాశంకర్ను ఆర్థికశాఖ నుంచి రిలీవ్ చేశారు.

# పవన్ మరో సంచలన కార్యక్రమం

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యేక కార్యక్రమాలకు రూపకల్పన చేయాలని భావిస్తున్న పవన్ కళ్యాణ్, జూ పార్కులో అభివృద్ధిలో కార్పొరేట్ సంస్థలను భాగస్వామ్యం చేయాలని నిర్ణయిం చారు. ఇందులో భాగంగా కార్పోరేట్ సంస్థలను ఆకర్షించేందుకు టీ విత్ డిప్యూటీ సీఎం కార్యక్రమాన్ని నిర్వహించాలని పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. జూ పార్క్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ 14వ గవర్నింగ్ బాడీ సమావేశంలో పాల్గొని, జూల అభివృద్ధికి కీలక సూచనలు చేసిన ఉప ముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో జంతుప్రదర్శనశాలలు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాల న్నారు. విశాఖ పట్నం, తిరుపతిలలో జూ పార్కులకు ఎక్కువ మంది పర్యాటకులు వచ్చేలా ప్రణాళికలు రూపొందించాలని ఆయన ఆదేశించారు. రాష్ట్రంలో నూతన జంతుప్రదర్శనశాలల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు పవన్ కళ్యాణ్.అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో జూ పార్కులను అభివృద్ధి చేయాలని, పర్యావరణహిత కార్యక్రమాలతో పర్యాటకులను మరింత ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని సూచించారు. జూ పార్కుల అభివృద్ధికి పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానంలో నిధులు సమకూర్చుకోవాలని అన్నారు. అరుదైన జంతువులను దిగుమతి చేసుకోండి అరుదైన, ఆకర్షణీయంగా ఉండే జంతువులను దిగుమతి చేసుకోవడం వంటి అంశాల మీద దృష్టి సారించాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. పర్యాటకులను ఆకర్షించే విధంగా వన్యప్రాణుల సందర్శనతో చక్కటి వైల్డ్ లైఫ్ అనుభూతి కలిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. జూ పార్కుల అభివృద్ధిలో కార్పోరేట్లను భాగస్వాముల్ని చేయాలని, పరిశ్రమల సిఎస్ఆర్ నిధులతో జూ పార్కులకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పారిశ్రామికవేత్తలు వ్యక్తిగతంగా జంతువులను దత్తత తీసుకుంటారని, అభివృద్ధికి దాతల సహకారం తీసుకోవడం వంటి కార్యచరణలు రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ప్రమోట్ చేసేందుకు తిరుపతి, విశాఖ పర్యటనల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. "టీ విత్ డిప్యూటీ సీఎం" ద్వారా వారితో తను మాట్లాడతానన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని టూరిజం హబ్ గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేద్దామని చెప్పారు.

# నీట్ పిటిషన్లపై విచారణ వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

స్టేటస్ను సీబీఐ కోర్టులో సబ్మిట్ చేసింది. ఈ అఫిడవిట్లను, సీబీఐ రిపోర్టును పూర్తి స్థాయిలో పరిశీలించాలని అభిప్రాయం వ్యక్తం చేసిన సుప్రీం కోర్టు విచారణను ఈనెల 18కి వాయిదా వేసింది.నీట్ పేపర్ లీకేజీపై చర్చ జరిగే సమయంలో.. పరిమిత సంఖ్యలో లీకేజీ జరిగిందని, పేపర్ లీక్ అనే పదాన్ని వినియోగించేందుకు కేంద్రం అంగీకరించడం లేదు. నీట్లో మాల్ ప్రాక్టీస్ జరగలేదని కేంద్రం పేర్కొంది. ఈ లీకేజీ బీహార్లోని ఓ కేంద్రానికి పరిమితమైందని, పేపర్ సోషల్ మీడియాలో లీకవ్వలేదని చెప్పింది. రీ నీట్ టెస్ట్ అవసరం లేదని వెల్లడించింది. అదే సమయంలో సీబీఐ సైతం సోషల్ మీడియాలో పేపర్ లీక్ కాలేదని.. కేవలం స్థానికంగానే పేపర్ లీక్ అయ్యిందని తన దర్యాప్తు నివేదికను సమర్పించింది.నీట్ పరీక్ష కోసం 24 లక్షల మంది విద్యార్థులు భవిష్యత్ను ఇబ్బందుల్లోకి నెట్టడం సరి కాదని కేంద్రం అభిప్రాయం వ్యక్తం చేస్తుండగా.. ఇప్పటికే దాఖలైన అఫిడ విట్లను పరిశీలించేందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉందని భావించిన సుప్రీం కోర్టు విచారణను జులై 18కి వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది.

# మీ సమస్యలు నాకు వాట్సాప్ చేయొద్దు

(మొదటిపేజీ తరువాయి)

చాటూ.. మీ సమస్యలు వెంటనే పరిష్కారం అయిపోతాయి అంటూ రెండు రోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం నడిచింది. అయితే హఠాత్తుగా ఇవాళ ఆయన ఎక్స్ ఖాతాలో ఓ పోస్ట్ ఉంచారు. మీ సమస్యలు వాట్సప్ చేయొద్దంటూ మెసేజ్ ఉంచారు. అయితే..జనం కంటే.. టీడీపీ శ్రేణుల నుంచే ఎక్కువగా సందేశాలు వెల్లువెత్తినట్లు తెలుస్తోంది. ఈ పరిణామంతో విసుగుచెంది ఆయన ఆ నెంబర్ను బ్లాక్ చేసి ఉండొచ్చనే చర్చా నెట్టింట నడుస్తోంది. బ్లాక్ చేశాక ఆ నెంబర్కు వాట్సాప్ చేసినా ఎలాంటి స్పందన లేకపోవడం, ఈ విషయం సోషల్ మీడియాకు ఎక్కితే నవ్వులపాలు అవ్వొచ్చనే ఉద్దేశంతో లోకేష్ ఎక్స్లో సదరు సందేశం ఉంచినట్లు అనుమానం వ్యక్తం అవుతోంది.

విజయవాడ నూతన పోలీస్ కమిషనర్గా ఎస్.వి.రాజశేఖర్ బాబు



# 2026 నాటికి తొలిదశ నిర్మాణాలు పూర్తి



**భోగాపురం,జూలై 11 (ఆంధ్రపత్రిక):** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతం ఒక ఎకనామిక్ హబ్గా మారుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విహంగ వీక్షణం ద్వారా భోగాపురం విమానాశ్రయం ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'భోగాపురం వరకు బీచ్రోడ్ నిర్మాణం కూడా జరగాలన్నారు. పారిశ్రామికంగా ఎదిగేందుకు భోగాపురం ప్రాంతానికి మంచి అవకాశాలున్నాయి. నేను సీఎంగా ఉన్నప్పుడే అన్ని అనుమతులు వచ్చాయి. నేషనల్ హైవే నుంచి విమానాశ్రయానికి రోడ్ల కనెక్టివిటీ పెంచాలి. గత ప్రభుత్వ వైఖరి వల్ల అన్నీ మళ్లీ మొదటి నుంచి చేయాల్సి వస్తోందని అన్నారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభంలోనే 48లక్షల మంది ప్రయాణికులతో రన్ అయ్యే పరిస్థితి ఉంటుంది. ఉత్తరాంధ్ర యువత ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఎన్డీయే కూటమికి ఉత్తరాంధ్ర బ్రహ్మరథం పట్టింది. అండగా నిలిచిన ప్రజలకు ఏదైనా చేయాల్సి ఉంది. అందుకే జిల్లా పర్యటనల్లో మొదటగా ఉత్తరాంధ్రకు వచ్చాను. 2026 జూన్ నాటికి భోగాపురం విమానాశ్రయం తొలిదశ పూర్తి చేస్తాం. వేగంగా పూర్తి చేయించే బాధ్యత కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడిపై ఉందని చంద్రబాబు తెలిపారు. రాజకీయాల్లో విర్రవీగిన వారికి ప్రజలు తగిన శిక్ష వేశారని చురకలు అంటించారు. రాష్ట్రం నిలదొక్కుకోవడానికి తమ బాధ్యత తాము నిర్వహిస్తామని అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారి ఉత్తరాంధ్రలో పర్యటించారు. . పోలవరం ఎడమకాలువ పనులను పరిశీలించడంతో పాటూ భోగాపురం ఎయిర్ పోర్టు పనులపై ఆధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వమే కాకుండా ప్రజలు కూడా అభివృద్ధికి సహకరించాలని కోరారు. విశాఖ స్టీల్స్ ప్రైవేటీకరణను తాను ఒప్పుకున్నామని చెబుతున్నారు.. అవన్నీ అబద్ధాలని అన్నారు. గతంలో వాజపేయి హయాంలోనే ప్రైవేటీకరణ చేస్తాన్నప్పుడు అడ్డుకున్నామని స్పష్టం చేశారు. ఈ సారి విశాఖ ప్రైవేటీకరణ జరగకుండా కాపడుతామన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు 5 ఏళ్ల క్రితం ఎలా ఉన్నాయో ఇప్పుడు అలానే ఉన్నాయని చంద్రబాబు అన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పనులు జరగలేదని చంద్రబాబు విమర్శించారు. టీడీపీ హయాంలో పోలవరం పనులు 72 శాతం పూర్తి చేస్తే.. జగన్ ప్రభుత్వం దయాఫ్రమ్ వాల్ని గోదావరిలో కలిపేసిందని ఆరోపించారు. జగన్ ప్రభుత్వ వైఫల్యంతోనే పోలవరం ప్రాజెక్టులో దయాఫ్రమ్ వాల్, కాపర్ డ్యామ్స్ దెబ్బతిన్నాయని విమర్శించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు పూర్తి కావడానికి సమయం పడుతుందని.. అనకాపల్లి ప్రాంత రైతుల కోసం పురుషోత్తపట్నం లిఫ్ట్ పనులను వేగంగా పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. వెంటనే నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేయాలని అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు. సిఎం వెంట కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్రమంత్రులు అనిత, నిమ్మల రామానాయుడు, స్థానిక ఎమ్మెల్యేలు ఉన్నారు.

# ప్రజల రుణం తీర్చుకుంటా

(మొదటిపేజీ తరువాయి)

చెందుతుందన్నారు. రాష్ట్రం నిలదొక్కుకునేందుకు తన బాధ్యతను నెరవేరుస్తానని చెప్పారు. పోలవరం ప్రాజెక్టును గోదావరిలో కలిపేశారు తెదేపా హయాంలోనే పోలవరం 72 శాతం పూర్తిచేశాం. గత ప్రభుత్వం ఆ ప్రాజెక్టును గోదావరిలో కలిపేసింది. పోలవరం ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితికి తీసుకొచ్చారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతితో ప్రతి ఎకరాకూ నీరందుతుంది. ఈ ప్రాజెక్టు పూర్తికి రూ.800 కోట్లు ఖర్చవుతుంది. దీని ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుంది. టెండర్లు పిలిచి వీలైనంత త్వరగా ప్రాజెక్టును పూర్తిచేస్తాం. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా 2500 క్యూసెక్కుల నీటిని తీసుకుని రావొచ్చు. గోదావరి జలాలు అనకాపల్లి జిల్లాకు రావాలి. ఈ జిల్లాకు సాగునీరందిస్తే నా జన్మ సార్థకం అవుతుందన్నారు. ఇకపోతే ఆర్థిక ఉగ్రవాదులు విశాఖను దోచుకున్నారని అన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు వంశధార వరకు వెళుతుంది. గోదావరి, కృష్ణా, వంశధార, పెన్నా నదులను అనుసంధానం చేయాలి. దాంతో రాష్ట్రంలో కరవు లేకుండా చేస్తాం. అనకాపల్లి జిల్లాలో 3 చక్కెర కర్మాగారాలను పడకేసే పరిస్థితికి తీసుకొచ్చారు. రైతులకు న్యాయం చేయడం ఎన్డీయే కూటమి కర్తవ్యం. అబద్ధాలు చెప్పే నేతల వ్యాఖ్యలు ఎప్పటికప్పుడు ఖండించాలి. కరడుగట్టిన ఆర్థిక ఉగ్రవాదులు విశాఖను దోచుకున్నారు. ప్రజల భూములన్నీ కొట్టేయాలనుకున్నారు. ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక పంపిణీ చేస్తున్నాం.. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశామని చంద్రబాబు వివరించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ విషయంలో కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారాలు చేస్తున్నారని ఏపీ సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారి మాటలు నమ్మొద్దని ప్రజలకు సూచించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ను ఎలా కాపాడుకోవాలో ఆలోచిస్తున్నామని.. తెలుగువారి ఆత్మగౌరవం కోసం పుట్టిన పరిశ్రమ, ఆంధ్రుల హక్కు అని చెప్పి సాధించుకున్న ఫ్యాక్టరీని వదులుకునేది లేదని స్పష్టం చేశారు. అబద్ధాలు చెప్పే రాజకీయ పార్టీ అసత్య ప్రచారం తప్ప ఏమీ చేయలేదని మండిపడ్డారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు తాను ఒప్పుకొన్నాననే ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా గొర్రెపిల్ల, కుక్కపిల్ల కథను ఉద్ఘాటించారు. గొర్రెపిల్లను తీసుకెళ్తుంటే కుక్క పిల్లని తీసుకెళ్తున్నావంటూ ఒకరు అంటారని.. ఆ తర్వాత మరొకరు, ఇంకొకరు సైతం అలాగే అంటారని చెప్పారు. దీన్ని నమ్మిన గొర్రె పిల్లను తీసుకెళ్లే వ్యక్తి అది కుక్క పిల్లే అని నమ్మి వదిలేస్తే దాన్ని వారు కాజేస్తారని, వైసీపీ వాళ్లు సైతం ఇలాగే చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడతామని స్పష్టం చేశారు. ఆర్థిక ఉగ్రవాదులు విశాఖను దోచేశారని చంద్రబాబు మండిపడ్డారు. గోదావరి జలాలు అనకాపల్లి జిల్లాకు రావాలి. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు వంశధార వరకూ వెళ్తుంది. గోదావరి, కృష్ణా, వంశధార, పెన్నా నదులకు అనుసంధానం చేయాలి. దీంతో రాష్ట్రంలో కరువు అనేది ఉండదు. వైసీపీ హయాంలో అనకాపల్లి జిల్లాలో 3 చక్కెర కర్మాగారాలు పడకేసే పరిస్థితికి తీసుకొచ్చారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేయడమే కూటమి ప్రభుత్వ కర్తవ్యం.

# విశాఖ స్టీల్ప్లాంట్పై ఆందోళన వద్దు

(మొదటిపేజీ తరువాయి)

వచ్చిన ఆయన.. గురువారం స్టీల్ ప్లాంట్ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. విశాఖ స్టీల్ప్లాంట్పై అనేక మంది ఆధారపడి ఉన్నారన్నారు. దీన్ని రక్షించడం తమ బాధ్యత అని తెలిపారు. ప్లాంట్ మూతపడుతుందనే ఆందోళన వద్దన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో వంద శాతం సామర్థ్యంతో ఉత్పత్తి జరుగు తుందని కుమారస్వామి తెలిపారు. అంతకుముందు విశాఖ ఉక్కు పరిశ్రమలోని వివిధ విభాగాలను కేంద్రమంత్రి పరిశీలించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ను రక్షించడం తమ బాధ్యత అని, ప్లాంట్ మూతపడు తుందనే ఆందోళన వద్దని మంత్రి కుమారస్వామి అన్నారు. ఉక్కు ఉత్పత్తి సహా అన్ని విభాగాలను పరిశీలించారు. ఆయా విభాగాల వివరాలను కేంద్ర మంత్రికి అధికారులు వివరించారు. ప్లాంట్ సందర్శన అనంతరం కుమార స్వామి మీడియాతో మాట్లాడారు. 'విశాఖ స్టీల్ ప్లాంట్ దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుంది. ఉక్కు పరిశ్రమపై అనేక మంది ఆధారపడి ఉన్నారు. ప్రజలు, సిబ్బంది ఎలాంటి ఆందోళనలు చెందొద్దు. ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో పరిశ్రమలో వంద శాతం సామర్థ్యంతో ఉత్పత్తి జరుగుతుందని కుమార స్వామి స్పష్టం చేశారు. ఇదిలావుంటే విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటైజేషన్ అవ్వకూడదనే భావన అందరికీ ఉందని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అన్నారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామిని కలిసేందుకు స్టీల్ ప్లాంట్ అడ్మిన్ బ్లాక్కు ఎమ్మెల్యే వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... స్టీల్ ప్లాంట్ ఉద్యోగాలకు భద్రత కల్పించి ఎంతోమంది ప్రాణత్యాగాలు చేసి స్టీల్ ప్లాంట్ను తీసుకొచ్చారని గుర్తుచేశారు. విశాఖ నుంచి ఆంధ్రప్రదేశ్ బీజేపీ తరఫున ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటైజేషన్ అవ్వకుండా మంచి భవిష్యత్తు స్టీల్ ప్లాంట్కి ఉండేటట్టు చూడవలసిందిగా తాము కూడా కోరామని తెలిపారు. ఎలక్షన్ ముందు కూడా కోరడం జరిగిందన్నారు. ఎలక్షన్ తర్వాత బీజేపీ పార్లమెంట్ సభ్యులు... కేంద్ర అధిష్టానానికి చెప్పామన్నారు. కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్, కేంద్రమంత్రి కుమారస్వామి ప్లాంట్ విజిట్ చేసి మంచి నిర్ణయం తీసుకుంటారని నమ్మకం ఉందన్నారు. స్టీల్ ప్లాంట్కు అనేక రకాల ఆప్షన్స్ ఉన్నాయన్నారు. ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటే.. మన భవిష్యత్తు బాగుంటుంది, ఉద్యోగస్తులకు ఇబ్బంది లేకుండా ఉండాలనేది అందరి అభిప్రాయం.

# తల్లికి వందనం పథకం

(మొదటిపేజీ తరువాయి)

అమలు చేస్తామని నాడు హామీ ఇచ్చింది. అందులో భాగంగా రూ 4 వేల పెన్షన్ ను ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తోంది. ఇక, తల్లికి వందనం పేరుతో బడులకు వెళ్లే విద్యార్థుల తల్లులకు రూ 15 వేలు చొప్పున ఇచ్చేలా ప్రకటించిన హామీ పైన తాజాగా మార్గదర్శకాలు జారీ చేసింది. అందులో కొన్ని సందేహాలు చర్చగా మారుతున్నాయి. ప్రభుత్వం కసరత్తు వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అమ్మ ఒడి పేరుతో బడులకు వెళ్లే పిల్లల తల్లుల ఖాతాల్లో నగదు జమ చేసింది. పథకం కింద రూ 15 వేలు ఇస్తామని చెప్పినా..నిర్వహణ ఖర్చుల పేరుతో రూ వెయ్యి మినహాయించి రూ 14 వేలు తల్లుల ఖాతాల్లో జమ చేసింది. అదే సమయంలో ఆ తల్లికి ఇద్దరు పిల్లలు ఉన్నా...ఒక పిల్లకు మాత్రమే పథకం అమలయ్యేది. అయితే, టీడీపీ హామీ ఇచ్చిన సూపర్ సిక్స్లో తాము ఎంతమంది పిల్లలున్నా అందరికీ ఇస్తామని చెప్పుకొచ్చింది. చంద్రబాబు, పవన్ సైతం ఇదే అంశాన్ని ప్రధానంగా ప్రచారం చేసారు. మార్గదర్శకాలు జారీ ఈ పథకం అమలుకు సంబంధించి ప్రభుత్వం తాజాగా మార్గదర్శకాలు విడుదల చేసింది. అందులో తల్లికి వందనం పథకం అమల్లో భాగంగా ఒక్కో తల్లికి రూ 15 వేలు ఇవ్వనన్నట్లు పేర్కొంది. పథకం అమలు మార్గదర్శకాలతో అధి కారికంగా జీవో నెంబర్ 29 విడుదల అయింది. ఎన్నికల సమయంలో ఒక ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ అమలు చేస్తామని చెప్పి..జీవోలో ఈ విధంగా ప్రస్తావన చేయ టం పైన ఇప్పుడు లబ్దిదారుల్లో చర్చ సాగుతోంది. ఒక్కో తల్లికి రూ 15 వేలు అని ప్రస్తావన చేయటం ద్వారా..ఒక్కరికే అమలు చేస్తారా అనే సందేహాలు మొదలయ్యాయి. లోపించిన స్పష్టత ఈ పథకం పైన టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చర్చ మొదలైంది. బడులు మొదలైన సమయంలో విద్యా కిట్లతో పాటుగా తల్లికి వందనం అమలు చేయాలంటూ డిమాండ్లు వచ్చాయి. తొలుత ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారికే పథకం అమలు చేస్తారనే ప్రచారమూ సాగింది. కానీ, తాజా మార్గదర్శకాల్లో అలాంటి షరతులు లేవు. గత ప్రభుత్వం తరహాలోనే అమలు కోసం నిర్దేశించిన డాక్యుమెంట్లు..హాజరు శాతం గురించి స్పష్టం చేసారు. అయితే, పథకం ఒక్క బిడ్డకే ఇస్తారా..ఎన్నికల హామీ మేరకు అమలు చేస్తారా అనేది స్పష్టత ఇవ్వాలని లబ్దిదారులు కోరు తున్నారు.

# నీట్ పేపర్ లీక్ వ్యవహారం..

**న్యూఢిల్లీ,జూలై 11 :** నీట్ ప్రవేశ పరీక్ష లీక్ కేసులో రాకీ అలియాస్ రాకేష్ రంజన్ అనే మరో నిందితుడిని సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ సిబిఐ అదుపులోకి తీసుకుంది. బిహార్లోని నవాడ అతని స్వగ్రామం. రాకీ కొన్ని సంవత్సరాలుగా రాంచీలో ఓ రెస్టారెంట్ నడుపుతున్నాడు. అతను నీట్ పేపర్ లీక్ అయిన తర్వాత అందులోని ప్రశ్నలకు సమాధానాలు రాసి చింటూ మొబైల్కు పంపాడు. రాకీని పట్టుకు నేందుకు పట్నా, కోల్కతా సమీపంలోని పలు ప్రాంతాల్లో సీబీఐ దాడులు నిర్వహించింది. అతని భార్య ఇమెయిల్ ఎఆ ఐపీ అడ్రస్ ద్వారా రాకీని పట్టుకోగలిగారు.అరెస్టు అనంతరం కోర్టులో రాకీని హాజరు పరిచారు. తదుపరి విచారణ కోసం సీబీఐ అతనికి10 రోజుల రిమాండ్ను మంజూరు చేసింది. అతను ఇప్పటికే కొన్ని పోటీ పరీక్షల పేపర్ల లీకేజీకి పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. బిహార్ రాష్ట్రం మలందాకు చెందిన మాస్టర్ మైండ్ సంజీవ్ ముఖియాతో ఇతనికి సంబంధాలు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి ఇటీవలే ఇద్దరు అనుమానితులైన సన్నీ, రంజిత్లను సీబీఐ అరెస్టు చేసింది. సన్నీ విద్యార్థి కాగా, రంజిత్ ఓ విద్యార్థి తండ్రి. వీరిని ఆరు రోజుల రిమాండ్కు తరలించారు. వారిని విచారిస్తుం డగానే రాకీ గురించి తెలిసింది.

# బియ్యం ఎగుమతులపై నిషేధం ఎత్తివేత?

(మొదటిపేజీ తరువాయి)

ఎగుమతులపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలనే డిమాండ్ ఉంది. మంత్రుల బృందంతో చర్చించి దీనిపై నిర్ణయం తీసుకుంటాం. వ్యవసాయ ఉత్పత్తులు, వినియోగ విధానాలు, రిటైల్, హోల్సేల్ మార్కెట్లో ధరలు..వంటి వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుని సహేతుక నిర్ణయం వెల్లడిస్తాం. నాణ్యతా ప్రమాణాలకు సంబంధించి భారతీయ ఎగుమతి విధానాలపై వ్యాపా రులకు సరైన అవగాహన ఉంది. దేశంలో ఆహార ఉత్పత్తుల ఎగుమతుల విలువ 56 బిలియన్ డాలర్లు (రూ.4.6 లక్షల కోట్లు)కు చేరుకుంది. భారత్ ఎగుమతి చేస్తున్న కొన్ని ఉత్పత్తుల్లో సమస్యలున్నట్లు ఆరోపణలున్నాయి. వాటిని పరిష్కరించేందుకు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఎస్ఏఐ) పనిచేస్తోంది' అన్నారు. దేశీయంగా సరఫరాను పెంచడానికి జులై 20, 2023 నుంచి బాస్మతీయేతర బియ్యం ఎగుమతులపై నిషేధం విధించారు. దాంతో స్థానికంగా బియ్యం పండిస్తున్న రైతులకు సరైన ధరలు లభించడం లేదనే వాదనలున్నాయి. రైతులు, వ్యాపారులు బియ్యం ఎగుమతులపై నిషేధం ఎత్తివేయాలని కోరుతున్నారు. దాంతో ప్రభుత్వం మంత్రుల బృందంతో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకోనుంది. ఉప్పుడు బియ్యం(పార్బాయిల్డ్ రైస్)పై ఎగుమతి సుంకాన్ని టన్నుకు 100 డాలర్లు(రూ.8,300)గా నిర్ణయించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. ఈ వెరైటీ బియ్యంపై ప్రస్తుతం 20 శాతం ఎగుమతి సుంకాన్ని వసూలు చేస్తున్నారు.

# సరసమైన ధరలకు నిత్యావసర సరుకులు

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ఇందులో భాగంగా బియ్యం, కందిపప్పు ను అందించేందుకు రైతుబజార్లలో 284 ప్రత్యేక కౌంటర్లను ప్రారంభించినట్లు మనోహర్ తెలిపారు. గురువారం విజయవాడ, ఏపీఐఐసీ కాలనీ రైతు బజార్లో మంత్రి నాదెండ్ల మనోహర్.. స్థానిక శాసనసభ్యులు గద్దె రామ్మోహన్, పౌర సరఫరాల శాఖ కమిషనర్ సిద్దార్థ్ జైన్, డైరెక్టర్ వీరపాండ్యన్, మార్కెటింగ్ శాఖ కమిషనర్ జి.శేఖర్బాబు, జిల్లా కలెక్టర్ డా. జి.సృజన, జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్ తదితరులతో కలిసి బియ్యం, కందిపప్పు ప్రత్యేక కౌంటర్ను ప్రారంభించారు. కిలో కందిపప్పు రూ. 160, కిలో బియ్యం రూ. 49, కిలో బియ్యం రూ. 48కే అందించే ఈ కౌంటర్ ద్వారా వినియోగదారులకు సరుకులను అందించారు. అనంతరం మీడియా సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వివిధ సంక్షేమ పథకాలతో పాటు నిత్యావసర సరుకులను సరసమైన ధరల్లో సామాన్యులకు అందుబాటులో ఉంచేందుకు అధికారులు, రైస్ మిల్లర్లు, హోల్సేల్, రిటైల్ వ్యాపారులు తదితరుల సమష్టి భాగస్వామ్యంతో కృషిచేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న ధరల పెరుగుదల సమస్యను తమ కుటుంబ సమస్యగా భావించి, పరిష్కరించాల్సిన బాధ్యత వీరందరిపైనా ఉందన్నారు. నిత్యావసర సరుకుల ధరల స్థిరీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. బయట కిలో కందిపప్పు రూ. 181 ఉండటం వల్ల సామాన్యులు ఇబ్బందిపడుతున్నారని.. దీన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రమంతా ఒకే ధర



అమలుకావాలనే ఉద్దేశంతో నిర్ణయం తీసుకోవడం జరిగిం దని.. హోల్సేల్, రిటైల్ దుకాణాలు, సూపర్ మార్కెట్లు వంటి వాటి లో కూడా రూ. 160కే కిలో కందిపప్పును అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. త్వరలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా చక్కెర, చిరుధాన్యాలు వంటివి కూడా అందించేందుకు కృషిచేస్తున్నామని.. వినియోగదారులు ఈ ప్రత్యేక కౌంటర్లను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. రైతులతో పాటు వినియోగదారులకు కూడా లాభం చేకూరేలా పటిష్ట కార్యాచరణతో ముందుకెళ్తున్నామన్నారు. గత ప్రభుత్వం రైతులకు రూ. 1,600 కోట్లు బకాయిపెట్టి వెళ్లిందని.. రైతుల సంక్షేమాన్ని, క్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి చొరవతో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రూ. 1000 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. మిగిలిన రూ. 600 కోట్లను త్వరలోనే అందించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థను ఎక్కడా ఎలాంటి అవినీతి లేకుండా లోటుపాట్లకు తావులేకుండా అమలుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. పేదలకు చెందాల్సిన బియ్యం పక్కదారిపడితే చర్యలు తప్పవన్నారు. ఒక్క కాకినాడలోనే 43,249 మెట్రిక్ టన్నుల మేర బియ్యాన్ని సీజ్ చేయడం జరిగిందని.. సమగ్ర దర్యాప్తు నిర్వహించి, బాధ్యులపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. సామాన్యులకు అందాల్సిన సరుకులు వారికి సరైన విధంగా అందాల్సిందేనని మంత్రి మనోహర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఆర్డీవో బీహెచ్ భవానీ శంకర్, పౌర సరఫరాల డీఎం జి.వెంకటేశ్వర్లు, మార్క్ఫెడ్ డీఎం కె.నాగమల్లిక, డీఎస్వో జి.మోహన్బాబు, లీగల్ మెట్రాలజీ అధికారి ఎ.కృష్ణచైతన్య, అగ్రీ ట్రేడ్ మార్కెటింగ్ అధికారి కె.మంగమ్మ, రాష్ట్ర రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ గుమ్మడి వెంకటేశ్వరరావు, జిల్లా ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, మహాత్మా గాంధీ హోల్సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ (గొల్లపూడి) ప్రెసిడెంట్ పరుచూరి నాగేశ్వరరావు, ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ స్టేట్ ప్రెసిడెంట్ భాస్కరరావు, జిల్లా ప్రెసిడెంట్ రవి, రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కరుణాకర్, రైతులు, వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

# శరవేగంగా మచిలీపట్నం పోర్టు నిర్మాణం





**జిల్లా అభివృద్ధే ప్రధాన లక్ష్యం..! -రాబోయే రోజుల్లో మంచి నీటి సమస్య లేకుండా చేస్తాం- జిల్లా కలెక్టర్ తో కలసి జిల్లా అభివృద్ధి పనులు, సమస్యలపై సమీక్షించిన ఎంపీ వల్లభనేని బాలశౌరి.!**

**మచిలీపట్నం జూలై 11 (ఆంధ్రపత్రిక):** జిల్లా అభివృద్దే ప్రధాన లక్ష్యంగా అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని, అందుకు అవసరమైన సహాయ సహకారాలను అన్ని విధాలుగా అందిస్తామని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి అన్నారు. గురువారం మధ్యాహ్నం కలెక్టరేట్లోని సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆధ్వర్యంలో మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి జిల్లాలోని పలు అభివృద్ధి పనులు, పెండింగ్ సమస్యలపై సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనుల పురోగతి, జల జీవన్ మిషన్ పథకం, ప్రకాశం బ్యారేజ్ దిగువన నిర్మించ తలపెట్టిన మరో రెండు బ్యారేజీల నిర్మాణం, ఎదురుమొండి బ్రిడ్జి నిర్మాణం, సిఎస్ఆర్, ఎంపీ లాడ్స్ నిధులు, మచిలీపట్నం పట్టణ అభివృద్ధి తదితర అంశాలపై విభాగాల వారీగా ఆయన సమీక్షించారు. ఎంపీ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సమస్యలు అధికంగా ఉన్నాయని, ముఖ్యంగా తీర ప్రాంతాలైన అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో తాగునీటి సమస్య తీర్చేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. జల జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి గ్రామానికి మంచినీటిని అందించేందుకు అవసరమైన నిధులను సమకూరుస్తామని, అందుకు సంబంధించిన పనులను సమర్థవంతంగా నిర్వహించ గలిగే ఏజెన్సీకి పనులను అప్పజెప్పే విధంగా చూడాలన్నారు. మెగా ఇంజనీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జరుగుతున్న పోర్టు పనులు దాదాపుగా సంవత్సరం నుండి నిరాటంకంగా కొనసాగుతూ ప్రస్తుతం 20 శాతం మేర పనులు పూర్తయ్యాయని అధికారుల ద్వారా తెలుసుకున్న ఆయన, ప్రణాళిక ప్రకారం 16 బెర్తుల నిర్మాణానికి గాను మొదటి దశలో నాలుగు బెర్తుల నిర్మాణాన్ని నిర్దేశిత సమయానికి పూర్తిచేయాలని పోర్టు అధికారులకు సూచించారు. రూ. 250 కోట్లతో భారతమాల ప్రోగ్రాం ద్వారా పోర్టు కనెక్టివిటీ రోడ్డు నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారని, కేంద్ర ప్రభుత్వం నుంచి సంబంధిత నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. ప్రకాశం బ్యారేజ్ దిగువన ప్రతిపాదించిన రెండు బ్యారేజ్ ల నిర్మాణాల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెనమలూరు మండలం చోడవరం, అదే విధంగా మోపిదేవి మండలం బండికొల్లంక వద్ద నాలుగు టిఎంసిల చొప్పున నీటి నిలువ సామర్థ్యంతో నిర్మిస్తా మన్నారు. వీటి ద్వారా పరిసర ప్రాంతాలకు రానున్న కాలంలో సాగు, తాగునీటి కష్టాలు తీరుతాయని, బ్యారేజీల నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అదేవిధంగా అవనిగడ్డ నియోజకవర్గంలో ఎదురుమొండి వద్ద నాబార్డు నిధులతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నామని, ప్రభుత్వం ద్వారా పునఃప్రతిపాదనలు పంపి త్వరలోనే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. పార్లమెంటు పరిధిలో కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి అధిక మొత్తంలో నిధులను తీసుకురావడం జరిగిందని, అందుకు సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారుల కు సూచించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో కృష్ణా జిల్లా నుండి అమరావతి రాజధానికి తూర్పు బైపాస్ నిర్మాణం చేపడతామని, రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వంతో చర్చించినట్లు ఎంపీ తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో డ్రైనేజీ, తాగునీటి సమస్య ప్రధానంగా నెలకొందని, రాబోయే రోజుల్లో ఈ సమస్యలను అధిగమించేందుకు అమృత్ స్కీమ్ ద్వారా ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. నగరంలో డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎంపీ సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, బందరు ఆర్డీఓ ఎం వాణి, మచిలీపట్నం నగర కమిషనర్ బాపిరాజు, జిల్లా ఆర్డబ్ల్యూఎస్ అధికారి టి శివప్రసాద్, మెగా ఇంజనీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ తులసీదాస్, రైట్స్ టీం లీడర్ విశ్వనాథం, ఆర్ అండ్ బి ఈఈ శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మొండిగేటు అవుట్ ఫాల్ డ్రైన్ రైల్వే క్రాసింగ్ పనులపై

# అధికారులు దృష్టి సారించాలి

### తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ అహ్మద్.



**గుంటూరు : జులై 11( ఆంధ్రపత్రిక ):** సుధీర్ఘకాలం నుండి పరిష్కారం కాకుండా ఉన్న మొండిగేటు వద్ద అవుట్ ఫాల్ డ్రైన్ రైల్వే క్రాసింగ్ కు వేగంగా చర్యలు తీసుకోవడానికి జిఎంసితో పాటు రైల్వే అధికారులు కూడా మరింత దృష్టి సారించాలని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎంఎల్ఏ మహ్మద్ నసీర్ తెలిపారు. గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో స్థానిక పాత గుంటూరు దగ్గరలోని మొండి గేటు రైల్వే ట్రాక్ వద్ద అవుట్ ఫాల్ డ్రైన్ క్రాసింగ్ అంశంపై జిఎంసి ఇంజరింగ్, రైల్వే డివిజనల్ ఇంజనీర్ల తో ఎంఎల్ఏ సంయుక్త సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ నసీర్ మాట్లాడుతూ పాత గుంటూరు పరిధిలోని మొండి గేటు వద్ద అవుట్ ఫాల్ డ్రైన్ రైల్వే ట్రాక్ క్రాస్ వద్ద షుమారు 30 ఏళ్ల నుండి సమస్యగా ఉందని, నగరంలో నుండి 4 మీటర్ల అవుట్ ఫాల్ డ్రైన్ నుండి వచ్చే మురుగు లేదా వర్షం నీరు ట్రాక్ కింద కేవలం 1.5 మాత్రమే ఉన్న వెంట్ నుండి వెళ్లడం వలన నీరు పూర్తి స్థాయిలో బెయిల్ అవుట్ కాక పాత గుంటూరులోని పలు ప్రాంతాలు ముంపుకు గురవుతున్నాయన్నారు. దీని వలన పలు కాలనీల ప్రజలు ఎంత ఇబ్బంది పడుతున్నారో, రైల్వే ట్రాక్ మునిగి రైళ్ల రాకపోకలకు కూడా అంతరాయం కల్గుతుందన్నారు. కనుక నగరపాలక సంస్థతో పాటు రైల్వే అధికారులు కూడా సమస్య పరిష్కారానికి మరింత శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. రైల్వే నుండి సమావేశంకు హాజరైన డివిజనల్ ఇంజినీర్ తమ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీవ్రతను వివరించాలన్నారు. నగరపాలక సంస్థ నుండి కూడా రైల్వే అధికారులు తగిన వివరాలతో లేఖలు రాయాలని, కేంద్ర సహాయ మంత్రి, గుంటూరు ఎంపి పెమ్మసాని చంద్ర శేఖర్ దృష్టికి కూడా తీసుకెళ్లతామని తెలిపారు. తదుపరి సమావేశం నాటికి సమస్య పరిష్కారానికి నిర్దిష్ట ప్రతిపాదనలు, టైం లైన్ కార్యాచరణ సిద్దం అయ్యేలా రైల్వే, జిఎంసి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిఎంసి ఎస్ఈ శ్యాం సుందర్, ఈఈ కోటేశ్వరరావు, రైల్వే డివిజనల్ ఇంజినీర్ సుదర్శనరెడ్డి, జిఎంసి డిఈఈ శ్రీధర్, ఏఈ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

# ప్రజలను ఆదుకోవడంలో తృప్తిని మించింది ఏమీ లేదు

## రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శుల ప్రమాణస్వీకారంలో పాల్గొన్న ప్రత్తిపాటి







**చిలకలూరిపేట,జులై 11(ఆంధ్రపత్రిక):** పట్టణంలో గురువారం ఉదయం రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం గ్రాండ్ వెంకటేశ్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించారు. 2024-25 సంవత్సరానికి గాను రోటరీ క్లబ్ అధ్యక్షునిగా శరత్‌కుమార్ శాస్త్రి, కార్యదర్శిగా కొల్లా వెంకటసుబ్బారావు, కోశాధికారిగా జంపని శ్రీనివాసరావు పదవీ ప్రమాణాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు హాజరైయ్యారు. తదనంతరం వారికి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. తదనంతరం ప్రత్తిపాటి మాట్లాడుతూ ఎంత సంపాదించినా ప్రజాసేవతో ప్రజలను ఆదుకోవడంలో ఉన్న తృప్తిని మించింది ఏమీ లేదన్నారు. మిగిలిన వారితో పోల్చుకుంటే ఇతరులకు సాయం చేసే వారిలో ఉండే ఆనందమే వేరన్నారు. సమాజంలో మనల్ని ప్రత్యేకంగా నిలబెట్టేవి సేవా కార్యక్రమాలే అన్నారు. రాజకీయంగా కావచ్చు, రోటరీ క్లబ్ ద్వారా కావచ్చు, లయన్స్ క్లబ్ ద్వారా కావచ్చు ఆర్థికంగా స్థిరపడిన వారు.. ఆర్థికంగా వెనుకబడిన సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. రోటరీ క్లబ్ తరఫున చిలకలూరిపేటలో కూడా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని.. వారందరిని అభినందిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద కుటుంబాల నుంచి, వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చేటువంటి పేదలకు ఎంత చేసినా కూడా తక్కువేనని అన్నారు. ఆర్థికంగా స్థిరపడిన వారితో పాటు ఆర్థికంగా ఎదుగుతున్న వారంతా నిండు మనసుతో ముందుకొచ్చి చేయూత ఇస్తే అంతకు మించిన ఆత్మ సంతృప్తి మరొకటి లేదన్నారు. దాతల సహకారంతో పేదలు, విద్యార్థులకు ఉపయోగపడేలా రోటరీ క్లబ్ తరఫున మరిన్ని మంచి కార్యక్రమాలు చేయాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. అలానే రాష్ట్రంలో అరాచక పాలకుడుని సాగనంపిన ప్రజల తీర్పుతో ఒక మంచి ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ఇన్నేళ్ల ప్రజాస్వామ్య భారతంలో ఇలాంటి తీర్పును ఎప్పుడూ ఇవ్వలేదన్నారు.

చేతగాని సీఎం వస్తే ఏ విధమైన తీర్పును ఇచ్చారో ప్రజల తీర్పును బట్టి అర్థమవుతుందన్నారు. చిలకలూరి పేట సహా రాష్ట్రంలో అనేక నియోజకవర్గాల్లో ఇంత మెజార్టీలు ఎప్పుడూ చూడలేదన్నారు. గత పాలకుల వైఫల్యం, అరాచకాలు, తప్పిదాలు, స్వేచ్ఛను హరిస్తే ఎలాంటి తీర్పు ఇస్తారో ఇటీవలి ఎన్నికలే నిదర్శన మన్నారు ప్రత్తిపాటి. రాష్ట్రానికి డబ్బులు లేకపో యినా మంచి పరిపాలన దక్షుడు వచ్చారన్నారు. అప్పులపాలైన రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు కష్టపడుతున్నారని ప్రత్తిపాటి కొనియాడారు.

## శాసనమండలి సభ్యులు కె.యస్ .లక్ష్మణరావు

# 68వ జన్మదిన వేడుకలు



**గుంటూరు : జులై 11( ఆంధ్రపత్రిక ):** నీతి, నిజాయితీకి ఆదర్శంగా నిలిచిన నిరంతర అధ్యయన శీలి శాసనమండలి సభ్యులు కె. యస్. లక్ష్మణరావు ఆదర్శ ప్రాయులు అని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి పేర్కొన్నారు. ఈనెల 11వ తేదీన గుంటూరులోని లక్ష్మణరావు స్వగృహంలో 68వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వల్లం రెడ్డి లక్ష్మణ రెడ్డి ప్రసంగిస్తూ గత ఐదు దశాబ్దాల కాలంలో విద్యార్థి ఉద్యమ నాయకునిగా,ఉపాధ్యాయ ఉద్యమ నేతగా, జన విజ్ఞాన వేదిక నేతగా, శాసనమండలి సభ్యులుగా అవిరళ కృషి చేశారన్నారు. వేలాదిమంది విద్యార్థులకు పోటీ పరీక్షలలో శిక్షణ ఇచ్చి వందలాదిమంది ప్రభుత్వ ఉద్యోగులను రూపొందించారని కొనియాడారు. నిరంతరం సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలను అధ్యయనం చేస్తూ పరిష్కార మార్గాలను చూపిస్తూ శాసనమండలిలో ప్రజల గొంతుక గా మారినారన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం మంత్రులను, అధికారులను కలుస్తూ ఆయా సమస్య ల పరిష్కారం కోసం శ్రమపడేవారన్నారు. నేటి రాజకీయ నేతలు కె.యస్.లక్ష్మణరావు ను ఆదర్శంగా తీసుకుని కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు వి కైలాస్ నాథ్, రామచంద్రరావు,రామారావు, జిల్లా ఉప విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు,అర్బన్ డిఐ, కాసిం,జిల్లా యుటిఎఫ్ నాయకులు కె. కళాధర్,జి. వెంకటేశ్వర్లు,రాష్ట్ర ప్రచురణ సంఘం చైర్మన్ ఎం. హనుమంతరావు, పసుపులేటి శ్రీధర్, కుర్ర శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు కిరణ్, డివైఎఫ్ఐ నాయకులు లక్ష్మణ్, ఏపీ రెసిడెన్షియల్ సంఘం నాయకులు పి.వి.మల్లేశ్వర్ ఉపాధ్యాయులు అధ్యాపకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బి.ఫార్మసీ పట్టభద్రులు ఔషధ రంగంతో పాటు సివిల్ సర్వీసెస్ పరీక్షలలో అర్హత పొంది సమాజ సేవ చేయాలి



**గుంటూరు : జులై 11( ఆంధ్రపత్రిక ):** స్థానిక అమరావతి రోడ్డు నందు గల హిందూ ఫార్మసీ కళాశాలలోని బి.ఫార్మసీ చివరి సంవత్సరం పూర్తిచేసిన విద్యార్థులకు తమ జూనియర్ విద్యార్థులు గురువారం ఘనంగా వీడ్కోలు సభ ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.ఎం.వి.నాగభూషణం తెలియచేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథి గా విచ్చేసిన చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ ఫార్మసీ పట్టభద్రులు ఔషధ రంగం తో పాటు జాతీయ స్థాయిలో పరిపాలనా రంగంలో ప్రవేశ పరీక్షలైన సివిల్ సర్వీసెస్ శాఖలలో చేరటానికి అర్హత పొంది సమాజ సేవ చేయాలని తెలియచేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి. నాగభూషణం మాట్లాడుతూ PGECET/GPAT పరీక్షలలో అర్హత సాధించిన విద్యార్థులకు తమ అభినందనలను తెలియ చేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.సీతారామయ్య మాట్లాడుతూ బి.ఫార్మసీ విద్యార్థులు ఎం.ఫార్మసీ చదివితే ఉత్తమ ఉపాధి అవకాశాలు ఉంటాయని అన్నారు. సీనియర్ విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు ఆటల పోటీలు నిర్వహించారు. అందులో గెలుపొందిన వారికి ముఖ్య అతిథి జూపూడి రంగరాజు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి డా.ఎస్.మధుసూదన రావు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, బి.ఫార్మసీ అధ్యాపకులు ఎన్.విజయలక్ష్మి, డాక్టర్ పి.జవహర్ బాబు, బి.ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉర్దూ పాఠశాల విద్యార్థులకు పూర్తిగా టెక్స్ట్ బుక్కులు అందించాలి



**బాపట్ల ,జులై 11(ఆంధ్రపత్రిక):** ఉర్దూ పాఠశాలలో చదువుకునే పిల్లలకు కొన్ని టెక్స్ట్ బుక్స్ ఇంకా రాలేదని తల్లిదండ్రులు తెలిపారు. దీని వలన పిల్లలు చదువులో వెను కబడి పోతారని అన్నారు. కొన్ని పుస్తకాలు ఇచ్చారు. మరికొన్ని ఇవ్వ లేదన్నారు. ఈ విషయం పై ఉపా ధ్యాయులు వస్తా యి అని అంటున్నారు. కానీ ఎప్పటికో స్పష్టత ఇవ్వా లని కోరారు. పాఠశాలలు ప్రారంభమై నెల అవుతున్నా ఎప్పుడు వస్తా యో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై బాపట్ల జిల్లా ఉర్దూ డీ ఐ నజ్మా ఖాతూన్ దృష్టికి తీసుకెళ్లగా....9,10 తరగతి పుస్త కాలు సిలబస్ మారింద న్నారు. పుస్తకాలు ఇంత వరకు రాలేదు .మిగ తా పుస్తకాలు తరగతులు వారీగా కొన్ని రాలేదని తెలిపారు. ఈ విష యమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్ళాము. త్వరలోనే విద్యార్థు లకు పుస్తకాలు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు.

## కాపు అభివృద్ధి పథకాలను మరలా పునరిద్ధరించండి

### కాపు కార్పొరేషన్ ఎండీ కృష్ణమూర్తికి వినతిపత్రం అందచేసిన కాపు సంఘ నాయకులు.



**గుంటూరు , జులై 11( ఆంధ్రపత్రిక ):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2014-2019 సంవత్సరంలో అధికారంలో ఉన్న తెదేపా ప్రభుత్వం కాపు, తెలగ, ఉపకులాల అభ్యున్నతికి ఎన్నో మంచి పథకాలను ప్రవేశ పెట్టిందని, మరలా ఆ పథకాలను వెంటనే అమలు పరిచి కాపు కుల అభివృద్ధికి తోడ్పాటును ఇవ్వాలని కాపు కార్పొరేషన్ ఎండీ కృష్ణమూర్తికి తెలగ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందచే శారు. ఈ సందర్భంగా సంఘం సెక్రటరీ బాలిశెట్టి విజయ్ కుమార్ మాట్లాడుతూ గుంటూరులో కాపు భవనం నిర్మాణం త్వరలో మొదలు పెట్టేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు.

గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్నప్పుడు ప్రవేశపెట్టిన చంద్రన్న స్వయం ఉపాధి, గ్రూప్ ఎమ్ ఎస్ ఎమ్ ఈ, చందన్న విదేశీ విద్యాదీవెన, చంద్రన్న విద్యోన్నతి, నైపుణ్యాభివృద్ధి , స్టూడెంట్ స్కాలర్ షిప్ ప్రోగ్రామ్ పథకాలు, కాపు భావనాలు తదితర కాపు అభివృద్ధి కార్యక్రమాల వలన ఎంతోమంది కాపు, ఉపకు లాల వారు బాగా అభివృద్ధి చెందారని, అలాంటి తోడ్పాటును మళ్ళీ అందచేయాలని కోరారు. ప్రజా గళంలో, మ్యానిఫెస్ట్ లో ప్రతి సంవత్సరం 3000 కోట్ల రూపాయల చొప్పున కావు అభ్యున్నతి నిధుల ను విడుదల చేస్తామని ఇచ్చిన హామీలు నేరవేరుస్తారన్న పూర్తి నమ్మకం తమకు ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కోలా చలపతిరావు, రేపల్లె నవీన్, చెమిటికంటి కిరణ్, తుమ్మల నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

# ఆక్వా పార్కు ఏర్పాటుతో జిల్లా అభివృద్ధి



**బాపట్ల ,జులై 11(ఆంధ్రపత్రిక):** ఆక్వా పార్కు ఏర్పాటుతో జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు మత్స్య శాఖ అధికారులతో స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన సమావేశం అయ్యారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆక్వా పార్కు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతిలిస్తూ నిధులు మంజూరు చేసిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. భారతదేశంలో ఎక్కడా లేని విధంగా సముద్ర తీరం వెంబడి 192 ఎకరాలలో ఆక్వా పార్కు నిర్మించాలని ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. సముద్రం నుంచి ఏర్పడిన భూభాగంలో మత్స్య సంపద యోజన కింద ఆక్వా పార్కు నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. సమీకృత ఆక్వా సాగు చేయడానికి కేంద్రం పి పి (ప్రైవేట్ పార్ట్నర్షిప్) పద్ధతిలో నిర్మించడమే లక్ష్యమన్నారు. సముద్రం నుంచి ఏర్పడిన భూభాగానికి సర్వేనెంబర్ కేటాయిస్తూ అధికారిక అనుమతులపై 571 జీవోను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. సదరు భూమి కేటాయింపులకు సిసిఎల్ఏ నుంచి అనుమతులు ఈ నెలలో వస్తాయన్నారు. రూ.189 కోట్ల వ్యయంతో చేపట్టే ప్రాజెక్టుకు ఇప్పటికే రూ 84 కోట్లు నిధులు విడుదలయ్యి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్ట్ ప్రారంభానికి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఆక్వా పార్కు ప్రాజెక్ట్ తో ఐదు రకాల సెక్టార్లు నిజాంపట్నం ప్రాంతంలో అభివృద్ధిలోకి రానన్నాయని జిల్లా కలెక్టర్ వెంకట మురళి చెప్పారు. దేశంలో అత్యధిక పరిజ్ఞానంతో రూపొందించే మొదటి ప్రాజెక్టుగా ప్రాచుర్యం పొందనుందని ఆయన వివరించారు. కేవలం సముద్రంలోనే దొరికే సివిడ్స్ ఇక్కడ ఉత్పత్తి చేయడం ప్రారంభమవుతుందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించడం ఇందులో భాగమేనన్నారు. పండుగప్ప, పీతల వంటి అరుదైన జాతులు హ్యాచరీలు నిర్మాణం ఉందన్నారు. అరుదైన జాతి పీతల పెంపకం, ఎగుమతులు ఆక్వా పార్క్ నుంచి మొదలవుతాయన్నారు.

వివిధ రకాల జాతుల మత్స్య సంపద ఉత్పత్తులు, ఎగుమతులకు కేంద్రంగా ఆక్వా పార్కు అభివృద్ధి కానుందని వివరించారు. సముద్రంలో అరుదైన రంగు చేపలను అలంకరణల కొరకు ఉత్పత్తి చేసే ప్రక్రియ ఇక్కడ జరగనుం దన్నారు. వీటితోపాటు ఆక్వా టూరిజం అభివృద్ధిలోకి రానుం దని, 50 ఎకరాలలో స్పోర్ట్స్ ఫిష్ ప్రజలకు అందుబాటు లోకి తీసుకురావడం లక్ష్యమన్నారు. నిజాంపట్నం పర్యాటక ప్రాంతం గా రూపు దిద్దుకోనుందని స్పష్టం చేశారు. జిల్లాకు తలమానికగా ఈ ప్రాజెక్టు నిలువనుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ బి సుబ్బారావు, మత్స్య శాఖ ఏడి పి సురేష్, ఆర్డీఓ హేలాషారోన్, అనుబంధశాఖల అధికారులు, పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాల పై ప్రయాణించే వారు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలి



**బాపట్ల ,జులై 11(ఆంధ్రపత్రిక):** ద్విచక్ర వాహనాల పై ప్రయాణించే వారు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని బాపట్ల మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ ప్రసన్న కుమారి అన్నారు. గురువారం బాపట్ల లోని పలు ప్రాంతాల్లో వాహనదారులకు అవగాహన కల్పించారు. మోటారు వాహన చట్టాల గురించి, రోడ్డు భద్రత నియమాల గురించి, ద్విచక్ర వాహనాల పై ప్రయాణించే వారు హెల్మెట్ ధరించడం వలన కలిగే ఉపయోగం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనాన్ని నడిపే వారితో పాటు వెనుక కూర్చున్న వారు కూడా తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో ఎక్కువ శాతం ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారే మృత్యువాత పడుతున్నారన్నారు. దీనికి ప్రధాన కారణం ద్విచక్ర వాహనంపై ప్రయాణించేవారు హెల్మెట్ దరించక పోవడమేనని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు ఒక్కరినే బలిగొన వు...మొత్తం కుటుంబాన్నే విచ్ఛిన్నం చేస్తాయన్నారు. ఇలాంటి విప త్కర పరిస్థితులను కళ్లముందు చూస్తూనే ఉంటున్నామని, నష్టం జరిగిన అనంతరం ఆలోచించే కంటే ముందే జాగ్రత్త వహించాలన్నారు.

హెల్మెట్ వాడకంతో రోడ్డు ప్రమాదాల బారిన నుండి బయట పడవచ్చునని, కొద్దిపాటి గాయాలతో ప్రాణాలు కాపాడుకోవచ్చునని తెలిపారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరు విధిగా హెల్మెట్ ధరించి స్వీయ రక్షణ పాటించాల న్నారు. మోటారు వాహన చట్టా లు, రోడ్డు భద్రత నియమ నిబంధనలు పాటించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో పట్టణ ట్రాఫిక్ ఎస్సై సిబ్బంది పాల్గొన్నారు.

# మధ్యాన భోజన పథకాన్ని పక్కాగా అమలు చేయాలి



**బాపట్ల,జులై 11( ఆంధ్రపత్రిక ):** ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల కొరకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకంపై సంబంధిత విద్యా శాఖ, సమగ్ర శిక్ష అభియాన్ అధికారులతో గురువారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు.

భావి భారత పౌరుల కొరకు ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై అధికారులు నిర్లిప్తంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ప్రభుత్వ మార్గదర్శకాలు పక్కాగా అమలు జరగాలన్నారు. మధ్యాహ్న భోజనం పథకంలోని మెనూ అమలు తీరుపై ప్రతిరోజు అధికారులు తనిఖీలు చేయాలన్నారు. పిల్లలకు ఐదు రోజులపాటు కోడిగుడ్లు ఇవ్వాల్సిందేనన్నారు.

మూడు రోజులు రాగిజావ, మరో మూడు రోజులు చిక్కీలు ఇవ్వాలన్నారు. అధికారులు పాఠశాలలను విధిగా తనిఖీలు చేసి నివేదిక పంపాలని ఆదేశించారు. ఏ పాఠశాలలోనైనా మెనూ అమలు జరగడం లేదని ఫిర్యాదులు వస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు నిరంతరం పర్యవేక్షించాలని ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉప విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసి ఎం వెంకట సుధాకర్ బాబు, విద్యాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ధరలు తగ్గించి పేదలకు ఊరటనివ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

## చిలకలూరిపేట రైతుబజారులో రాయితీపై కందిపప్పు, బియ్యం

## రాయితీపై కందిపప్పు, బియ్యం పంపిణీ చేసిన ప్రత్తిపాటి, కలెక్టర్ అరుణ్‌బాబు







**చిలకలూరిపేట,జులై 11(ఆంధ్రప్రత్రిక):** రాష్ట్రంలో అయిదేళ్ల వైకాపా పాలనలో అడ్డుఅదుపు లేకుండా పెరిగి పోయిన ధరలు తగ్గించి పేద ప్రజలకు సాధ్యమైనంత ఊరట కలిగించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వం లక్ష్యమని స్పష్టం చేశారు. మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ సీనియర్ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు. ఆ మేరకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నెలలో నిలబెట్టుకుని ప్రజాప్రభుత్వం అని నిరూపించుకుంటున్నామన్నారు. గురువారం చిలకలూరిపేట రైతుబజారులో రాయితీపై కంది పప్పు, బియ్యం విక్రయాలను కలెక్టర్ అరుణ్‌బాబుతో కలసి ప్రారంభించారు ప్రత్తిపాటి పుల్లారావు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసరాల ధరలపై ఎన్నికల్లో చంద్రబాబు చెప్పిన మాట మేరకే భాగంగా బహిరంగ మార్కెట్‌లో రూ.180 ఉన్న కందిపప్పును రూ.160కి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో మరిన్ని వస్తువుల విషయంలోనూ ఈ ఊరట కలిగిస్తామన్నారు. ప్రజలందరికీ కావాల్సిన నిత్యావసరాల ధరలను దశలవారీగా తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అందులో భాగంగానే రైతుబజార్లలో కందిపప్పు, బియ్యం విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీంతో పాటు ధరల నియంత్రణ కోసం మిల్లర్లు, వ్యాపా రులతో సమావేశాన్నీ ఏర్పాటు చేశామన్నారు ప్రత్తిపాటి. తొలిదశలో కందిపప్పుపై కిలోకి రూ.21 తగ్గించామని, నాణ్యమైన స్టీమ్డ్ రైస్(బీపీటీ, సోనా మసూరి) కిలో రూ.49, ముడిబియ్యం కిలో రూ.48 చొప్పున ప్రత్యేక కౌంటర్ ద్వారా విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఒకరికి 5కిలోల బియ్యం, కిలో కందిపప్పు ఇస్తారని, ప్రజలంతా ఈ సౌకర్యం ఉపయోగించుకోవాలని కోరారు. ప్రతిపేదకు మూడు పూటలా కడుపునిండా అన్నం పెట్టాలన్నది సీఎం సంకల్పం అని, అందులో భాగంగానే కూటమి ప్రభుత్వం వచ్చిన నెలలోనే 10రకాల సమస్యలు పరిష్కరించడం తో పాటు పలు హామీలను అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదని కొనియాడారు ప్రత్తిపాటి. కందిపప్పు, బియ్యంపైన నిర్ణయించిన ధరలకే విక్రయించాలని లేదంటే చర్యలు తప్పవనీ హెచ్చరించారు. అనంతరం మాట్లాడిన కలెక్టర్ అరుణ్‌బాబు మార్కెట్ ధర కంటే తక్కువకే కందిపప్పు, బియ్యం పంపిణీ చేస్తున్నామని... ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ధరల నియంత్రణ కోసం ఎంపిక చేసిన రైతు బజార్లలో కందిపప్పు, బియ్యం విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశామ ని తెలిపారు. మాల్స్ తో పాటు లేఅవుట్లలోనూ ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే విక్రయించాలని అన్నారు. బయట మార్కెట్ తో పోల్చుకుంటే మంచి నాణ్యమైన కందిపప్పు, బియ్యాన్ని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కందిపప్పు, బియ్యం ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడతామని చెప్పారు.

## ఘనంగా ఎంప్లాయీస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**చిలకలూరిపేట,జులై 11(ఆంధ్రప్రత్రిక):** పట్టణంలో ఉన్న ఆర్టీసీ బస్సు డిపో నందు డిపో సెక్రటరీ అద్దంకి వర ప్రసాదరావు అధ్యక్షతన ఎంప్లాయిస్ యూనియన్ పేట డిపో 73వ ఆవిర్భవ దినోత్సవంను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కేక్ ను కట్ చేసి యూనియన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.తదనంతరం జెండా వందనం చేశారు.ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆర్టిసి స్థాపించిన దగ్గర నుండి తమ సేవలను ప్రజలకు అందిస్తూ ఉద్యమాలను చేస్తూ క్రమశిక్షణతో నడుచుకుంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బి కోటేశ్వరరావు. , డిపో ప్రెసిడెంట్. ఏఎస్. రావు, జాయింట్ సెక్రటరీ ఎం. సుబ్బారావు, వర్కింగ్ కమిటి ప్రెసిడెంట్ కేవై. రత్నం, సాంబిరెడ్డి, అంకారావు , సాదిక్, ఏవి. రెడ్డి, ఎంకే రావు, కె. సుబ్బారావు, కేశవులు, మంగయ్య, బుంగయ్య, యడవల్లి టీ .థామస్, డిపో ట్రెజరర్ సైదావలి, పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు ఎం. కమల, కె. సన్నిధి, పీవీ. శాంతి,డిపో కమిటీ సభ్యురాలు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## బి ఎస్ సిక్స్ మోటార్ సైకిల్ శిక్షణా తరగతులు




**బంటుమిల్లి ,జులై 11(ఆంధ్రప్రత్రిక):** బంటుమిల్లిలో శ్రమశక్తి కృష్ణా జిల్లా టూ వీలర్స్ మెకానిక్స్ మరియు వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బి ఎస్ సిక్స్ మోటార్ సైకిల్ రిపేరింగ్ శిక్షణా తరగతులను బంటుమిల్లి లోని గీతా మందిరం నందు గురువారం నాడు ఏర్పాటు చేయడం జరిగింది. రాష్ట్ర టూ వీలర్స్ మరియు వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దాయనేని ధర్మ మాట్లాడుతూ మోటార్ సైకిల్ లలో వచ్చే బి ఎస్ సిక్స్ టెక్నాలజీని ప్రతి మెకానిక్ అందిపుచ్చుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని తెలియజేశారు. టూ వీలర్స్ మెకానిక్ లను అసంఘటిత కార్మికులుగా గుర్తించి, వారికి హెల్త్ కార్డులు మరియు రాయితీపై రుణాలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ద్వారా మెకానిక్ లకు సెమినార్లు ఏర్పాటు చేయాలని మంత్రి లోకేష్ ను కోరామని తెలియజేశారు. జిల్లా ప్రచార కార్యదర్శి పిఎన్ ఖాన్ మాట్లాడుతూ వాహనాల్లో ఎన్నో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. వీటిపై స్థానికంగా ఉండే మోటార్ సైకిల్ మెకానిక్ లకు సరైన అవగాహన లేకపోవడం వలన ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ సమస్యను నివారించేందుకు రాష్ట్ర టూ వీలర్ అండ్ మెకానికల్ మరియు వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ ఇంజనీర్ల ద్వారా శిక్షణా తరగతులను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టూ వీలర్ మెకానికల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డి. ధర్మ, వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.కె ఆసిఫ్ అలీ, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ నబి గోరి, స్టేట్ ట్రెజరర్ జుబేర్, కృష్ణాజిల్లా ప్రెసిడెంట్ అక్బర్ భాష కృష్ణాజిల్లా గౌరవ అధ్యక్షుడు అంకాల సుబ్బారావు, బంటుమిల్లి మెకానికల్ ప్రెసిడెంట్ షేక్ అహ్మద్ బాజీ,కృష్ణాజిల్లా సెక్రటరీ ఎం వెంకటేశ్వరరావు, కృష్ణాజిల్లా కోఆర్డినేటర్ గోరే బాయ్, బంటుమిల్లి మోటార్ సైకిల్ వర్కర్స్ అసోసియేషన్ గౌరవ సలహాదారు రాజేష్ మరియు మెకానిక్ నాయకులు, నియోజకవర్గానికి సంబంధించిన మెకానిక్ లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెకానిక్ సోదరులు బంటుమిల్లి లో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు..

## పి ఆర్ టి యు మండల ప్రధాన కార్యదర్శిగా వశిష్ట




**ఆగిరిపల్లి జూలై 11 (ఆంధ్రప్రత్రిక):** డెమొక్రటిక్ పిఆర్టియు రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఆగిరిపల్లి మండల కార్యవర్గ సమావేశంలో ఈ క్రింది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.. ఆగిరిపల్లి మండల నూతన కార్యవర్గ సభ్యులు1.గౌరవాధ్యక్షురాలు:బి.వీ.ఎస్. లక్ష్మి అధ్యక్షులు:జి నాగరాజు ప్రధాన కార్యదర్శి: కె .వంశీ వశిష్ట ఆర్థిక కార్యదర్శి: కె రవికుమార్ అసోసియేట్ అధ్యక్షులు: ఎం యాలాద్రి ఉపాధ్యక్షులు: కె .శివతేజమహిళా కార్యదర్శి: ఎం సుహాసిని జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్. డేవిడ్ రాజు, జిల్లా ఉపాధ్యక్షులు జి నాగలక్ష్మి, జిల్లా కార్యదర్శి శ్రీ ఫకీర్ అహ్మద్ .ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు డి శ్రీను మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సభ్యులు సంఘం యొక్క ఆదర్శాలకు అనుగుణంగా పనిచేస్తూ ఉపాధ్యాయులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల సాధనకు కృషి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంవీఎస్ నాగేంద్ర రావు , . జోజయ్య , మహమ్మద్ ఇర్ఫాన్ పాషా , పెద్దు .సుబ్రమణ్యం , రామ్ సింగ్ నాయక్ , గోపి , బాల శేఖర్ , ఖదీర్ , అచ్చన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న దైవ సేవకులను పరామర్శించిన లాగ్ మినిస్ట్రీ వ్యవస్థాపకులు రెవ నీల రాజ మనోహర్



**కోడూరు, జులై 11 ( ఆంధ్రప్రత్రిక):** కృష్ణాజిల్లా అవనిగడ్డ నియోజకవర్గం కోడూరు మండలం హరిపు రంలో సేవ చేస్తున్న దేవుని సేవకులు పాస్టర్ క్రీస్తు దాసు యాక్సిడెంట్ అవడం తో హాస్పిటల్లో ఉండి తిరిగి సొంత గృహానికి చేరుకున్నారని తెలుసుకొని వారి దగ్గరకు లాగ్ మినిస్ట్రీ వ్యవస్థాపకులు రెవ నీలరాజ మనోహర్ వారితో కోడూరు మండల కమిటీ తరఫున వైస్ ప్రెసిడెంట్ పాస్టర్ టీ స్టీవెన్ బాబు , పాస్టర్ ఆర్ లాభాను పాస్టర్ అద్దంకి సుదర్శన్ రావు పాస్టర్ ఎం జాన్ పాల్ పాస్టర్ జోసెఫ్ పాల్ వారితో వెళ్లివెళ్లి పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి వారు కూడా త్వరగా కోలుకోవాలని వారి కొరకు ప్రార్థన చేసి(10,000) పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందించి ఉన్నారు

## నెక్కలం గొల్లగూడెంలో నేను బడికి పోతా



**ఆగిరిపల్లి, జులై 11 ( ఆంధ్రప్రత్రిక):** ఆగిరిపల్లి మండలం నెక్కలం గొల్లగూడెం గ్రామం లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మండలం విద్యాశాఖ అధికారులు విజిట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, న్యూ అడ్మిషన్స్, పాఠశాల భోజనం, వర్క్ బుక్ కర్షన్స్, మొదలగు వాటిపై పరిశీలించడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గండికోట చూడామణి, ఉపాధ్యాయులు కృషి ఫలితంగా పాఠశాల అభివృద్ధి చెందుతుందని, నాణ్యమైన విద్యను అందిస్తున్నారని, వీరు గ్రామంలోని ప్రతి ఇంటింటికి వెళ్లి గవర్నమెంట్ వారు విద్యార్థులకు ఇచ్చే రాయితీల గురించి చెప్పి , ప్రైవేటు పాఠశాలలు వద్దు- ప్రభుత్వ పాఠశాలలు ముద్దు అనే నినాదంతో ప్రజలను చైతన్యపరిచి 2024-25 సంవత్సరానికి సంబంధించి 22 మంది విద్యార్థులను కొత్తగా పాఠశాలలో చేర్పించారని విద్యాశాఖ అధికారి ఆనంద్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు జరిగిన సన్మాన కార్యక్రమంలో మండల విద్యాధికారులు సర్వేశ్వర రావు, ఆనంద్ కుమార్, ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎం.పి.ఎ.పి.స్కూల్ ను ఆకస్మిక తనకి చేసిన పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు



**నాదెండ్ల,జులై 11(ఆంధ్రప్రత్రిక):** కేసనపల్లి గ్రామంలో ఉన్న మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్ ను ఆకస్మిక తనిఖీ చేసిన పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు. ఈ సందర్భంగా పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి భోజనం రుచి చూసి తగు సూచనలు సలహాలు అందజేశారు. పాఠశాల ప్రాంగణంలో ఆర్వో ప్లాంట్ మరమ్మతుల గురైనందున బోరు వాటర్ తాగడానికి అందజేస్తున్న సందర్భంగా తక్షణమే ఆరో ప్లాంట్ మరమ్మతు చేయించాలని అదేవిధంగా మరమ్మతులు జరిగే లోపల మినరల్ వాటర్ పిల్లలకు అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు.

## నేడే కొండలమ్మ దేవస్థానంలో శానిటేషన్ సామాగ్రి సప్లైకి టెండర్ల ఆహ్వానం.

### ఆలయ ఈవో కానూరి సురేష్ బాబు.

**వేమవరం (గుడ్లవల్లేరు మండలం) జులై 11 (ఆంధ్రప్రత్రిక):** కృష్ణాజిల్లా, గుడ్లవల్లేరు మండలం, వేమవరం గ్రామములో వేంచేసి యున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో రేపు అనగా 12.07.2024 శుక్ర వారం ఉదయం 9.00 గం . లకు శానిటేషన్ సామాగ్రి సప్లయికి టెండర్లు మరియు అమ్మవారి దేవస్థానము నందు సొంత కెమేరాతో ఫోటోలు తీసుకొను లైసెన్సు నకు వేలం పాటలు ఉదయం 11.00 గం. లకు నిర్వహించ బడునని ఆలయ ఈవో కానూరు సురేష్ బాబు ఒక ప్రకటనలో తెలియజేశారు.

## కొత్తపాలెంలో మండలి వెంకట్రామ్ పరామర్శలు



**కోడూరు, జులై 11 (ఆంధ్రప్రత్రిక):** నాగాయలంక మండలంలోని టి.కొత్తపాలెం గ్రామ వాస్తవ్యులు బండ్రెడ్డి బస్వారావు (తాత) ఇటీవల జరిగిన ద్విచక్ర వాహన ప్రమాదంలో తన కాలుని పోగొట్టుకోవడం జరిగింది.వారి కుటుంబానికి శ్రీకృష్ణదేవరాయ కాపు సంక్షేమ సంఘం ద్వారా 10,000 రూపాయలు మండలి రాజా చేతులు మీదుగా వారి కుటుంబానికి అందించడం జరిగింది. అలాగే వారికీ ప్రభుత్వం తరుపున అండగా ఉంటాము అని భరోసా ఇవ్వడం జరిగింది.ఇటీవల కంటికి ఆపరేషన్ చేయించుకున్న లేబాక వెంకటేశ్వరావు (కొండలు) ని, గత కొద్ది రోజుల క్రితం జరిగిన ద్విచక్రవాహన ప్రమాదంలో గాయాలు అయిన మున్మారెడ్డి శేషగిరి ని కూడా మండలి వెంకట్రామ్ పరామర్శించి బాగోగులు అడిగి తెల్సుకున్నారు..

## చేతిరాత బాగుంటే తలరాత బాగుంటుంది



**మైలవరం, జూలై 11: (ఆంధ్రప్రత్రిక):** విద్యాభ్యాసకుల చేతిరాత బాగుంటేనే తలరాత బాగుంటుందని మైలవరంలోని శ్రీ లీలావతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉడతా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. పాఠశాలలో ఈ నెల నాలుగు నుండి ప్రారంభమైన చేతి వ్రాత వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు వారం రోజులపాటు మంచి చేతిరాతపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

శిక్షణ అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు మంచి చేతి వ్రాత పై పోటీలు నిర్వహి ంచారు. ముగ్గురు విజేతలకు ప్రశంసా పత్రాలతో పాటు బహుమ తులను అందించారు. మిగిలిన వారికి ప్రశంసా పత్రాలను అందిం చారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఉడత లక్ష్మీనారా యణ మాట్లాడుతూ మంచి చేతిరాత వ్యక్తిత్వ వికాసానికి, విద్యాభివృద్ధిలో మంచి మార్కులు సాధించటానికి ఉపయోగపడు తుంద న్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి జె రాధాకుమారి, పాఠ శాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# జ్వరంతో మృతిచెందిన ఆశా వర్కర్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ధర్నా





**ఎ.కొండూరు జూలై 11 (ఆంధ్రప్రత్రిక):** జ్వరంతో మృతి చెందిన ఆశా వర్కర్ తోట రాధా కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ మండల ఆశా వర్కర్ల సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రమైన ఎ.కొండూరు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆశా వర్కర్ల సంఘం జిల్లా కార్యదర్శి ఎ.కమల మాట్లాడుతూ ఆశా వర్కర్ రాధా మృతికి వైద్యాధికారుల నిర్లక్ష్యమే కారణమని, ఆమె మృతి పట్ల వైద్యాధికారులే పూర్తి బాధ్యత వహించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ రాధ ఈనెల 6న శనివారం జ్వరంతో బాధపడుతూనే సర్వేలో పాల్గొని, అదేరోజు మధ్యాహ్నం జ్వరానికి టాబ్లెట్లు కూడా వేసుకుందని, అంత జ్వరంతో బాధపడుతున్న ఆశా వర్కర్ రాధాకు ఏఎన్ఎం, నోడల్ ఆఫీసర్ లు సెలవు మంజూరు చేయకపోవడంతో రాధా విధి నిర్వహణలో మృత్యువాత పడిందన్నారు. సోమవారం జ్వర తీవ్రత ఎక్కువ అవ్వటం వలన ఎ.కొండూరు పీహెచ్ నుండి తిరువూరు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారని, అక్కడ ఆమె పరిస్థితి విషమించటంతో విజయవాడ వెళ్ళమని సలహా చెప్పటంతో ఆమె చిన అవుట్ పల్లి పిన్నమనేని ఆస్పత్రికి వెళుతుండగా మార్గ మధ్యలోనే చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారని తెలిపారు. ఆశా వర్కర్ల ప్రాణాలు అంటే వైద్యాధికారులకు లెక్కలేకుండా పోయిందని, జ్వరాలతో బాధపడుతున్న ఆశా వర్కర్లతో సైతం విధులు నిర్వహించేలా ఒత్తిడి చేస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వైద్యాధికారుల నిర్లక్ష్యంతో మృతి చెందిన రాధా కుటుంబం ఆమెకు వచ్చే జీతంతోనే ఆ కుటుంబం ఆధారపడి ఉందని, ఆమెకు ఇరువురు సంతానం, భర్త ఉన్నారని, వారికి ఎలాంటి ఆస్తి పాస్తులు లేవని, నిరుపేద కుటుం బమని, అందువల్ల ప్రభుత్వం రాధా కుటుంబానికి పది లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.ఆశా కార్యకర్త తోట రాధా చనిపోవటానికి కారణమైన వైద్యాధికారులపై చర్యలు తీసుకోవా లని, ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, అలానే మెడికల్ డిపార్ట్మెంట్ నుండి ఆర్థిక సహాయం చేయాలని, భవిష్యత్తులో అనారోగ్యానికి గురైన ఆశ వర్కర్లకు సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.



సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ రియాజ్ హుస్సేన్ ధర్నా జరుగుతున్న ప్రదేశానికి వచ్చి మీ డిమాండ్లను తిరువూరు ఆర్డీవో ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని నాయకులు, బాధిత కుటుంబ సభ్యులతో సంప్రదింపులు జరపటంతో, అందుకు వారు డి ఎం అండ్ హెచ్ ఓ, లేదా డిప్యూటీ డిఎంహెచ్ ఓ సంఘటన స్థలానికి రావాలని పట్టు పట్టడంతో తహసీల్దార్ డి ఎం అండ్ హెచ్ ఓ తో జిల్లా ఆశా వర్కర్ల సంఘం కార్యదర్శి కమలతో, సిఐటియు మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరావుతో ఫోన్ లోమాట్లాడించారు. దీంతో ఆందోళన కారులు శాంతించి ధర్నాను విరమించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ రియాజ్ హుస్సేన్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పానెం ఆనందరావు, ఆశా వర్కర్ల సంఘం నాయకులు భీమాల లక్ష్మి, పి. శ్రావణి, పి.చిలకమ్మ, డి.నాగమణి, డి.జయమ్మ, ఎం.భారతి, పద్మ, శారద, లక్ష్మీ నరసమ్మ, సులోచన తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

### ప్రజాదర్బార్‌కు అనూహ్య స్పందన భారీగా తరలివచ్చిన ప్రజలు :ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు



**తిరువూరు (విస్సన్నపేట) జూలై11(ఆంధ్రప్రత్రిక):** విస్సన్నపేట ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో గురువారం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ప్రజా సమస్యలను ఓపికగా వింటూ వారి సమస్యలను వినతి పత్రాల ద్వారా అర్జీలను స్వయంగా సేకరిస్తూ ప్రతి ఒక్కరి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.మరి కొన్ని సమస్యలకు సత్వర పరిష్కారం చేస్తూ మరి కొన్ని సంబంధితశాఖా ధికారులతో చర్చించి సమస్య పరిష్కార మార్గానికి చొరవ తీసుకున్నారు. తిరువూరు నియోజకవర్గంలో ఎంతోమంది ఎమ్మెల్యేలు గెలిచినప్పటికీ స్వయంగా ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్న దాఖలాలు లేవు. చరిత్రను తిరగరాసి 20 సంవత్సరాల తర్వాత తిరువూరులో తెలుగుదేశం పార్టీ జెండాను రెపరెపలాడించిన ఘనత కొలికపూడి శ్రీనివాసరావుకి తగ్గిందని పలువురు హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను తన సొంత సమస్యలుగా భావించి పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలసమస్యలు ఉంటే ఎమ్మెల్యే చుట్టూ ఆఫీసుల చుట్టూ తిరగకూడదని దృఢ సంకల్పంతో నియోజకవర్గ అభివృద్ధి కోసం సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం పోరాటం చేస్తానని ఆయన పేర్కొన్నారు. అధికారులు కూడా ప్రజా సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించడంతో ప్రజా దర్బార్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు, అభిమానులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పంపింగ్ నేచురల్ గ్యాస్ మరియు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం



**ఆగిరిపల్లి జూలై 11 (ఆంధ్రప్రత్రిక):** ఆగిరిపల్లి స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో మేఘా గ్యాస్ వారి ఆధ్వర్యంలో సహజ వాయువు(పి ఎన్ జి) మరియు రహదారి భద్రత తీసుకోవలసిన జాగ్రత్తల గురించి మరియు ప్రమాదాలు జరిగితే తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు సమాచారం తెలియజేయ వలసిన నెంబర్ ల గురించి అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత మాట్లాడుతూ రోజు ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి, వాటిమీద విద్యార్థులకు వారిద్వారా వారి కుటుంబ సబ్యులకు అవగాహన కార్యక్రమాలు మా పాఠశాల లో నిర్వహించడం వలన విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని మేఘా గ్యాస్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేస్తూ అత్యవసర పరిస్థితుల్లో అనగా గ్యాస్ లీక్ సమయంలో అత్యవసర నెంబర్ - 18001231803, 7093082044 కు తెలియపరచవలసిందిగా మేఘా గ్యాస్ యాజమాన్యం విద్యార్థులకు తెలియజేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో మేఘా గ్యాస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణ దూషణపై చర్యలు చేపట్టాలి



**కొయ్యలగూడెం,జూలై 11 (ఆంధ్రపత్రిక):** కొయ్యలగూడెం మండల బ్రాహ్మణులు సంఘాలు బ్రాహ్మణులను దూషించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలంటూ బ్రాహ్మణ సంఘాలు కోరాయి బ్రాహ్మణులను అసభ్యకర పదజాలాలతో, అమానవీయ రీతిలో సోషల్ మీడియా ద్వారా పోస్టులు పెట్టి, స్పీచ్ లు ఇచ్చిన విజయనగరం జిల్లా పార్వతీపురం కి చెందిన పైలా దాస్ పై ప్రభుత్వం చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని కొయ్యలగూడెం ప్రాంతీయ బ్రాహ్మణ సమాఖ్య డిమాండ్ చేసింది.గురువారం సమైక్య అధ్యక్షులు ఏ వి ఆర్జి మృత్యుంజయ శర్మ(రామం) అధ్యక్షతన ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో బ్రాహ్మణ సమైక్య పెద్దలు పాల్గొన్నారు.సోషల్ మీడియా సామాజిక మాధ్యమాల ద్వారా పైలా దాస్ మరికొందరు కలసి బ్రాహ్మణుల గురించి అర్చకుల గురించి అదేవిధంగా బ్రాహ్మణ స్త్రీల గురించి అనుచితంగా వ్యాఖ్యలు చేయడం తమను తీవ్ర మనోవేదనకు గురి చేసింది అన్నారు.ముఖ్యంగా తమ స్త్రీలు అత్యంత అవమానంగా భావిస్తూ ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు.అంతేకాకుండా శివ కేశవుల ఆరాధకుల మధ్య స్పర్ధలు పెట్టే విధంగా వ్యాఖ్యలు చేశారన్నారు.వైష్ణవులు,శైవులు గురించి అనుచిత వ్యాఖ్యలు చేయడం మనక్షోభకు గురి చేసింది అన్నారు.ఇటువంటి దుశ్చర్యలను ప్రభుత్వ పరంగా ఖండించడంతో పాటు ఇందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని,వారి చేత బ్రాహ్మణ సమైక్యకు బేజారుతుగా క్షమాపణ మీడియా పరంగా చేయించాలని కోరారు.ఈ దుశ్చర్య ను తాము ఖండిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖను పంపుతున్నట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో మామిళ్ళపల్లి బద్రీనాథ్, అని పెద్ది రాధాకృష్ణమూర్తి,మామిళ్ళపల్లి చింతామణి, పొన్న శివ రామకృష్ణ రమేష్,కోదాటి నాగమణి,వజుల సీతారాం బాబు,బొల్లాప్రగడ ప్రసాద్, పెద సనగంటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ జనాభా దినోత్సవంపై అవగాహన సదస్సు




**కొయ్యలగూడెం.జూలై 11(ఆంధ్రపత్రిక):**కొయ్యలగూడెం మండలం బయ్యన్న గూడెంలో ప్రపంచ జనాభా దినోత్సవం అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది. ప్రపంచ జనాభా దినోత్సవ అవగాహన కార్యక్రమం బయ్యన్నగూడెం గ్రామంలో గురువారం నిర్వహించారు. పీహెచ్సీ వైద్యాధికారి వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సిబ్బంది ప్రజలకు జనాభా నియంత్రణపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా పద్దెనిమిది సంవత్సరాల నిండిన బాలలకు ఇరవై ఒక్క సంవత్సరాలు నిండిన యువకులకు వివాహం చేయాలని,బిడ్డకు బిడ్డకు మధ్య ప్రసవ సమయం మూడు నుండి నాలుగు సంవత్సరాలు ఉండడం తల్లిదండ్రులకు మంచిదని సూచించారు. ఆరోగ్యానికి సంబంధించిన సూచనలు అనారోగ్యం పై తీసుకోవలసిన జాగ్రత్త చర్యల గురించి, రైన్ సీజన్లో సంక్రమించే సీజన్లో వ్యాధుల గురించి ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణా అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం, సూపర్వైజర్ చాన్భాష, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**కోరుకొండ, జూలై 11 (ఆంధ్రపత్రిక):**కోరుకొండ మండలం గాడాల విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏపీ ఈపీడీసీఎల్ రాజమ హేంద్రవరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆపరేషన్) దాట్ల శ్రీధర్ వర్మ తెలియజేశారు. గాడాల సబ్ స్టేషన్ పరిధిలో వార్షిక మరమతుల నిమిత్తం గాడాల, నిడిగట్ల, మధురపూడి, పాలచర్ల, గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు అందరూ ఈ అసౌకర్యమును గమనించి డిపార్ట్ మెంట్ వారికి సహకరించవలసినదిగా కోరారు.

# స్కంధునికి క్షీరాభి, అన్నాభిషేకాలు



**కొయ్యలగూడెం,జులై 11 (ఆంధ్రపత్రిక):**కొయ్యలగూడెం టెంపుల్స్ సెంటర్లోని సుబ్రమణ్యేశ్వర స్వామి వారికి అన్నాభిషేకం కార్యక్రమం నిర్వహించరు స్కంద పంచమి సందర్భంగా గురువారం టెంపుల్స్ సెంటర్లోని శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. శ్రీ రుక్మిణి సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయంలో ఉపాలయ మైన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి పంచామృతాభిషేకాలు యాభై నాలుగు లీటర్ల ఆవుపాలతో క్షీరాభిషేకం అనంతరం అన్నాభిషేక కార్యక్రమాలు నిర్వహించారు.ఆలయ నిర్మాణదాత కొల్లూరు సుబ్బారావు దంపతుల చేత ప్రధాన అర్చకులు గుడిపూడి శేషాచార్యులు విశేష పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

## వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంఖుస్థానిక

**శంకుస్థాపన చేసిన స్థానిక శాసన సభ్యురాలు వరుపుల సత్య ప్రభ రాజా**



**ప్రత్తిపాడు, జూలై 11 (ఆంధ్రపత్రిక):**కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం టీ రాయవరం గ్రామంలో 49.60 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ నిర్మాణపు పనులకు స్థానిక శాసన సభ్యురాలు వరుపుల సత్య ప్రభ రాజా గురువారం కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ టి రాయవరం గ్రామంలో 40 లీటర్ల నిల్వ సామర్థ్యం కలిగిన ఈ ట్యాంకు నిర్మాణం పూర్తయితే గ్రామస్తులకు సురక్షిత త్రాగునీరు అందుబాటులో వస్తుందన్నారు అధికారుల పర్యవేక్షణలో వేగవంతంగా ట్యాంక్ నిర్మాణం పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు ఈ కార్యక్రమంలో జనసేన ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జి ఉరుపుల తమ్మయ్య బాబు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఎన్డీఏ శ్రేణులు పాల్గొన్నారు అనంతరం మండలంలోని పి.జగన్నాధపురం గ్రామంలో 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మరో వాటర్ ట్యాంక్ నిర్మాణపు పనులను ఎమ్మెల్యే సత్య ప్రభ శంకుస్థాపన చేశారు ఈ ట్యాంకు నిర్మాణానికి 16.60 లక్షల రూపాయలు అంచనావ్యంగా నిర్ణయించారు అన్నారు. జల జీవన మిషన్ ఇంటింటికి కొళాయికర్షణ ఇచ్చే విధంగా ఈ పథకం మంజూర అయింది అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జనసేన నాయకులు సింగిల్ దేవి సత్తిరాజు ఉరుపుల తమ్మయ్య బాబు తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు కింతాడ ఫీడర్ పరిధిలో కరెంట్ సరఫరాకు అంతరాయం



**కె.కోటపాడు, జులై 11 (ఆంధ్రపత్రిక):**మండలంలోని కింతాడ ఫీడర్ పరిధిలో విద్యుత్ సౌకర్యానికి ఈ నెల12వ తేదీన అంతరాయం కలుగుతుందని, వినియోగ దారులు సహకరించాలని ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ అసిస్టెంట్ ఇంజనీర్ ఎం.చంద్రశేఖర్ గురువారం విలేఖరులకు తెలిపారు. శుక్రవారం ఉదయం 9:00గంటల నుండి సాయంకాలం 5:00గంటల వరకు విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ వంటి పనుల నిమిత్తం కింతాడ ఫీడర్ పరిధిలోని కింతాడ, చంద్రయ్యపేట, కె.సంతపాలెం, ఆర్లి, ఎర్రకన్నపాలెం తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఈ అంతరాయాన్ని వినియోగదారులు గమనించాలని ఏఈ చంద్రశేఖర్ కోరారు.

## సబ్ రిజిస్టర్, రెవిన్యూ కార్యాలయాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే నాయకర్



**నరసాపురం/మొగల్తూరు.జూలై 11 (ఆంధ్రపత్రిక):** ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ సబ్ రిజిస్టర్ మరియు రెవెన్యూ కార్యాలయాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా గురువారం స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ప్రజలకు ప్రభుత్వం కార్యాలయాల ద్వారా మంచి విశిష్టమైన సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే నాయకర్ కోరారు.

## పి.వి.కె.ప్రసాదరావు సేవలు మరువలేనివి



గాజువాక,జులై 11(ఆంధ్రపత్రిక):విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఎల్.ఎం.ఎం.ఎం.డిపార్ట్మెంట్లో మూడు దశాబ్దాలకు పైగా విధులను నిర్వర్తించిన పి.వి.కె.ప్రసాదరావు సేవలు మరువలేనివని సామాజికవేత్త, యు.హెచ్.ఆర్ పి.సి. నేషనల్ వైస్-చైర్మన్ డాక్టర్ జొన్న కూటి విజయ్ కుమార్ అన్నారు. ప్రసాదరావు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనను డా.విజయ్ కుమార్, సహచర ఉద్యోగులు తోట గోవిందరావు, ఈతలపాక నరసింగరావు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డా.విజయ్ కుమార్, గోవిందరావు, నరసింగరావు మాట్లాడుతూ 32ఏళ్ళు పలు సెక్షన్స్ లో విధుల నిర్వహణలో ప్రసాదరావు స్నేహ పూర్వక వాతావరణంలో మెలిగారన్నారు.అటు అధికార్ల మన్ననలు,ఇటు తోటి కార్మికుల అభిమానాన్ని ఆయన పొందారన్నారు. ప్రసాదరావు నిబద్ధత కలిగిన శ్రామికుడు అని డా.విజయ్ కుమార్, గోవిందరావు, నరసింగరావు కొనియాడారు.

# శ్రీ సిద్ధి విఘ్నేశ్వర స్వామి అన్నప్రసాదంకు విరాళం



**అయినవిల్లి, జూలై 11 (ఆంధ్రపత్రిక):** ముమ్మిడివరం మండలం, లంక ఆఫ్ ఠాణేలంక వాస్తవ్యులు గోదాసి నాగేశ్వర రావు కుటుంబ సమేతముగా శ్రీ విఘ్నేశ్వర స్వామి వారిని దర్శించి, శ్రీ విఘ్నేశ్వర అన్న ప్రసాద ట్రస్ట్ నకు విరాళంగా రూ.25,000/-లు ఇచ్చినారు. వీరికి అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి శ్రీ స్వామివారి చిత్రపఠమును అందజేసినారు.

# వీరవల్లి పాలెం ప్రభుత్వం ఆస్పత్రిలో ప్రపంచం జనాభా దినోత్సవం కార్యక్రమం



**అయినవిల్లి, జూలై 11 (ఆంధ్రపత్రిక):**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం వీరవల్లి పాలెం ప్రభుత్వాసుపత్రిలో ప్రభుత్వ డాక్టర్లు ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం ర్యాలీ కార్యక్రమం నిర్వహించి నారు. జనాభా పెరుగుదల వలన కలిగే నష్టముల గురించి డాక్టర్లు వివరించి చెప్పినారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఈ సూపర్వైజర్లు, ఫిమేల్ హెల్త్ వర్కర్స్ ,ఏఎన్ఎంలు, మెల్ హెల్త్ వర్కర్స్ ,ఆశాలు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన కేపీ పాలెం ప్రభుత్వ బాలికల కళాశాల



**మొగల్తూరు, జూలై 11 (ఆంధ్రపత్రిక):** మొగల్తూరు మండలం కేపీ పాలెం జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ నందు ప్రభుత్వము ఏర్పాటు చేసిన బాలికల జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం ఫలితాలలో సీఈసీ గ్రూపు నందు రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు గట్టం సుమిత్ర లభించిందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ జంగం వెంకట నరసింహమూర్తి తెలిపారు. గురువారం ఆయన తమ కళాశాల యందు మా "ఆంధ్ర పత్రిక ప్రతినిధి"తో మాట్లాడారు. ప్రస్తుతం కళాశాలలో 51మంది బాలికలు విద్యను అభ్యసించుచున్నారని, ఆగస్టు 15వ తేదీన రాష్ట్ర ర్యాంకు సాధించిన సుమిత్రాను ఘనంగా సత్కరించి పాఠశాల తరఫున అభినందనలు తెలపనున్నట్లు తెలిపారు. అలాగే పాఠశాల పరిధిలో పేరుపాలెం సౌత్ గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ. పూర్వపు విద్యార్థి మేళం రవికుమార్ ప్రోత్సాహంతో ఫోర్ కెవి సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేశారని తెలిపారు. తమ కళాశాల ప్రోత్సాహానికి తల్లిదండ్రులు గ్రామస్తులు అందిస్తున్న సహకారం వల్లనే మంచి విద్యా ఫలితాలు సాధిస్తున్నామని ఆయన అభిప్రాయం చేశారు. ప్రస్తుతం కేపీ పాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ నందు 363 మంది విద్యార్థిని విద్యార్థులు సంఖ్య గలదనీ ఆగస్టు 31వ తేదీ నాటికి మరి కొంతమంది నూతనంగా పాఠశాలలో చేరేందుకు అవకాశం గలదని తెలిపారు. పాఠశాలలో గులాబీ గార్డెన్ పెంచుతున్నామని పాఠశాల విచ్చేసిన పలువురికి ఒక ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తుందని ఆయన తెలిపారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి వాటిని పెంచేందుకు పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# మొగల్తూరు ఐసిడిఎస్ కార్యాలయం నందు ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ




**మొగల్తూరు,జూలై 11 (ఆంధ్రపత్రిక):** ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మొగల్తూరు ఐసిడిఎస్ కార్యాలయం నందు మొగల్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ కందుల పార్టీ లక్ష్మి పార్వతి మరియు మొగల్తూరు ఐసిడిఎస్ సిడిపిఓ బి.ఊర్మిళ ఆధ్వర్యంలో ఐసిడిఎస్ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది మరియు పిల్లలు తల్లులుకి అవగాహన కార్యక్రమం గురువారం ఉదయం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంని ఉద్దేశించి డాక్టర్ కందుల పార్టీ లక్ష్మి పార్వతి మాట్లాడుతూ ప్రపంచ జనాభా ఇప్పుడు 8 బిలియన్స్ దాటింది అని 1987 జులై 11న ప్రపంచ జనాభా 5 బిలియన్స్ అందు వలన జులై 11న ప్రపంచ జనాభా దినోత్సవం ఐక్య రాజ్య సమితి నిర్వహించడం జరిగిందని కాని అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రతి రోజు 20 వేల మంది బాలికలు 18 సంవత్సరం లోపు వారు చిన్నారులకు జన్మనిస్తున్నారు ఇది చాలా బాధాకరంని తెలిపారు. మాతృ మరియు శిశు మరణాలుకి ఇది ముఖ్య కారణం అని తెలిపారు.ముఖ్యంగా ఆరోగ్య మరియు అంగన్వాడీ సిబ్బంది తల్లి బిడ్డలు ఆరోగ్యం మీద శ్రద్ధ తీసుకుని ఆరోగ్య సమాజం నిర్మించాలిని చెప్పు. ఈ సంవత్సరం నినాదం ఎవరినీ విడిచిపెట్టవద్దు, ప్రతి ఒక్కరినీ లెక్కించండి "అని సాంకేతిక యుగంలో ప్రతి ఒక్కరిని లెక్కించటం ఎవరిని లెక్కించకుండ విడిచి పెట్టరాదుని థీమ్ అని పేర్కొన్నారు సిడిపిఓ బి.ఊర్మిళ మా ట్లాడుతూ ప్రతి గృహ నికి మహిళ వెలుగు అని మారుతున్నా సమాజంలో ఆమె ఆరోగ్య మీద ప్రభుత్వాలు చాలా వెచ్చిస్తు న్నాయి అని దీనిలో భాగంగా పిఎంఎంవైవి క్రింద ప్రతి గర్భిణీకి రూ.5000 రెండో బిడ్డ ఆడ బిడ్డ అయితే రూ.6000 అందిస్తున్నారుని తెలిపారు. తర్వాత ఆరోగ్య మరియు అంగన్వాడీ సిబ్బంది మొగల్తూరు గొల్లగూడెం నందు ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మొగల్తూరు పిహెచ్సి సిబ్బంది ఏఎస్ఎస్ఎన్ మూర్తి, ఎస్జె.సత్యవతి, బి.శ్రీనివాస్, ఐసిడిఎస్ సిబ్బంది పి.విజయ్ కుమారి, కే.శ్రీదేవి, బి.విజయ కుమారి, ఎన్ పద్మావతి, మరియు అంగన్వాడీ టీచర్స్ ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్వర్లు పనిచేయక అర్ధాంతంగా నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు




**మొగల్తూరు,జూలై 11 (ఆంధ్రపత్రిక):** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో గురువారం సర్వర్లు పనిచేయక రిజిస్ట్రేషన్లు అర్ధాంతంగా నిలిచిపోయాయి. రిజిస్ట్రేషన్ చేయించుకునే కక్ష దారులు అనేకమంది కక్షదారులు కార్యాలయం వచ్చి అనేక ఎదుర్కొన్నారు. గురువారం ఉదయం నుండి సాయంత్రం వరకు సర్వర్లు పనిచేయకపోవడంతో కక్ష దారులు అసౌకర్యానికి గురయ్యారు.

# పేదలకు కళ్ళజోళ్ళు, దుస్తులు పంపిణీ




**కాకినాడ, జూలై 11 (ఆంధ్రపత్రిక):** రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంపిక చేసిన 68 మంది పేదలకు కళ్ళజోళ్ళు, దుస్తులను పూర్వ విద్యార్థి వివి రామ్ చరణ్ అందించారు. గురువారం కాకినాడ రామారావుపేట లోని లయన్స్ క్లబ్ హాలులో ట్రస్ట్ ఎంపిక చేసిన వారికి వీటిని అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బాదం బాలకృష్ణ మాట్లాడుతూ సమాజంలో పేదవారికి అందరూ చేయూతనివ్వాలి దానికి అనుగుణంగా రెడ్ కాన్వెంట్ ట్రస్ట్ నుండి కళ్ళజోళ్ళు ప్రాజెక్టుకు ఈ ఐదేళ్లలో సుమారు 3000 మందికి మూడువేల కళ్ళజోళ్ళని అందించామన్నారు. అలాగే ఈ ట్రస్టు ద్వారా విద్య, వైద్యములకు సంబంధించి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు బాదం తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు శీమకుర్తి పాపారావు, కార్యదర్శి డి.జగన్నాధరావు, రెడ్నం రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# చిన్న వెంకన్న నివాసానికి అలంకరణ



**ద్వారకాతిరుమల, జూలై 11 (ఆంధ్రపత్రిక):**ద్వారకాతిరుమలలో గోపాలపురం నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ మద్దిపాటి వెంకట రాజు ద్వారక తిరుమల గ్రామంలో పర్యటన లో భాగంగా పారిశుధ్య మరియు ప్రభుత్వ ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ ఖాళీ ప్రదేశాలు, పరిశీలన చేసి, అధికారులకు గ్రామం యొక్క పూర్తిస్థాయి నివేదిక తయారుచేసి, రెండు వారాల్లో, సమర్పించాలని ఆదేశించారు. ద్వారకా తిరుమల విచ్చేస్తున్న భక్తులకు ఆధ్యాత్మికత, ఉట్టిపడేలా, గ్రామాన్ని తీర్చిదిద్దడానికి అధికారులు నివేదిక సమర్పించాలని ఆదేశించడం జరిగింది.గ్రామంలో నాయి బ్రాహ్మణుల సంక్షేమ సంఘం వారికి ఇచ్చిన హామీ మేరకు కళ్యాణ మండపం నిర్మాణం నిమిత్తం, స్థల పరిశీలన చేస్తున్న గోపాలపురంనియోజకవర్గం శాసన సభ్యులు మద్దిపాటి వెంకట రాజు, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే నాయకర్‌ను సత్కరించిన వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు



**నరసాపురం/మొగల్తూరు, జూలై 11 (ఆంధ్రపత్రిక):** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు గ్రామములో మూడో నెంబర్ ఎంపీటీసీ పరిధిలో మంచినీటి చెరువును పరిశీలించడానికి నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీటీసీ సభ్యులు, మొగల్తూరు మండల పరిషత్ ఉపాధ్యక్షులు కైలా సుబ్బారావు ఎమ్మెల్యే నాయకరుకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ నరసాపురం నియోజకవర్గాన్ని అన్ని రంగాల యందు అభివృద్ధిపరిచి ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు.

# పేదలకు రైతుబజారుల ద్వారా నిత్యవసర సరుకులు

**కేజీ రూ.160 కే కందిపప్పు,**

**రూ.48కే సన్న బియ్యం....**

**రాష్ట్ర టూరిజం సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్.**



**రాజమహేంద్రవరం, జూలై 11(ఆంధ్రపత్రిక)**:రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని నిత్యావసర సరుకులలో ముఖ్యమైన కందిపప్పు, బియ్యాన్ని చౌకగా అందించడమే లక్ష్యమని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. సరఫరాల శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉదయం స్థానిక క్వారీ సెంటర్ రైతు బజారు నందు కందిపప్పు, బియ్యాన్ని బజార్ల ద్వారా విక్రయించే స్టాల్స్‌ను మంత్రి కందుల దుర్గేష్.. పార్ల మెంటు సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, స్థానిక శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్, ఇన్చార్జి జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు మున్సిపల్ కమిషనర్ దినేష్ కుమార్ తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమంతో పాటు వారు ఆనందంగా జీవించాలనే ఉద్దేశంతో ధరలను నియంత్రించే ందుకు గాను కందిపప్పు, బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యం లో రైతు బజార్ల ద్వారా విక్రయించాలని నిర్ణయం తీసుకుందన్నారు. పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ ఎన్.డి.ఏ కూటమి సభ్యులందరూ సమిష్టిగా కలిసి పేదలకు మంచి చేయాలని మంచి సంకల్పంతో వారి జీవన సరళి ఆనందంగా, సవ్యంగా సాగేందుకు కాను కనీస నిత్య అవసరాలు అయిన సరుకులను అందుబాటు లోనికి తీసుకువచ్చామని ఇది తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. సిటీ శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం పేద ప్రజల పక్షపాతి అని, వారి సంక్షేమమే తమ ధ్యేయమని అందుకు ఎన్డీఏ కూటమి సభ్యులందరూ ఏకతాటిపై కలిసికట్టుగా పని చేస్తామని ఆయన అన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలని ఉద్దేశంతో ఈరోజు పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతు బజార్ల ద్వారా నిత్యవసర సరుకులైన కందిపప్పు, బియ్యాన్ని విక్రయించేందుకు గాను స్టాల్ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ స్టాల్స్‌లో విక్రయాలను అధికారులతో పాటు తాము కూడా నిరంతరం పర్యవేక్షించి ఏమైనా లోటుపాట్లు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకు వస్తే సరిదిద్దుతామన్నారు. రాజమహేంద్రవరం నగరవాసులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈరోజు ఇంతటి చక్కటి కార్యక్రమాన్ని ప్రభుత్వ యంత్రాంగం, జిల్లా మంత్రి తో కలిసి నిర్వహించుకున్నందుకు తమకెంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి భాస్కర్, అర్బన్ తహసిల్దార్ ఆంజనేయులు, రైతు బజార్ ఎస్టేట్ అధికారి కే శ్రీనివాస్, ఏఎస్ఓ నాగాంజనేయులు, ఎంఎస్ఓ అర్బన్ ఎం నాగలక్ష్మి, డియం సునీల్ వినయ్, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# జిల్లా ప్రజా ప్రతినిధులతో అధికారుల పరిచయం

**రాజమహేంద్రవరం జూలై 11(ఆంధ్రపత్రిక):** తూర్పుగోదావరి జిల్లా ప్రజా ప్రతినిధులతో అధికారుల పరిచయ కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యటక శాఖ మంత్రి కందు ల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ వంక రవీంద్ర నాథ్, శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామ కృష్ణ, ఆదిరెడ్డి శ్రీనివాస్, ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారుల పరిచయ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. అధికారుల, ఉద్యోగుల సమస్యల పట్ల ఈ ప్రభుత్వం చిత్త శుద్ధితో వ్యవహరిస్తుందని మంత్రి దుర్గేష్ అన్నారు. ఇప్పటికే పెన్షన్లను పంపిణీ చేశామని మరో అడుగు ముందుకేసి నిత్యవసర సరుకులను మార్కెట్ రేటు కంటే తగ్గించి అందించే కార్యక్రమము శ్రీకారం చుట్టడం జరిగింది. రాజమహేంద్రవరం అభివృద్ధి నగర ట్రాఫిక్ సవలుస్య అధిగమించడం 2027 పుష్కరాలకు సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా తన వంతు కృషి చేస్తానని ఎంపి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు.



కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడును

# కలిసిన రమేష్

**కె.కోటపాడు, జులై 11 (ఆంధ్రపత్రిక):**మండలంలోని కె.జె.పురం గ్రామ పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి, తెలుగు యువత మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గం అధ్యక్షుడు యడ్ల రమేష్ గురువారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి, శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యుడు కింజరాపు రామ్మోహన్ నాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ విషయాన్ని రమేష్ తెలిపారు. విశాఖపట్నం అతిథి గృహంలో మంత్రి రామ్మోహన్ నాయుడు ను కలిసిన రమేష్ పుష్ప గుచ్చం అందచేశారు.ఆయనకు అభినందనలు తెలిపారు.

# ఎస్ఈబి (సెబ్)దాడుల్లో గంజాయి పట్టివేత

**లారీ సీజ్, నలుగురు వ్యక్తుల అరెస్ట్**

**353 కేజీల గంజాయి, 4 సెల్ ఫోన్లు, రూ.4వేలు నగదు స్వాధీనం..**



**రాజమహేంద్రవరం, జూలై 11(ఆంధ్రపత్రిక):**స్పెషల్ ఎన్ఫోర్స్ మెంట్ బ్యూరో కమీషనర్, విజయవాడ వారికి తెలిసిన విశ్వసనీయమైన సమాచారంతో తూర్పు గోదావరి జిల్లా డిస్ట్రిక్ట్ స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ (సెబ్) ఆఫీసర్ పిట్టా సోమశేఖర్ ఆదేశాల మేరకు బుధవారం రాజమహేంద్రవరం దక్షిణం స్టేషన్ ఎస్ఈబి సిబ్బంది రాజానగరం మండలము దీవాన్ చెరువు గ్రామపరిధిలో గల జీరో పాయింట్ వద్ద కాకినాడ నుండి రాజస్థాన్‌కు చెందిన భారత్ బెంజ్ ఆర్జె 21 జిబి 9273 లారీలో అక్రమంగా తరలిస్తున్న గంజాయి ముఠా గట్టు రట్టు చేసారు. ఈ దాడుల్లో రాజస్తాన్ నుంచి లైం పౌడర్‌ను బిక్కవోలులోని కెపిఆర్ ఫ్యాక్టరీకి తీసుకువచ్చి తిరుగు ప్రయాణంలో గంజాయి తీసుకువెళుతున్న ఒక భారత్ బెంజ్ ఆర్ జె 21 జిబి 9273 లారిని, 353.80 కేజీలు గంజాయి, 4 సెల్ ఫోన్లు, రూ.2 వేలు నగదును స్వాధీనం చేసుకుని, రాజస్థాన్ కుచెందిన సిరా రామ్ (డ్రైవర్), గోమద్ రామ్ (హెల్పర్) అదుపులోకి తీసుకున్నారు. వారికి గంజాయిని సరఫరా చేసిన కాకినాడ రూరల్ మండల సర్పవరం గ్రామం ఇండస్ట్రియల్ ఏరియాలో గల హెచ్‌పి పెట్రోల్ బంక్ వెనుక వినాయక విగ్రహాల తయారీ చేయు గౌడౌన్ వద్దకు వెళ్లి, అక్కడ 200 కేజీలు గంజాయిని స్వాధీనం చేసుకొని, కొటిబొయిన ప్రసాద్, ప్రతాప్ మండల్‌లను అదుపులోకి తీసుకుని, 2 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం నలుగురు ముద్దాయిలను, 353.80 కేజీలు గంజాయిని, ఒక భారత్ బెంజ్ ఆర్ జె 21 జిబి 9273 లారిని, 4 సెల్ ఫోన్లు, రూ. 4వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో గంజాయిని తీసుకురమ్మని పురమాయించిన రాజస్తాన్ రాష్ట్రము, నాగూర్ జిల్లా, సింగ్ దాద్ గ్రామంకు చెందిన రాం నివాస్ ఏరా భాగాడియను, ఇతని భాగస్వామి అయిన సందీప్ను అరెస్ట్ చేయవలసియున్నట్లుగా దక్షిణం స్టేషన్ ఇన్స్పెక్టర్, పి.హనుశ్రీ తెలిపారు. సదరు గంజాయి ఒడిస్సాలో కేజి 600 రూపాయలుగా, అదేవిదంగా కాకినాడకు చేర్చేసరికి దాని విలువ 3000 రూపాయలుగా, రాజస్తాన్ చేరేసరికి కేజీ 20000 రూపాయలుగా ఉంది. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ దాదాపు లక్ష ఉంటుందని అంచన. యజమాని స్వాధీన పరుచుకున్న గంజాయిని ఒడిస్సా రాష్ట్రములో గలమల్కనగిరి జిల్లా కలిమెల్ల గ్రామం నుండి తౌడు సంచులతో పాటు నింపి రవాణా చేసినట్లు పేర్కొన్నారు. ఈ విధంగా గంజాయిని అక్రమ రవాణా చేయుట, కలిగి ఉండుట, సేవించుట, నేరము అని, అటువంటి నేరముల జరిగినయడల వారికీ సమాచారం తెలియజేయాలని, అటువంటి వారిపై చట్టరీత్య కఠిన చర్యలు తీసుకుంటాం ఇన్స్పెక్టర్, పి.హనుశ్రీ తెలిపినారు. ఈ దాడులలో రాజమహేంద్రవరం సెబ్ స్టేషన్ టి.గోపాల కృష్ణ, నిడదవోలు సెబ్ సి.ఐ కె.వీరబ్రహ్మం, రాజమహేంద్రవరం సెబ్ స్టేషన్ ఎస్పైలు దుర్గ ప్రసాద్, శ్రీనివాసులు, పాల్గొన్నారు.

# ఎరువుల డీలర్లతో ఎమ్మెల్యే బత్తుల సమీక్ష



**కోరుకొండ, జూలై 11 (ఆంధ్రపత్రిక):**కోరుకొండ మండల ప్రజా పరిషత్ కార్యాలయము నందు రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ గురువారం సాయంత్రం ఎరువుల డీలర్స్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు ఆధ్వర్యంలో జరిగిన కోరుకొండ డివిజన్ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల డీలర్ల సమీక్ష సమావేశంలో రాజానగరం నియోజకవర్గం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ, దేశానికి రైతు వెన్నెముక అయితే ఆ రైతుకే వెన్నుముక విత్తనాలను, ఎరువులను, పురుగు మందులను అందించే డీలర్లు అన్నారు. రైతులకు రెండు పంటలకు అవసరమైన సాగునీరు పుష్కలంగా సకాలంలో అందిస్తానని, అలాగే వ్యవసాయ యంత్రాలు, పరికరాలు, పనిముట్లు అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, ఎన్‌డిఏ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈసందర్భంగా డీలర్లు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణను పూలమాలలతో స్వాగతం పలికి చిరు సత్కారం అందజేశారు.



# దైవనామ సంకీర్తన సర్వులకూ శ్రేయస్కరం

**కె.కోటపాడు, జులై11(ఆంధ్రపత్రిక):** వేకువ ఝామున బ్రహ్మ ముహూర్తం వేళలో దైవ నామ (నగర) సంకీర్తనలు చేయడం సర్వులకూ ఎంతో శ్రేయస్కరం అని స్థానిక శ్రీ సత్య సాయి సేవా సమితి కన్వీనరు బండారు నారాయణ పాత్రుడు అన్నారు.స్థానిక శ్రీ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ప్రతీ గురువారం ఉదయం ఐదు గంటలకు నగర సంకీర్తన కార్యక్రమం చేపట్టారు.ఈ నగర సంకీర్తనలో సుమారు 50 మంది భక్తులు పాల్గొని గ్రామవీధుల్లో దైవ నామ సంకీర్తనలు చేశారు. అనంతరం శ్రీ రామకోవెల వద్ద జరిగిన శ్రీ సత్యసాయి బాబా వారి హారతి కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఏకరూప దవళ దుస్తులను సమితి కన్వీనరు నారాయణ పాత్రుడు అందచేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో నామ సంకీర్తనలో సుమారు నూరు మంది భక్తులు పాల్గొనేలా సమితి కృషి చేస్తుందని తెలిపారు.

# కాలచర్ల గోవింద్ మృతికి జక్కంపూడి రాజా సంతాపం



**కోరుకొండ, జూలై 11 (ఆంధ్రపత్రిక):** కోరుకొండ మండలం కాపవరం గ్రామానికి చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కాలచర్ల గోవిందు ఇటీవల మృతి చెందారు. ఈసందర్భంగా గురువారం కోరుకొండ మండలం కాపవరం గ్రామం నందు నిర్వహించిన కాలచర్ల గోవింద్ పెద్ద కార్యం కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాల్గొని చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన తండ్రి మాజీ వైస్ ఎంపీపీ కాలచర్ల వెంకటేశ్వరరావును, కాలచర్ల గోవిందు కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సంతాపం సానుభూతిని తెలియజేశారు. ఈకార్యక్రమంలో కోరుకొండ జడ్పిటిసి సభ్యులు కర్రి నాగేశ్వరరావు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గణేశుల పోశయ్య, కాపవరం ఎంపిటిసి కాలచర్ల నాగు, గుగ్గిలం భాను, నీరుకొండ బాబ్జి, ఐల శ్రీను, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మసకబారుతున్న నన్నయ్య ఖ్యాతి

**ఇప్పటికైనా బి.యిడి ప్రిన్సిపాల్ సుబ్బారావుపై చర్యలు తీసుకుంటారా...**

**గతంలో జరిగిన ఈసీ సమావేశంలో తొలగించినా ఇప్పటికీ చక్రం తిప్పుతున్న వైనం...**

**ప్రిన్సిపాల్ ఉద్యోగం నుండి తొలగించి తాత్కాలిక ఉద్యోగిగానే ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో తీర్మానం....అయినా చర్యలు శూన్యం....**

**ఆదినుంచి ఆయనపై అన్నీ అరోపణలే...**




**రాజమహేంద్రవరం, జూలై 11(ఆంధ్రపత్రిక)**: ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం (అక్నూ)లో అనేక అంశాల్లో అవినీతి, ఆరోపణల ఎదుర్కొంటున్న నేపథ్యంలో రోజురోజుకూ నన్నయ్య ఖ్యాతి మసనబారుతుంది. భారత దేశంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాల జాబితాను ప్రతీ ఏడాది ప్రకటించడం పరిపాటి. అయితే 100లోపు ర్యాంకుల్లో స్థానం ఏనాడూ నన్నయ్య విశ్వవిద్యాలయానికి రాలేదంటే ఇక్కడ పనిచేసిన వీసీలు, పాలకులు పర్యవేక్షణ ఏ స్థాయిలో ఉందో స్పష్టమౌతుంది. కోట్ల రూపాయలు నిధులు సమకూరుతున్నా, ఒక్క విభాగంలో కూడా ఉత్తమ ర్యాంకు దక్కించుకోలేకపోయిందంటే స్థానిక ప్రజాప్రతినిధుల ఉదాశీనత, అక్నూ అధికారుల నిర్లక్ష్య వైఖరికి అద్దంపడుతుంది. అక్నూకు ర్యాంకు మాట దేవుడెరుగు కనీసం విద్యార్థుల్లో క్రమశిక్షణ కరువై గంజాయి వంటి మత్తు మందుతో విద్యార్థులు దొరికిపోయి సస్పెండ్ వరకూ వెళ్ళిపోయి అక్నూ పరువును గోదాట్లో కలిపేశారు. ఇప్పటికైనా నన్నయ్య వీసీ (ఉపకులపతి)గా నూతన బాధ్యతలు చేపట్టే వారిని అవినీతి మరకలేకుండా ప్రతిభ, ప్రావీణ్యత ఉన్నవారిని రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు దృష్టిసారించి నియమించాలని తల్లిదండ్రులు, గోదావరి పట్టభద్రులు కోరుతున్నారు. అలాగే పూర్తిస్థాయి విద్యార్హతలు లేకుండా నకిలీసర్టిఫికెట్స్‌తో ఉద్యోగంలో కొనసాగుతున్నవారిపై కూడా ఉన్నత విద్యామండలి దృష్టిసారించకపోతే మాత్రం నన్నయ్య పరువు మరింతగా దిగజారిపోయే ప్రమాదం ఉందని కొందరు ప్రొఫెసర్లు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. అలాగే తాత్కాలిక ఉద్యోగంలో చేరి నిబంధనలకు విరుద్ధంగా పర్మినెంట్ ఉద్యోగిగా మారిన వైనం కూడా రాష్ట్రవ్యాప్తంగా సంచలయం అయినప్పటికీ సదరు ఉద్యోగిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవంటే సదరు ఉద్యోగి ఏ స్థాయిలో చక్రం తిప్పుతున్నాడో స్పష్టమౌతుంది. ఇలాంటి సంఘటనలు నన్నయ్యలోనే సాధ్యపడుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సుబ్బారావు అనే ఉద్యోగి నన్నయ్య విశ్వవిద్యాలయంలో అడహక్ (తాత్కాలికం)గా ఉద్యోగం చేరాడు. ఇతని తోబాటు రాష్ట్రంలో వందలాది మంది అనేక విశ్వవిద్యాలయాల్లో అడ్‌హక్ అంటే పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన చేరాడు. అయితే అడహక్ ఉద్యోగి పర్మినెంట్ అవ్వాలంటే ప్రభుత్వం అంటే ఉన్నత విద్యామండలి నుండి నోటిఫికేషన్ విడుదలైన తరువాత జరిగే ఎంపిక ప్రక్రియలో అర్హత ఉంటేనే పర్మినెంట్ చేస్తారు. అయితే ఎటువంటి నోటిఫికేషన్ లేకుండా రాష్ట్రంలో ఒక్క నన్నయ్య విశ్వవిద్యాలయంలో అడహక్ పోస్టుని పర్మినెంట్ చేయించుకున్నాడంటే సదరు ఉద్యోగి మేనేజ్‌మెంట్ స్కిల్స్ ఏస్థాయిలో ఉన్నాయో తేటతెల్లమవుతుంది. వివరాల్లోకి వెళితే తాను తాత్కాలిక (అడ్‌హక్) ఉద్యోగిగా ప్రవేశించాడు. అప్పుడు జీతం 20వేల రూపాయలు లోపే తరువాత ఎటువంటి అర్హత, అనుమతులు, నోటిఫికేషన్లు లేకుండా తనకు తానే పర్మినెంట్ అయిపోయినట్లు నమ్మించాడు. ఆ మేరకు రంగం సిద్ధంచేశాడు. ఉన్నతాధికారులకు దిండి రిసార్టులో పెద్దఎత్తున పార్టీ ఇచ్చి నజరానాలు సమర్పించుకున్నాడు. దీంతో తన పోస్టును పర్మినెంట్ చేయించుకున్నాడు. లంచాలు తిన్న అధికారులు అడ్‌హక్ పోస్టును పర్మినెంట్ చేసి సదరు ఉద్యోగి రుణం తీర్చుకున్నారు. రాష్ట్రంలో సుమారు వెయ్యిమంది అడ్‌హక్ ఉద్యోగులు ఉండగా నిబంధనలకు విరుద్ధంగా కేవలం ఒక్క ఉద్యోగిని పర్మినెంట్ చేశారంటే సదరు ఉన్నతాధికారులు ఏ స్థాయిలో లంచాలు మింగారో అర్థం చేసుకోవచ్చు. కేవలం 20వేల రూపాయల నుంచి లక్షా పాతికవేల రూపాయల జీతాం పొందేదట్టు తనకు తానే పర్మినెంట్ బి.యిడి కళాశాల ప్రిన్సిపాల్ అంటూ హల్‌చల్ చేశాడు. ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం పరిధిలోని బి.యిడి కళాశాలల నుండి లక్షలాది రూపాయలు అనధికార వసూళ్లు చేస్తూ కోట్లకు పడగలెత్తాడు... అలాంటి ఉద్యోగి నిజరూపం తెలిసిన విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు సదరు ఉద్యోగి వెలగబెట్టే ప్రిన్సిపాల్ పోస్టు నుండి గతంలో జరిగిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) సమావేశంలో తొలగించడమే కాకుండా అప్పటివరకూ తాను ప్రతీనెలా ప్రభుత్వం నుండి తీసుకున్న లక్షలాది రూపాయల జీతం సొమ్మును కూడా తిరిగి చెల్లించాలంటూ సదరు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. అయితే సదరు ఉద్యోగిని ఇప్పటివరకూ ఏ వీసీ కూడా తొలగించలేకపోయారంటే సదరు అడహక్ ఉద్యోగి మేనేజ్‌మెంట్ ఏ లెవల్లో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. మరిన్ని వివరాల్లోకి వెళితే ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం (అక్నూలో) కోండ్రు సుబ్బారావు అనే లెక్చరర్ అడహక్ (తాత్కాలిక పద్ధతిలో) ఉద్యోగిగా చేరాడు. అడ్‌హక్ ఉద్యోగిగా చేరిన అతికొద్ది రోజుల్లోనే నన్నయ్య విశ్వవిద్యాలయంలో ఉన్నతోద్యోగులకు డబ్బులు ఆశచూపి కోనసీమలోగల దిండి రిసార్ట్సులో పెద్దఎత్తున పార్టీ ఇచ్చి ఎటువంటి నోటిఫికేషన్ లేకపోయినా తన పోస్టును పర్మినెంట్ చేయించుకున్నట్లు తీర్మానం చేయించాడు. అప్పటి నుండి నన్నయ్య యూనివర్శిటీలో బి.యిడి కళాశాల పర్మినెంట్ ప్రిన్సిపాల్‌గా చలామణి అవుతూ ఇష్టారాజ్యంగా, అడ్డగోలుగా కోట్లు సంపాంచా డనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అయితే రాష్ట్రంలో వెయ్యిమంది అడ్‌హక్ ప్రిన్సిపాల్స్‌ని ఎక్కడా కూడా పర్మినెంట్ చేసిన దాఖలాలు లేవు. అడహక్ ప్రిన్సిపాల్స్‌ని రెగ్యులైజ్ చేయండనే నోటిఫికేషన్ కూడా ఎక్కడా విడుదల కాలేదు. అలాంటిది కేవలం నన్నయ్య విశ్వవిద్యాయం ఒక్కచోటే అడ్‌హక్ ప్రిన్సిపాలైన సుబ్బారావును పర్మినెంట్ చేసి లక్షలాది రూపాయలు జీతాలు కట్టబెడుతుండగా ఇప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విశ్వవిదాలయాల్లో పనిచేస్తున్న అడ్‌హక్ ప్రిన్సిపాల్స్‌కి ఇంకా 25వేల రూపాయలకు తక్కువగానే జీతాలు ఇస్తున్నారు. అయితే నన్నయ్యలో పర్మినెంట్ అయినట్లు స్వయంప్రకటితం చేసుకుంటున్న ప్రిన్సిపాల్‌ని కూడా విధుల్లోనుంచి తప్పించాలని ఉన్నత న్యాయం స్థానం తీర్పు ఇచ్చినప్పటికీ గతంలో పనిచేసిన వీసీ మొక్కా జగన్నాధరావు తాత్సారం చేస్తుండటంపైనా పలు అనుమానాలు వ్యక్తంఅయ్యాయి. ఇతనిపై అనేక మంది ఉన్నతాధికారులకు ఫిర్యాదులు కూడా చేశారు. నన్నయ విశ్వవిద్యాలయంలో కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బి.ఇడి), ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న కె.సుబ్బారావు ప్రస్తుతం విచారణ ఎదుర్కొన్నారు. గతంలో జరిగిన నన్నయ్య ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో సుబ్బారావు భోగోతాన్ని ఉన్నతాధికారులు ఎండగట్టి ప్రిన్సిపాల్ ఉద్యోగం నుండి తొలగిస్తూ ఆదేశాలు జారీచేశారు. దీంతో ఇక నుండి తాత్కాలిక ఉద్యోగి అంటే అడహక్ ఉద్యోగిగానే కొనసాగే విధంగా ఈసి ఆదేశాలు జారీచేసింది. అప్పటి జరిగిన ఈసి సమావేశంలో యుజిసి మార్గదర్శకాలు, సుప్రీంకోర్టు డైరెక్షన్స్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జివో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు సుబ్బారావు ఆర్డర్‌పై విషయంపై ఇచ్చిన సంబంధిత తీర్పులను ఆధారంగా మరియు అక్రమ నియామకం పై ఏర్పాటుచేసిన సింగిల్ జడ్జి శేషసయనా రెడ్డి ఫైండింగ్స్‌ని అనుసరించి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఏకగ్రీవంగా సుబ్బారావును ప్రిన్సిపాల్‌గా తొలగిస్తూ తీర్మానం చేశారు. దీంతో నకిలీ సర్టిఫికేట్స్, ఇర్రెగ్యులర్ పోస్టింగ్‌తో ఆదినుండి అవినీతి, అక్రమాలకు పాల్పడిన బి.యిడి కళాశాల ప్రిన్సిపాల్ కోండ్రు సుబ్బారావును నన్నయ్య విశ్వవిద్యాలయం నుండి ప్రిన్సిపాల్ పోస్టు నుండి తొలగించారు. ఇప్పటివరకు సుబ్బారావు ప్రిన్సిపాల్‌గా తీసుకున్న జీతభత్యాలు తిరిగి ప్రభుత్వానికి చెల్లించేలా ఆదేశాలు జారీచేశారు. దీంతో అప్పటివరకు యూనివర్శిటీలో చక్రం తిప్పుతూ వచ్చిన సుబ్బారావు అవినీతికి ఫుల్‌స్టాప్ పెట్టినట్లు అయ్యింది. కోండ్రు సుబ్బారావును ప్రిన్సిపాల్‌గా తప్పించి కేవలం తాత్కాలిక ఉద్యోగిగా కొనసాగించేలా ఆదేశించడమే కాకుండా ఇప్పటివరకూ పర్మింట్ పిన్సిపాల్‌గా యుజిసి స్కేల్‌తో లక్షలాది రూపాయలు డ్రా చేసిన జీతం మొత్తాన్ని కూడా తిరిగి చెల్లించేలా ఈసి సమావేశంలో తీర్మానం చేశారు. ఇంత జరిగినా సుబ్బారావుపై ఏ వీసీ కూడా చర్యలు తీసుకోలేందంటే సుబ్బారావు మేనేజ్‌మెంట్‌కి ఉన్నత విద్యామండలి కూడా మోకరిల్లిందంటే అక్నూ పరువు ఏ స్థాయిలో దిగజారిపోతుందో స్పష్టమౌతుంది.

# బొద్దాం - ఓబలయ్యపాలెం రహదారిలో త్రాగునీటి పైపునకు రంధ్రం

**- వృథాగా పోతున్న త్రాగునీరు!. - పట్టించుకోని పాలకులు**



**వేపాడ, జూలై 11 (ఆంధ్రపత్రిక):** మండలంలోని బొద్దాం - ఓబలయ్య పాలెం రోడ్డులో పలు గ్రామలకు త్రాగునీటిని సరఫరా చేసే తాటిపూడి పైప్ లైన్‌కు భారీ రంధ్రం పడడంతో నెల రోజుల నుంచి త్రాగునీరు వృధాగా పోతోందని పశువుల కాపరులు తెలిపారు. భూమిలో వేసిన ఈ పైప్ నుంచి పెద్ద ఎత్తున త్రాగునీరు బయటకు పెల్లుబికి వస్తుండడంతో పరిసర ప్రాంతాల్లోని పొలాలు త్రాగునీటితో నిండిపోయి వున్నాయి.తారురోడ్డు పక్కనుంచే నీరు వృథాగా పోతున్నప్పటికి నెల రోజుల నుంచి ఎవరూ పట్టించుకోక పోవడంతో పలు గ్రామాల ప్రజలు తాగునీటి అవసరాలు తీర్చే మంచి నీరు వృథాగా విడిచిపెట్టడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని పలువురు విమర్శిస్తున్నారు.ఇప్పటికైనా పాలకులు స్పందించి యుద్ధప్రాతిపదికన మరమ్మత్తులు చేపట్టి ప్రజల దాహార్తిని తీర్చే తాగునీటిని వృధాగా పోకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కొండపి నియోజకవర్గం, జరుగుమల్లి మండలం నరశింగోలు గ్రామంలో బ్రహ్మశ్రీ డా:జంధ్యాల గురూజీ గారి పంచలోహ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మాగుంట రాఘవ రెడ్డి మరియు పలువురు నాయకులు.



కొండపి నియోజకవర్గం, జరుగుమల్లి మండలం నరశింగోలు గ్రామంలోని శ్రీ గంగా పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి మరియు లింగ రూప శనీస్వరాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మాగుంట రాఘవ రెడ్డి పలువురు నాయకులు.



## పరిశ్రమల అభివృద్ధి, విస్తరణకు

# తొలి ప్రాధాన్యత

- పారిశ్రామికాభివృద్ధి ఆకాంక్షించే ఫ్రెండ్లీ ప్రభుత్వం మాది
- రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణశాఖల మంత్రి కొలుసు పార్థసారథి
- తమ సమస్యల పరిష్కారానికి సమావేశం నిర్వహణపై హర్షం వ్యక్తం చేసిన పలువురు పారిశ్రామికవేత్తలు

**నూజివీడు, జూలై 11 (ఆంధ్రపత్రిక):** రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు తమ ప్రభుత్వం స్నేహపూరిత వాతావరణంలో చేయూత అందిస్తుందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఏలూరు కలెక్టరేట్ లోని గోదావరి సమావేశపు హాలులో గురువారం జిల్లా స్థాయి పారిశ్రామిక, పర్యావరణ, కార్మిక భద్రతలపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశం ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మంత్రి పార్థసారథి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయరంగంతో పాటు పారిశ్రామికంగా అభివృద్ధి సాధించినప్పుడే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, పరిశ్రమల అభివృద్ధి, విస్తరణకు తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న అస్తవ్యస్త నిర్ణయాల కారణంగా రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి కుంటుపడిందని, అటువంటి వాతావరణాన్ని సరిదిద్ది, పారిశ్రామికవేత్తల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా సమావేశంను నిర్వహించడం జరిగిందన్నారు. ఇందుకు కృషిచేసిన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌ను మంత్రి అభినందించారు. సమావేశంలో పారిశ్రామికవేత్తలు తెలియజేసిన సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పరిశ్రమల శాఖ మంత్రి పరిష్కరించే దిశగా కృషిచేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ప్రస్తుతం పరిశ్రమలను ఏర్పాటుచేసేందుకు అనువైన వాతావరణం ఉండడంతో దేశ, రాష్ట్రవ్యాప్తంగా పలువురు పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటుకు క్యూ కడుతున్నారని, ఇది రాష్ట్రాభివృద్ధికి శుభపరిణామన్నారు. సమావేశంలో పారిశ్రామికవేత్తలు తెలియజేసిన సమస్యలకు పరిష్కార మార్గం చూపే దిశగా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని మంత్రి సూచించారు. ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని ఎంతోమంది పారిశ్రామికవేత్తలు తమ సమస్యలు పరిష్కరించవలసిందిగా తనను కలిసి కోరారని, జిల్లాలో గత 5 సంవత్సరాల కాలంలో పారిశ్రామికవేత్తల సమస్యలను గత ప్రభుత్వం పట్టించుకోలేదని అయితేతాము కొత్త పరిశ్రమల ఏర్పాటు, విస్తరణకు అవసరమైన విషయాలు తెలుసుకునేందుకు, పారిశ్రామికవేత్తలు ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా ఏర్పాటుచేసిన తొలి సమావేశమన్నారు. జిల్లాలో పారిశ్రామికవేత్తల సమస్యలను పరిష్కరించడం ద్వారా కొత్త పరిశ్రమలు ఏర్పాటుచేసేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం పలుకుతున్నామన్నారు. పరిశ్రమలు స్థాపించే వారికి ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని, ప్రభుత్వం ప్రోత్సాహంతో జిల్లాలో మరిన్ని పరిశ్రమ ఏర్పాటుతో పాటు ప్రస్తుతం ఉన్న పరిశ్రమలు విస్తరణకు వీలు కలుగుతుందన్నారు.

## ప్రముఖ దేవాలయాలులో మంచి వారిని నియమించాలి

### దక్షిణ భారత కాపు సంఘం ప్రధాన కార్యదర్శి వేల్పూరి శ్రీనివాసరావు



**విజయవాడ,జూలై 11 (ఆంధ్రపత్రిక):** గతంలో జగన్ ప్రభుత్వం టీటీడీ ప్రముఖ దేవాలయాలు కమిటీలో సీంఎగా దొంగలు, సీబీఐ, ఈడీ కేసుల్లో ముద్దాయిలు, దళారులు, నేరస్తులను ఎక్కువ సంఖ్యలో నియమించి కలుషితం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు ఇద్దరు మంచి వారిని నియమించాలి. దేవాలయాల ప్రతిష్టను కాపాడాలని దక్షిణ భారత కాపు సంఘం ప్రధాన కార్యదర్శి వేల్పూరి శ్రీనివాసరావు రాసిన లేఖలో విజ్ఞప్తి చేశారు. హిందూ దేవాలయాల చట్టాలను కఠినంగా అమలుపరచి కోట్లాది మంది భక్తులు మనోభావాలు కాపాడాలని శ్రీనివాసరావు కోరారు.

## ఎక్కువ కాగితాలపై కాకుండా మరిన్ని ఉత్పత్తులపై

# దృష్టి పెట్టాలి

- ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి వెల్లడి
- విఐటి-ఏపి విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ సైన్సెస్ మరియు సదరన్ డెన్మార్క్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఆధ్వర్యంలో అధునాతన నానోమెటీరియల్స్ మరియు అప్లికేషన్స్‌పై రెండవ అంతర్జాతీయ సదస్సు (ఐసీఎఎన్ఎ-2024)





**అమరావతి, జూలై 11 (ఆంధ్రపత్రిక):** స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ సైన్సెస్, విఐటి-ఏపి విద్యాలయం మరియు యూనివర్శిటీ ఆఫ్ సదరన్ డెన్మార్క్ సంయుక్తంగా ఆధ్వర్యంలో ది.10-12 జూలై 2024 వరకు అధునాతన నానోమెటీరియల్స్ మరియు అప్లికేషన్స్‌పై రెండవ అంతర్జాతీయ సదస్సును (ఐసీఎఎన్ఎ-2024) వర్చువల్ విధానంలో నిర్వహిస్తున్నారు. ఈ సదస్సును స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ సైన్సెస్, విఐటి-ఏపి విశ్వవిద్యాలయం మరియు ఇండియానా యూనివర్సిటీ-పర్డ్యూ యూనివర్సిటీ ఇండియానాపోలిస్ సంయుక్తంగా 2022లో ప్రారంభించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి మాట్లాడుతూ భారతదేశం వికసిత్ భారత్‌గా మారాలంటే, మనం ఎక్కువ కాగితాలపై కాకుండా మరిన్ని ఉత్పత్తులపై దృష్టి పెట్టాలని, బలమైన సహకారం ఉన్నప్పుడే ఇది సాధ్యమవుతుందని ఆయన వివరించారు. సంస్థలు మరియు సంస్థలోని ఇతర విభాగాలమధ్య సమన్వయంతో కూడిన సహకారం ఎంతో అవసరమని తెలియచేసారు. విఐటి-ఏపి విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డా:ఎస్.వి.కోటారెడ్డి మాట్లాడుతూ అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్‌లు మరియు విద్యార్థులకు వారి పరిశోధన కార్యక్రమాలకు విశ్వవిద్యాలయం ఎంతో సహకారాన్ని అందిస్తుందని తెలియచేసారు. విశ్వవిద్యాలయం నూతన ఆవిష్కరణలు మరియు పరిశోధనలను నిర్వహించడానికి సీడ్ గ్రాంట్‌లను అందిస్తుందని తెలియచేసారు. ప్రతి సంవత్సరం అధ్యాపకులు మరియు రీసెర్చ్ స్కాలర్‌లు రూపొందించే పరిశోధన ప్రచురణలు మరియు పేటెంట్‌లతో విఐటి-ఏపి విశ్వవిద్యాలయం పరిశోధన రంగంలో సాధిస్తున్న ప్రగతిని వివరించారు. విఐటి-ఏపి విశ్వవిద్యాలయం గత రెండు సంవత్సరాలుగా అవుట్ లుక్ మాగజీన్ ర్యాంకింగ్స్‌లో భారతదేశంలో ఎమర్జింగ్ స్టేట్ ప్రైవేట్ విశ్వవిద్యాలయాల కేటగిరీలో మొదటి స్థానంలో నిలుస్తుందని తెలియచేసారు. విఐటి-ఏపి విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా:జగదీష్ చంద్ర ముదిగంటి మాట్లాడుతూ విఐటి-ఏపి విశ్వవిద్యాలయం భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న విశ్వవిద్యాలయాలలో ఒకటిగా గుర్తించబడిందని తెలియచేసారు. మొదటి ఐసిఏఎన్ఏ అంతర్జాతీయ సదస్సు 2022 సంవత్సరంలో నిర్వహించటం మరియు అది విజయవంతం కావడం గురించి కూడా ప్రస్తావించారు, ఈ సదస్సులో భారతదేశం మరియు ప్రపంచం నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో ఔత్సాహికులు పాల్గొని అకడమిక్ ఎక్స్చేంజ్ మరియు పరిశోధన సహకారాన్ని కొనసాగించడంలో సహాయపడుతుందని తెలియచేసారు. రెండవ ఐసిఏఎన్ఏ 2024 నిర్వహించినందుకు స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ సైన్సెస్ విభాగాన్ని అభినందించారు. ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాస్ (డీన్-స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ సైన్సెస్) మాట్లాడుతూ స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ సైన్సెస్ యొక్క ముఖ్య లక్ష్యాలను వివరించారు. ప్రపంచ నలుమూలల నుండి ఈ సదస్సుకు హాజరయిన ఔత్సాహికులకు, వక్తలకు కృతజ్ఞతలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌కే మూర్తి (ఎమిరిటస్ ప్రొఫెసర్), సంధ్యా సదానందన్(అసిస్టెంట్ ప్రొఫెసర్, స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ సైన్సెస్), ప్రొఫెసర్ రజనీకాంత్ (అసోసియేట్ డీన్, స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ సైన్సెస్), విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నాగమానసాదేవికి ప్రత్యేక పూజలు

**విజయవాడ,(గవర్నర్‌పేట) జూలై 11 (ఆంధ్రపత్రిక):** ఆషాడ మాసం పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని లెనిన్ సెంటర్లోని ఓం శ్రీషిర్డి నాగసాయిబాబా, నాగమానసాదేవి మందిరంలో గురువారం భక్తులు నాగమానసాదేవి అమ్మవారికి చీరలు సమర్పించారు. మందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళా భక్తులు పసుపు, కుంకుమతో పాటు గాజులు, పండ్లు, పూలు సమర్పించారు. సుధాస్వామి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.











ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి ఉత్తరాంధ్రలో చంద్రబాబు నాయుడు పర్యటించారు. అనకాపల్లి జిల్లా, పాయకరావుపేట నియోజకవర్గం, దార్లపూడి వద్ద పోలవరం ఎడమ కాల్వను పరిశీలించారు. అంతకముందు కాల్వ పనులపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు, జిల్లా ఉన్నతాధికారులు స్వాగతం పలికారు.









గురువారం విజయవాడలో 52వ కేంద్రీయ విద్యాలయ ప్రాంతీయ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌ను ప్రారంభించిన విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), డీఆర్ఎం నరేంద్ర పాటిల్ తదితరులు..





విజయవాడలోని ఆటోనగర్ ఏపీఐఐసీ కాలనీ రైతుబజార్‌లో సబ్సిడీ బియ్యం, ఎర్రబెల్లం పంపిణీ చేసిన పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, స్థానిక ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్..

ఆంధ్రపత్రిక ఫోటోలు: సిహెచ్.విజయభాస్కర్

Printed and Published by KANCHARLA RAMAIAH on behalf of Nageswara Rao Estates Private Limited,Printed at Jagati Publications Limited, Sakshi Press, SY.No.481, Phase-2, Jawahar Autonagar, Vijayawada-520007 Andhra Pradesh,
and Published from D.NO.29-28-34, Dasari vari street, Suryaraopeta,Vijayawada-520002, KRISHNA DISTRICT-ANDHRA PRADESH, Editor : KANCHARLA RAMAIAH. Excutive editor V.VIJAYALAKSHMI. RNI no. 10721/65 Mobile:9849998069, Email:andhrapatrikadaily@gmail.com